thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 341 కరీంనగర్ ఆదివారం, 16 ఫిబ్రవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## 28న పాంబన్‌కు ప్రధాని మోదీ

చెన్నై: ఈ నెల 28న ప్రధాని నరేంద్రమోదీ రామనాథపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఆ సందర్భంగా పాంబన్ వద్ద మండపం, రామేశ్వరం దీవిని కలు పుతూ సముద్రంపై రూ.550 కోట్లతో ని ర్మించిన రైలు వంతెనను ఆయన జాతికి అంకి తం చేయనున్నారు. ప్రధాని పర్యటనను పురస్కరించుకుని రామేశ్వరం, ధనుష్కోడి తదితర ప్రాంతాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. వంతెన ప్రారంభోత్సవ ప్రాంతంలో వేదిక నిర్మాణ పనులకు కూడా అధికారులు శ్రీకారం చుట్టారు. ఇదిలా ఉండగా దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్ఎన్ సింగ్ ఇతర అధికారులు పాంబన్ కొత్త వంతెనపై తుది విడత పరిశీలన, తనిఖీ నిర్వహించారు. ఈ రైలు వంతెనను ప్రధాని 28న ప్రారంభించనున్నారనే సమాచారం అందటంతో రైల్వే శాఖ ఉన్నతాధికారులు, కేంద్ర భద్రతా విభాగం ఉన్నతాధికారులు కూడా ఆ రైలు వంతెనను పరిశీలించారు.

## మంత్రి వర్గ విస్తరణ ఇప్పట్లో కానట్లేనా...

# ఢిల్లీ వెళ్లిన రాని క్లారిటీ!




న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కావడంతో కేబినెట్ విస్తరణ కోసమేనని ఊహాగానాలు వినిపించాయి. మంత్రి పదవులు ఆశిస్తోన్న ఆశావహులు సైతం అప్రమత్తమయ్యారు. ఈ క్రమంలోనే కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. రాహుల్ గాంధీతో భేటీ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో చేసిన కుల గణన గురించి రాహుల్ గాంధీకి వివరించానని తెలిపారు. కేవలం కుల గణన, ఎస్సీ వర్గీకరణపై మాత్రమే రాహుల్ గాంధీతో చర్చించానని.. కేబినెట్ విస్తరణ, పీసీసీ కార్యకర్గ కూర్పుపై ఎలాంటి డిస్కషన్ జరగలేదని క్లారిటీ ఇచ్చారు. మంత్రి వర్గ విస్తరణ, పీసీసీ క్యార్గవర్గంపై చర్చించేందుకే ఈ భేటీ అన్న ఊహాగానాలు రేవంత్ రెడ్డి కొట్టి పారేశారు. కేబినెట్ విస్తరణ అంశం హై కమాండ్ చూసుకుంటుందని స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపుల అంశంపైన సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటామని స్పష్టం చేశారు. కోర్టులు చేసే పనిని కేటీఆర్ చేయాలనుకుంటున్నారని.. ఉప ఎన్నికలు వస్తాయో రావో కేటీఆరే చెప్పేస్తున్నారని మండిపడ్డారు. గతంలో సబితా ఇంద్రారెడ్డి ఏ బీ ఫామ్ మీద గెలిచారు..? ఎవరి మంత్రి వర్గంలో పనిచేశారు..? తలసాని శ్రీనివాస్ 2014లో గెలిచింది ఏ బీ ఫామ్ మీద, మంత్రిగా పనిచేసింది ఎవరి ప్రభుత్వంలో..? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కుల గణన, ఎస్సీ వర్గీకరణలో కమిషన్లు ఇచ్చే నివేదికలు చట్టబద్ధం చేస్తామని చెప్పారు. వీటిలో ఎక్కడా రాజకీయ జోక్యం ఉండదన్నారు. రాజకీయ జోక్యం ఉండకూడదు అనే ఉద్దేశ్యంతోనే కమిషన్ ఏర్పాటు చేస్తున్నామని క్లారిటీ ఇచ్చారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్?కు పంపుతామని పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాల్లో కుల గుణన, ఎస్సీ వర్గీకరణ చట్టరూపంలో తీసుకొచ్చి ఆమోదం తెలిపి కేంద్రానికి పంపుతామని చెప్పారు.

# కేజ్రీవాల్ ఓటమితో కవిత మళ్లీ జైలుకు? బిఆర్ఎస్ శ్రేణుల్లో టెన్షన్




ఢిల్లీ లిక్కర్ స్కాం మరో మారు చర్చనీయాంశమైంది. ఢిల్లీ ఫలితాలు బిజెపికి అనుకూలంగా ఆమ్ ఆద్మీ పార్టీకి వ్యతిరేకంగా రావడమే దీనికి ప్రధాన కారణం. ఆమ్ ఆద్మీ పార్టీ హాయంలో కేబినేట్ భేటీలో నిర్ణయాలు తీసుకోకుండానే లిక్కర్ పాలసీ అమలయ్యింది. ఈ పాలసీ అమలుకు పెద్ద ఎత్తున చేతులు మారాయి. కోట్లాది రూపాయల స్కాం జరగడంతో ముఖ్యమంత్రి హోదాలో కేజ్రీవాల్, డిప్యూటి సిఎం హోదాలో మనీష్ సిసోడియా జైలుపాలయ్యారు. బెయిల్ పై వీరు బయటకొచ్చి బిజెపి ని నిందించారు. తమను బిజెపి కుట్ర పూరితంగా ఇరికించినట్టు ఆరోపించారు. ఢిల్లీ ఎన్నికల ప్రచారంలో కూడా ఇదే ప్రచారం చేసినప్పటికీ ప్రజలు పెద్దగా స్పందించలేదు. కేజ్రీవాల్, మనీష్ సిసోడియా నేతృత్వం వహిస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీని వోటర్లు తిరస్కరించారు. ఢిల్లీ లిక్కర్ స్కాంపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతామని బిజెపి ఇప్పటికే ప్రకటించింది. ఢిల్లీ సచివాలయం నుంచి ఒక్క కాగితం బయటకు వెళ్లకూడదని ఆదేశాలు జారి అయ్యాయి. ఢిల్లీ సచివాలయం దాదాపు సీజ్ అయినంత పనయ్యింది. మేం అధికారంలో వస్తే ఢిల్లీలో పదేళ్లు అధికారంలో ఉన్నఆమ్ ఆద్మీ పార్టీ పై పూర్తిస్థాయి విచారణ జరుపుతామని బిజెపి ఎన్నికల ప్రచారంలో వెల్లడించింది. తాను జైలుకు వెళ్ల కూడదని కోరుకుంటే ఆమ్ ఆద్మీ పార్టీకే వోటు వేయాలని కేజ్రీవాల్ ప్రచారం చేశారు. ఆయన ప్రచారాన్ని ప్రజలు పెద్దగా రిసీవ్ చేసుకోలేదు. ఇప్పుడు ఢిల్లీ ఫలితాలు బిజెపి కి అనుకూలంగా రావడంతో కేజ్రీవాల్ మళ్లీ జైలుకు వెళతారని అర్థం చేసుకోవాలి. ఢిల్లీలో బిజెపి గెలుపు తర్వాత బిఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటీఆర్ చేసిన ట్వీట్ ఇప్పుడు పెద్ద దుమారం రేపింది. ఢిల్లీలో బిజెపిని గెలిపించినందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఆయన అభినందనలు తెలుపుతూ ట్వీట్ చేశారు. .ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ఓడిపోవడానికి బిఆర్ ఎస్ ప్రధాన కారణమని తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులు కౌంటర్ ట్వీట్ లు చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లిక్కర్ స్కాంలో కేజ్రీవాల్, మనీష్ సిసోడియా ముఖ్యభూమిక వహించారు. లిక్కర్ పాలసీ అమలు కావడానికి వీరు ప్రధాన కారకులని న్యాయనిపుణులు పేర్కొన్నారు. ఇదే కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు జైలుపాలయ్యారు. తెలంగాణలో బిఆర్ఎస్ ఓటమి తర్వాత లిక్కర్ స్కాం అప్పట్లో తెరమీదకు వచ్చింది. ఇదే కేసులో బిఆర్ఎస్ ఎంఎల్ సి కల్వకుంట్ల కవిత అరెస్ట్ అయ్యారు. బిఆర్ ఎస్ అవసరం లేకపోవడంతో కవిత అరెస్ట్ జరిగిందని అప్పట్లో బిఆర్ఎస్ ప్రచారం చేసింది. బిఆర్ ఎస్ పార్టీని బిజెపి లో విలీనం చేయలన్న కండిషన్ ను కెసీఆర్ తిరస్కరించినట్టు కూడా ప్రచారం జరిగింది. రాజకీయ ప్రయోజనాలు కూడా పెద్దగా లేకపోవడంతో బిఆర్ ఎస్ ను బిజెపి పూర్తిగా పక్కన పెట్టేసింది. దీంతో తీహార్ జైల్లో ఎక్కువకాలం కవిత ఊచలు లెక్కబెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ కు బద్ద శత్రువైన బిజెపి బిఆర్ఎస్ కు సపోర్ట్ ఇవ్వకపోవడంతో బిఆర్ఎస్ ఇరుకునపడిపోయింది. కాంగ్రెస్ నేతృత్వం వహిస్తున్నఇండియా కూటమిలో బిఆర్ఎస్ లేకపోవడంతో బిజెపి పెద్దలకు దగ్గరవ్వాలన్న బిఆర్ఎస్ ప్రయత్నాలు ఫలించలేదు. లిక్కర్ స్కాంలో సౌత్ గ్రూప్ ను కవిత లీడ్ చేశారు. ఈ సౌత్ గ్రూప్ ఢిల్లీ ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తెచ్చుకుంది. రాజులు తల్చుకుంటే దెబ్బలకు కొదువా అన్నట్టు రెండు ప్రభుత్వాలు అధికార దుర్వియోగానికి పాల్పడ్డాయి. ఆమ్ ఆద్మీ పార్టీ, బిఆర్ఎస్ నేతలు లిక్కర్ స్కాంలో నిందితులు కావడంతో ఢిల్లీ ఫలితాలు వారి గుండెల్లో రైలు పరుగెత్తిస్తున్నాయి. బెయిల్ పై బయట ఉన్న కవితను మళ్లీ జైలుకు పంపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది. కవిత జైలు నుంచి విడుదలయ్యాక క్రియాశీల రాజకీయాలకు దూరమయ్యారు. ఇప్పుడిప్పుడే ఆమె తెలంగాణ రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటు న్నారు. కవితకు స్పీడ్ బ్రేక్ వేసే పనిలో బిజెపి ప్రభుత్వం ఉంది. ప్రస్తుతం ఎన్డీఏ కూటమిలో బిఆర్ఎస్ లేకపోవడంతో లిక్కర్ స్కాంను బిజెపి ప్రభుత్వం మళ్లీ వెలికి తీసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.




## పండగైనా బ్యాంకులు పనిచేయాల్సిందే: ఆర్‌బీఐ

మార్చి 31, 2025 (సోమవారం) ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికీ.. అన్ని బ్యాంకులు పనిచేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగింపు రోజు కాబట్టి.. అన్ని లావాదేవాలను అదే రోజు నమోదయ్యేలా చూసేందుకు సెలవు రద్దు చేయడం జరిగింది. 2025 ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానుంది. కాబట్టి అప్పటికే పన్ను చెల్లింపులు (ఆదాయపు పన్ను, జీఎస్టీ, కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాలు), పెన్షన్ చెల్లింపులు, ప్రభుత్వ సబ్సిడీలు, ప్రభుత్వ జీతభత్యాల చెల్లింపు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రజా లావాదేవీలను ముగించాల్సి ఉంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. నిజానికి మార్చి 31 రంజాన్ పండుగ, ఈ కారణంగానే.. దేశంలోని అన్ని బ్యాంకులకు సెలవు. ఆర్థిక సంవత్సరం చివరి రోజు కావడంతో ఆ రోజు బ్యాంకులన్నీ పనిచేయాలని.. ఆర్థిక కార్యకలాపాలకు సంబంధించిన అన్ని పనులను పూర్తి చేయాలనీ ఆర్‌బీఐ ఆదేశించింది. అంతే కాకుండా ఏప్రిల్ 1న సెలవు దినంగా ప్రకటించింది. ఆన్‌లైన్ సేవలు అన్ని సెలవు దినాల్లో కూడా అందుబాటులో ఉంటాయి. కాబట్టి ఆన్‌లైన్ లావాదేవీలకు ఎలాంటి ఆటంకం ఉండదు.




## ఏప్రిల్ లేదా మే నెలలో...

# స్థానిక ఎన్నికలు..!

### బీసీ రిజర్వేషన్లపై సర్కార్ నిర్ణయంతో ఆలస్యం
### మరికొంత కాలం స్పెషల్‌ఆఫీసర్ల పాలనే
### తమిళనాడు తరహా వ్యూహాన్ని అమలు చేసే యోచనలో ప్రభుత్వం

హైదరాబాద్ : రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు బ్రేక్ పడింది. మరికొంత కాలం స్పెషల్ ఆఫీసర్ల పాలనే కొనసాగనుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ వచ్చే నెలలో చట్టం చేయాలని భావిస్తున్న ప్రభుత్వం.. అప్పటిదాకా స్థానిక ఎన్నికలను వాయిదా వేయాలని నిర్ణయించింది. మార్చిలో అసెంబ్లీలో చట్టం చేయడంతో పాటు ఆ తర్వాత పార్లమెంట్ లోనూ బిల్లును తెచ్చేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని సర్కార్ భావిస్తున్నది. అదే నెలలో బడ్జెట్ సమావేశాలు కూడా ఉన్నాయి. ఇక మార్చి 16 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. దీంతో ఏప్రిల్ మూడో వారంలో గానీ లేదంటే మే చివరి వారంలో గానీ స్థానిక ఎన్నికలకు ప్రభుత్వం వెళ్లవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

మేలో ఎండలు విపరీతంగా ఉండే అవకాశం ఉన్నందున ఏప్రిల్‌లోపే ముగించవచ్చని, లేదంటే మే చివరి వారంలో నిర్వహించవచ్చని భావిస్తున్నారు. మొత్తమ్మీద వరుసగా సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే పాలక వర్గాల పదవీ కాలం ముగిసిన మున్సిపాలిటీల్లోనూ స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతున్నది. దీంతో రూరల్ లోకల్ బాడీస్ ఎన్నికలు పూర్తవగానే.. అర్బన్ లోకల్?బాడీస్ ఎలక్షన్స్ నిర్వహించాలని, ఈ ఎన్నికలన్నింటినీ జూన్ కల్లా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది.

**తమిళనాడు తరహాలో అమలు..** రాష్ట్రంలోనూ తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలనేది ప్రభుత్వం ఆలోచనగా కనిపిస్తున్నది. దేశవ్యాప్తంగా 50 శాతంలోపు రిజర్వేషన్లు అమలు అవుతుండగా, ఒక్క తమిళనాడులో మాత్రమే 69 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. ఇందుకు నాటి కేంద్ర ప్రభుత్వం ఒప్పుకోవడం, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్పించడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రిజర్వేషన్లు కొనసాగుతున్నాయి. ఇప్పుడదే పద్ధతిలో తెలంగాణలోనూ రిజర్వేషన్లు పెంచుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఇందుకోసం అసెంబ్లీలో చట్టం చేసి, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించింది. వాస్తవానికి తమిళనాడులో 1969లో ఎన్ సత్తనాథన్ నేతృత్వంలో వెనుకబడిన తరగతుల కమిషన్ ఏర్పాటైంది. ఇందుకు అనుగుణంగా1971లో నాటి డీఎంకే ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 31 శాతానికి.. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను 6 శాతం నుంచి 18 శాతానికి పెంచింది. దాంతో మొత్తం రిజర్వేషన్లు 49 శాతమయ్యాయి. ఆ తర్వాత ఎం.జి రామచంద్రన్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 31 శాతం నుంచి 50 శాతానికి చేర్చింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో మాత్రం మార్పు చేయలేదు. దీంతో రిజర్వేషన్ల శాతం 69కి పెరిగింది. కానీ మొత్తం రిజర్వేషన్లు ఎట్టి పరిస్థితుల్లో 50శాతానికి మించకూడదని 1992లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. దీంతో తమిళనాడు ప్రభుత్వం1993లో బీసీ కమిషన్ వేసింది. రిజర్వేషన్లపై అసెంబ్లీలో చట్టం చేసి, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్పించింది. 2001లో సుప్రీంకోర్టు సంబంధిత కమ్యూనిటీలను దృష్టిలో పెట్టుకుని రిజర్వేషన్లు 50 శాతానికి మించవచ్చునని నోటిఫై చేసింది. దీంతో తమిళనాడులో బీసీలకు 30 శాతం, ఎంబీసీలకు 20 శాతం, ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు ఒక శాతంచొప్పున 69 శాతం రిజర్వేషన్లు సక్సెస్ ఫుల్‌గా అమలవుతున్నాయి.



## మెదక్ ఎస్సీ వర్గీకరణ సభకు రండీ రాహుల్ గాంధీకి సీఎం రేవంత్ ఆహ్వానం

ఢిల్లీ : సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలతో వరుస భేటీలతో బిజీగా ఉన్నారు. ఇవాళ (ఫిబ్రవరి 15) రాహుల్ గాంధీని కలిసిన రేవంత్.. కులగణన సక్సెస్ గురించి వివరించారు. తెలంగాణలో కులాల వారిగా జనాభా లెక్కలను, కులగణను విజయవంతంగా పూర్తి చేసిన విధానాన్ని వివరించారు. సోనియాగాంధీ ఇంట్లో జరిగిన భేటీలో మెదక్ ఎస్సీ వర్గీకరణ సభకు రావాలని రాహుల్ గాంధీని ఆహ్వానించారు సీఎం రేవంత్. అదేవిధంగా సూర్యాపేటలో జరిగే భారీ బహిరంగ సభకు రావాల్సిందిగా కోరారు. ఆ తర్వాత ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్ తో భేటీ అయ్యారు సీఎం. తెలంగాణలో కులగణన సక్సెస్, ప్రభుత్వ పనితీరు, తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు తెలుస్తోంది.



## ఢిల్లీలా హైదరాబాద్‌ను కానివ్వం.. అన్నింటిని ఎలక్ట్రిక్ వెహికల్స్ గా మారుస్తాం

హైదరాబాద్ : భవిష్యత్ లో హైదరాబాద్ లోని చాలా వెహికల్స్ ను బ్యాటరీ వెహికల్స్ గా మార్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. ఎలక్ట్రానికి వాహనాలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ హెచ్ఐసీసీలో గ్రీన్ తెలంగాణ సమ్మిట్ కు హాజరైన భట్టి.. భవిష్యత్తులో సిటీలో ఉన్న బస్సులను దశలవారీగా బ్యాటరీ బస్సులుగా మారుస్తామని చెప్పారు. ఢిల్లీ లాగా మన హైదరాబాద్ ని కానివ్వబోమన్నారు. భవిష్యత్ లో అన్నీ ఎలక్ట్రిక్ బస్సులనే నడిపిస్తామన్నారు. ఫ్యూచర్ సిటీ ముఖ్యమంత్రి డ్రీమ్.. దానిని నెట్ జీరో సిటీగా చేయబోతున్నాం. హైదరాబాద్ ను నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చెప్పారు భట్టి. మూసీ పునరుజ్జీవన కార్యక్రమంలో ఒక మైలు రాయి లాంటిదని చెప్పారు భట్టి. మూసీలో మంచినీళ్లు పారేలా చర్యలు తీసుకుంటామన్నారు. మూసీ ప్రక్షాళన కోసం ఎంతైనా ఖర్చు చేస్తామన్నారు. దశాబ్ద కాలంగా స్టేట్ లో ఎనర్జీ పాలసీ లేదన్నారు భట్టి. దావోస్ లో రాష్ట్రానికి లక్షా 50వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం 10 వేల కోట్లు కేటాయించాం..ఫ్లై ఓవర్లు, సబ్ వే లు నిర్మిస్తామన్నారు. రియల్ ఎస్టేట్ రంగం, కన్స్ట్రక్షన్ సంస్థలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తామని చెప్పారు. బిల్డర్స్ ని ఇబ్బంది పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు చూడదన్నారు. గ్రీన్ బిల్డింగ్ ప్రాజెక్ట్ లకి రాష్ట్ర ప్రభుత్వ సపోర్ట్ ఉంటుందన్నారు. తెలంగాణ యంగ్ స్టేట్ అయినా చాలా ఫాస్ట్ గా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తాము చేసేపని ప్రతిదీ రాష్ట్రాభివృద్ధి కోసమేనని చెప్పారు.

## క్యాన్సర్ బాధితులు మనోధైర్యంతో ఉంటే కచ్చితంగా కోలుకుంటారు: బాలకృష్ణ



హైదరాబాద్: బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిని మరింత విస్తరించనున్నామని ఆస్పత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ తెలిపారు. హైదరాబాద్‌లోని క్యాన్సర్ ఆస్పత్రిలో ఆంకాలజీ యూనిట్‌ను ప్రారంభించిన అనంతరం బాలకృష్ణ మాట్లాడారు. ఇవాళ పీడియాట్రిక్ వార్డు, పీడియాట్రిక్ ఐసీయూను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. క్యాన్సర్ బాధితులు మనోధైర్యంతో ఉంటే కచ్చితంగా కోలుకుంటారని పేర్కొన్నారు.

విస్తరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని తుళ్లూరులో మరో 8 నెలల్లో ఆస్పత్రిని ప్రారంభిస్తామని బాలకృష్ణ తెలిపారు.

## తెలంగాణను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నారు.. రేవంత్ ప్రభుత్వంపై కిషన్‌రెడ్డి విసుర్లు



నల్గొండ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు ప్రాధాన్యం ఇచ్చిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. తెలంగాణకు ఇచ్చిన నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమా అని రేవంత్ ప్రభుత్వానికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. తెలంగాణలో జాతీయ రహదారుల కోసం లక్షా 20వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశామని అన్నారు. రూ. 80వేల కోట్ల పనులు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. కేంద్రం నుంచి రీజనల్ రింగ్ రోడ్, మెగా టెక్స్ టైల్ పార్క్, రైల్వే కోచ్ తెచ్చామని ఉద్ఘాటించారు. ఇవాళ(శనివారం) నల్గొండలో కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పులి సరోత్తమ్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మూడు ఎన్నికల్లోనూ పోటీ చేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ మాత్రమే అని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల అకాంక్షల కోసం బీజేపీ పనిచేస్తుందని అన్నారు. రూ. 7వేల కోట్లతో రామగుండంలో యూరియా ఉత్పత్తి చేసే పరిశ్రమ ఏర్పాటుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భూమి పూజ చేశారని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఎరువులకు సబ్సిడీ ఇస్తూ రైతులను బీజేపీ ఆదుకుంటుందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు కేంద్రం ఏం ఇచ్చిందని అడగడం ఫ్యాషన్‌గా మారిందని విమర్శించారు.

2014 మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను పూర్తిగా బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే దివాలా తీయించామని ఆరోపించారు. 11 ఏళ్లలో రూ.10 లక్షల కోట్లు రెండు పార్టీలు కలిసి అప్పులు చేశాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని మండిపడ్డారు. అద్భుతమైన తెలంగాణ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## రేవంత్ రెడ్డిను చూసి సమాజం తలదించుకుంటోంది

సిద్దిపేట : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కులంపై సీఎం రేవంత్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యులు, పార్లమెంటరీ బోర్డ్ మెంబర్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డా. లక్ష్మణ్ అన్నారు. సిద్దిపేటలో లక్ష్మణ్ పర్యటించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. మోదీ ఒక వర్గానికి, సమాజానికి చెందిన వారు కాదు.. ప్రజలందరి మనిషి. ప్రపంచ ఖ్యాతి కలిగిన వ్యక్తి అని తెలిపారు. మోదీపై గతంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ కూడా ఇలాగే అవాకులు, చెవాకులు పేలారని అన్నారు. రాహుల్‌కు పట్టిన గతే రేవంత్‌కు పట్టడం ఖాయమని హెచ్చరించారు. మోదీని విమర్శిస్తే, పేరు వస్తుందని రేవంత్ అనుకుంటున్నారని లక్ష్మణ్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ కులగణన తప్పుల తడకగా మారిందని లక్ష్మణ్ విమర్శించారు. మైనార్టీ బుజ్జగింపు రాజకీయాలకు నిదర్శనమంటే మైనార్టీలతో కూడిన బీసీ కులజాబితా అని చెప్పారు. ముస్లింలను బీసీలో చేర్చి.. ఓట్ల కోసం రేవంత్ పాకులాడుతున్నారని మండిపడ్డారు. మత ప్రాతపదికన రిజర్వేషన్లను బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని చెప్పారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన గ్యారెంటీలకు తూట్లు పొడిచారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రజలు నిరాశతో ఉన్నారని చెప్పారు. మోసపూరిత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని లక్ష్మణ్ హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు సెమీఫైనల్‌గా భావించి రేవంత్ ప్రభుత్వానికి కళ్లెం వేయాలని అన్నారు. మేధావులు ఆలోచన చేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని లక్ష్మణ్ కోరారు. రేవంత్ రెడ్డిను చూసి సమాజం తలదించుకుంటుందని విమర్శించారు. %%20 మ్యాచ్ ఆడిన కేసీఆర్‌కు పట్టిన గతే.. రేవంత్‌కూ పడుతుందని మండిపడ్డారు. 15 ఏళ్లల్లో ఢిల్లీలో మూడుసార్లు రాహుల్ డకౌట్ అయ్యారని విమర్శించారు. మోదీ తినే ఆహారాన్ని, వేసుకునే బట్టలను విమర్శిస్తారా అని ప్రశ్నించారు. తెలంగాణకు మోదీ వేల కోట్ల నిధులు ఇస్తున్నా.. ఇన్ని విమర్శలు చేస్తారా అని లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



## మద్యం అమ్మకాల్లో రికార్డులు తిరగరాస్తున్న తెలంగాణ

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో మద్యం అమ్మకాల గురించి కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. ఈరోజు అధికారంలోకి ఏ ప్రభుత్వం వచ్చిన మద్యం అమ్మకాల ద్వారా వచ్చే డబ్బుతో రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు అందిస్తున్నారు.

దీని బట్టి చెప్పొచ్చు రాష్ట్రంలో మద్యం అమ్మకాల జోరు ఏ రేంజ్ లో సాగుతుందో. మాములు రోజుల్లోనే భారీగా మద్యం అమ్మకాలు కొనసాగుతాయి. ఇక పండగల సీజన్లు , న్యూ ఇయర్ సందర్భాల్లో అయితే ట్రిపుల్ అమ్మకాలు సాగుతాయి. ఇదే విషయాన్నీ కేంద్రమంత్రి చెప్పుకొచ్చాడు. రాజ్యసభలో కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి. తెలంగాణలో 50శాతం మంది పురుషులు మద్యం తాగుతున్నారని తెలిపాడు. కాకపోతే గతంకంటే ఈ సంఖ్య కాస్త తగ్గిందని చెప్పడం కొసమెరుపు. రాజ్యసభలో ఎదురైనా ప్రశ్నకు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయ మంత్రి అనుప్రియపటేల్ సమాధానం ఇస్తూ.. భారతదేశంలో తెలంగాణలోనే అత్యధిక మంది మద్యం సేవిస్తున్నట్లు చెప్పుకొచ్చాడు. 50శాతం మంది పురుషులు రాష్ట్రంలో మద్యం సేవిస్తున్నారట. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే -4 ప్రకారం.. ఏపీలో 34.9శాతం మంది, తెలంగాణలో 53.8శాతం మంది పురుషులు మద్యం సేవిస్తున్నారు. అయితే, 2019-21 నాటి 5వ సర్వే నివేదిక ప్రకారం.. రెండు రాష్ట్రాల్లో ఆ సంఖ్య కాస్త తగ్గింది.

ఏపీలో 31.2శాతం, తెలంగాణలో 50శాతం మంది పురుషులు మద్యం సేవిస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకే తెలంగాణ మద్యం అమ్మకాల్లో రికార్డ్స్ బ్రేక్ చేస్తుందని తెలిపారు.



## ఎమ్మెల్సీ బరిలో.. మెదక్ నేతలే టాప్

### ఎమ్మెల్సీ బరిలో గ్రాడ్యుయేట్ స్థానంలో 11 మంది, టీచర్స్ స్థానంలో ఐదుగురు పోటీ

మెదక్ : కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. బరిలో మిగిలిన అభ్యర్థులు ఎంతమంది అనేది తేలిపోయింది. నామినేషన్ల విత్ డ్రా అనంతరం గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో 56 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. టీచర్స్ ఎమ్మెల్సీ స్థానంలో 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఎమ్మెల్సీ నియోజకవర్గాల పరిధి ఉమ్మడి మెదక్, ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విస్తరించి ఉండగా రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ ఉమ్మడి మెదక్ ?జిల్లావారే ఎక్కువ మంది పోటీలో ఉన్నారు. పోటీదారుల్లో ప్రధాన రాజకీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు, ప్రధాన టీచర్స్ యూనియన్ అభ్యర్థులు ఇక్కడి వారే ఉన్నారు. దీంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో మెదక్ జిల్లా కీలక పాత్ర పోషించనుంది.

**గ్రాడ్యుయేట్ స్థానంలో..** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 56 మంది బరిలో ఉండగా వారిలో అత్యధికంగా 11 మంది అభ్యర్థులు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వారు ఉన్నారు. సంగారెడ్డి జిల్లా రామచంద్రపూర్ కు చెందిన చిన్నమైల్ అంజిరెడ్డి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. సదాశివపేటకు చెందిన దొడ్ల వెంకటేశం తెలంగాణ ప్రజాశక్తి పార్టీ అభ్యర్థిగా, ఇంద్రకరణ్ కు చెందిన చంద్రశేఖర్ ఆలిండియా కిసాన్ జనతా పార్టీ అభ్యర్థిగా, సిద్దిపేటకు చెందిన మంద జ్యోతి ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా, పాములపర్తికి చెందిన సిల్వర్ ఇంద్ర గౌడ్ నేషనల్ నవ క్రాంతి పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. వీరే కాకుండా సిద్దిపేట జిల్లా చిట్టాపూర్ కు చెందిన అశోక్ గౌడ్, సిద్దిపేట టౌన్ కు చెందిన దేవునూరు రవీందర్, దుబ్బాక కు చెందిన మచ్చ శ్రీనివాస్, పెద్ద లింగారెడ్డి పేటకు చెందిన గుమ్మడి శ్రీశైలం, సంగారెడ్డి జిల్లా పటాన్ చెరుకు చెందిన కే.శంకర్ రావ్, చిగురుపల్లికి చెందిన చిట్కుల్ నరేందర్ రెడ్డి ఇండిపెండెంట్లుగా బరిలో ఉన్నారు. ఇండిపెండెంట్ అభ్యర్థులు ఎక్కువ మంది పోటీలో ఉండడంతో ఎన్నికల్లో ఏ మేరకు ప్రభావం చూపుతారు, ఎవరి ఓట్లకు గండి కొడతారు అన్నది ఆసక్తికరంగా మారింది.

**టీచర్స్ స్థానంలో..** టీచర్స్ ఎమ్మెల్సీ స్థానంలో 15 మంది బరిలో నిలవగా వారిలో ఐదుగురు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వారు ఉన్నారు. టీపీఆర్టీయూ మద్దతుతో పోటీ చేస్తున్న వంగ మహేందర్ రెడ్డి సిద్దిపేట పట్టణానికి, సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి సిద్దిపేట జిల్లా గోనేపల్లికి, మరో అభ్యర్థి జగ్గు మల్లారెడ్డి సిద్దిపేట పట్టణానికి చెందిన వారు కాగా, టీపీటీఎఫ్ మద్దతుతో పోటీలో ఉన్న వై. అశోక్ కుమార్ సంగారెడ్డి జిల్లా మల్లాపూర్ కు చెందిన వారు. మరో అభ్యర్థి మామిడి సుధాకర్ రెడ్డి మెదక్ జిల్లా టేక్మాల్ కు చెందిన వారు. టీచర్స్ ఎమ్మెల్సీ స్థానంలో ఎక్కువ మంది ఉమ్మడి మెదక్ జిల్లా కు చెందిన వారే కావడంతో పోటీ రసవత్తరంగా మారింది.

## మీనాక్షి నటరాజన్ ఎవరు ? ఆమె మొదటి టార్గెట్ అదేనా ?



మీనాక్షి నటరాజన్.. తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త ఇంఛార్జిగా నియమితులు అయ్యారు. ఇప్పటివరకు ఆమె కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ టీమ్‌లో విధులు నిర్వర్తించారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు సమీపించిన వేళ రాహుల్‌గాంధీ ప్రత్యేక శ్రద్ధతో మీనాక్షి నటరాజన్‌కు ఈ ముఖ్యమైన బాధ్యతలను అప్పగించారు. ఇంతకీ మీనాక్షి ఎవరు ? ఆమె నేపథ్యం ఏమిటి ?

**మీనాక్షి నటరాజన్ నేపథ్యం ఇదీ..** మీనాక్షి నటరాజన్ మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో 1973 జులై 23న జన్మించారు. ఆమె బయో కెమిస్ట్రీలో పీజీ చేశారు. ఎల్ఎల్‌బీ చేశారు. మధ్యప్రదేశ్‌లోని రత్లాంలో మీనాక్షి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1999-2002 వరకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షురాలిగా మీనాక్షి పనిచేశారు. 2002-2005 మధ్య కాలంలో మధ్యప్రదేశ్ యువజన కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సేవలు అందించారు. 2008లో ఏఐసీసీ కార్యదర్శిగా మీనాక్షి ఎంపికయ్యారు. మీనాక్షి రాసిన పుస్తకాల పేర్లు "1857-2009 లోక్‌సభ ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లోని మంద్‌సౌర్ స్థానం నుంచి పోటీ చేసే అవకాశాన్ని మీనాక్షికి రాహుల్ గాంధీ కల్పించారు. ఆ ఎన్నికల్లో 30వేల ఓట్ల మెజారిటీతో ఆమె గెలిచారు. 1971 నుంచి వరుసగా ఎన్నికల్లో గెలుస్తూ వస్తున్న బీజేపీ అభ్యర్థి లక్ష్మీనారాయణ్ పాండేను మీనాక్షి ఓడించారు. 2009 యూపీఏ ప్రభుత్వంలో సర్కారీ సిబ్బంది, ప్రజా విన్నపాలు, న్యాయశాఖ, మహిళా సాధికారతలపై ఏర్పాటు చేసిన కమిటీలో సభ్యురాలిగా మీనాక్షి వ్యవహరించారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో మంద్ సౌర్ లోక్‌సభ స్థానంలో మీనాక్షి ఓడిపోయారు. అక్కడ బీజేపీ అభ్యర్థి సుధీర్ గుప్తా ఏకంగా 3 లక్షల మెజారిటీతో గెలిచారు. మీనాక్షి నటరాజన్ గురించి ఒకసారి కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. "ఎలాంటి నిందను/అపవాదును మోపలేని 100 శాతం స్వచ్ఛమైన మెటీరియల్ మీనాక్షి నటరాజన్" అని ఆయన చెప్పారు. దీన్నిబట్టి రాజకీయాల్లో ఆమె ఎంత సూటిగా ఉంటారో అర్థం చేసుకోవచ్చు. అందుకే తెలంగాణ ఇంఛార్జిగా మీనాక్షికి కీలక బాధ్యతలను అప్పగించారు. మంత్రివర్గ విస్తరణ విషయంలో తెలంగాణలోని కాంగ్రెస్ నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదు. వాటన్నింటినీ కొలిక్కి తెచ్చే చాతుర్యం మీనాక్షికి ఉంది. అందుకే ఆమెను రాహుల్ ఇక్కడికి పంపారు. తదుపరిగా ఆమె ఆ అంశంపైనే ఫోకస్ చేసే అవకాశం ఉంది.

## రేవంత్ ప్రభుత్వంపై వెనక్కు తగ్గేదేలే.. ఎమ్మెల్సీ కవిత స్ట్రాంగ్ వార్నింగ్

ఖమ్మం జిల్లా: రేవంత్ ప్రభుత్వానికి పరిపాలించడం చేతకాక అక్రమ కేసులు పెడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శలు చేశారు. ఖమ్మంలో కవిత ఇవాళ పర్యటించారు. ఖమ్మం సబ్ జైల్లో రిమాండ్‌లో ఉన్న లక్కినేని సురేందర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. లక్కినేని సురేందర్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కట్టడి చేయాలని చూస్తున్నారని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు.

**రేవంత్‌వి అన్నీ దొంగ మాటలే..** బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేస్తే కేసీఆర్‌ను అడ్డుకున్నట్లేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుబంధు, రైతు భీమా , ఫించన్, ఉద్యోగాలు రాలేదని మండిపడ్డారు. రేవంత్‌వి అన్నీ దొంగ మాటలేనని విమర్శించారు. 14 నెలల కాంగ్రెస్ పాలనలో దొంగహామీలే తప్ప చేసింది ఏం లేదని అన్నారు. ఈ ప్రభుత్వాన్ని ఖచ్చితంగా ప్రశ్నిస్తామని అన్నారు. రేవంత్ ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా తగ్గేదేలే అని హెచ్చరించారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసా కల్పించారు. కేసులకు భయపడొద్దు, ప్రజాక్షేత్రంలో పోరాడుతూనే ఉందామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు.

**రైతుల సమస్యలను పరిష్కరించాలి..** కాగా అంతకుముందు ఖమ్మం వెళ్తున్న ఎమ్మెల్సీ కవితకు చౌటుప్పల్‌లో మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ ప్రాంత ట్రిబుల్ ఆర్ రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని కవిత అన్నారు. ట్రిబుల్ ఆర్ రైతులకు గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా ఉంటానని చెప్పి.. అధికారంలోకి రాగానే రేవంత్ మాట మరిచారని ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు అవుతున్నా ట్రిబుల్ ఆర్ రైతుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ట్రిబుల్ ఆర్ బాధితుల విషయంలో చొరవ తీసుకోవాలని ఎమ్మెల్సీ కవిత కోరారు.

# కొనాల్సిన అవసరం లేదు.. స్వాధీనమే



గాజాను స్వాధీనం చేసుకొని, తిరిగి నిర్మిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా జోర్డాన్ రాజు అబ్దుల్లా 2తో భేటీ అయిన ట్రంప్.. ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారు. దాన్ని కొనుగోలు చేయాల్సిన అవసరం లేదంటూ వ్యాఖ్యానించారు. 'మేము గాజాను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. దాన్ని స్వాధీనం చేసుకుంటాం. గాజాను రక్షించి పునరుద్ధరిస్తాం. అక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఆలోచన నాకు లేదు. మధ్యప్రాచ్యంలోని ప్రజలకు అనేక ఉద్యోగాలు సృష్టించనున్నాం' అని ట్రంప్ ఓవెల్ కార్యాలయంలో విలేకరులతో తెలిపారు.

**2 వేల మంది పిల్లలను తీసుకుంటాం..** యుద్ధం కారణంగా అనారోగ్యంతో, క్యాన్సర్‌తో బాధపడుతున్న 2 వేల మంది చిన్నారులను తమ దేశానికి తీసుకువెళతామని అబ్దుల్లా 2 ప్రకటించారు. దీనిని ట్రంప్ అద్భుతమైన విషయంగా పేర్కొన్నారు. అయితే, నిరాశ్రయులైన పాలస్తీనియన్లకు ఆశ్రయం కల్పించాలనే ప్రతిపాదనను మాత్రం జోర్డాన్ రాజు తిప్పికొట్టారు. వారిని అక్కడినుంచి పంపించకుండా గాజాను తిరిగి నిర్మించాలన్నారు. ట్రంప్ ప్రతిపాదనపై అరబ్ దేశాలు రియాద్‌లో చర్చిస్తాయన్నారు. అమెరికా గాజాను స్వాధీనం చేసుకోవాలనే ఆలోచనను గత వారం తొలిసారి ట్రంప్ బయటపెట్టా రు. నాడు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తో భేటీ అనంతరం ఆయన ఈ ప్రకటన చేశారు. దానిని స్వాధీనం చేసుకొని.. ఓ వెకేషన్ ప్రదేశంగా (రివేర) అభివృద్ధి చేస్తామని వ్యాఖ్యానించారు. నాడు నెతన్యాహు కూడా దీనిని ఓ విప్లవాత్మక ఆలోచనగా అభివర్ణించారు. హమాస్ మాత్రం ట్రంప్ ఆలోచనలను తీవ్రంగా తప్పుపట్టింది. "కొనుగోలు చేసి.. అమ్మడానికి గాజా స్థిరాస్తి కాదు. అది మా పాలస్తీనాలో విడదీయలేని భాగం" అని పేర్కొంది. ఈ ప్రకటనకు ముందు గాజాలో యుద్ధం కారణంగా నిరాశ్రయులైన పాలస్తీనీయులకు అరబ్ దేశాలు ఆశ్రయం కల్పించాలని ట్రంప్ ప్రతిపాదించారు. అయితే, ఈ ప్రతిపాదనను ఆయా దేశాలు ఖండించాయి. తమ మిత్రదేశమైన ఈజిప్ట్, జోర్డాన్‌లు శరణార్థులకు ఆశ్రయం ఇస్తాయని శ్వేతసౌధం ప్రతినిధి కారోలైన్ లెవెట్టి తెలిపారు. మరోవైపు.. దీనికి వారు నిరాకరిస్తే అమెరికా నుంచి అందే సాయం నిలిపివేస్తామంటూ ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ బెదిరింపుల నేపథ్యంలోనే అబ్దుల్లా 2 ట్రంప్‌తో భేటీ అయ్యారు.

# అక్రమ వలసదారులను వెనక్కి తీసుకొస్తాం



వాషింగ్టన్: అమెరికా పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కీలక చర్చలు జరిపారు. అనంతరం వీరిద్దరూ కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా అక్రమ వలసదారుల అంశంపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. చట్టవిరుద్ధంగా అగ్రరాజ్యంలో నివసిస్తున్న భారతీయులను స్వదేశానికి తీసుకొస్తామని ప్రకటించారు. ఒక దేశంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించిన వారికి అక్కడ నివసించే హక్కు ఉండదని, ఈ విధానం ప్రపంచమంతటికీ వర్తిస్తుందని పేర్కొన్నారు. అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 104 మంది భారతీయులను ఇటీవల అగ్రరాజ్యం తిప్పి పంపిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో వాళ్ల చేతులకు సంకెళ్లు, కాళ్లకు గొలుసులు వేయడం వివాదాస్పదమైంది. ఈ పరిణామాల వేళ ట్రంప్‌తో భేటీ అయిన మోదీ వలసదారుల అంశంపైనా చర్చించారు. "యువత, పేదరికంలో ఉన్నవారు మోసపూరితంగా వలసదారులుగా మారుతున్నారు. డబ్బు, ఉద్యోగాల ఆశజూపి కొంతమంది వీరిని మోసం చేస్తున్నారు. అలా వారు అక్రమ వలసదారులుగా మారుతున్నారు. వారికి తెలియకుండానే మానవ అక్రమరవాణా కూపంలోకి వెళ్తున్నారు. ఈ దారుణాలను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉంది. ఈ ప్రయత్నాల్లో భారత్‌కు ట్రంప్ పూర్తి సహకారం అందిస్తారని ఆశిస్తున్నాం" అని మోదీ వెల్లడించారు.

**మిమ్మల్ని చాలా మిస్సయ్యా: మోదీతో ట్రంప్...** డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మోదీ ఆయనతో భేటీ కావడం ఇదే తొలిసారి. వాషింగ్టన్‌లోని వెస్ట్ వింగ్ లాబీకి చేరుకున్న భారత ప్రధానికి ట్రంప్ ఆత్మీయ స్వాగతం పలికారు. ఇరు దేశాధినేతలు ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈసందర్భంగా "మిమ్మల్ని చాలా మిస్సయ్యా' అంటూ ట్రంప్‌తో మోదీ వ్యాఖ్యానించారు. 'నాక్కూడా మిమ్మల్ని చూడటం ఆనందంగా ఉంది' అని అమెరికా అధ్యక్షుడు బదులిచ్చారు. అమెరికా పర్యటనలో భాగంగా స్పేస్‌ఎక్స్ సీఈవో, అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ (డోజ్) అధినేత ఎలాన్ మస్క్‌తోనూ ప్రధాని మోదీ భేటీ అయ్యారు. అంతరిక్షం, సాంకేతికత, నవకల్పనలు సహా పలు అంశాలపై వీరిద్దరు చర్చించారు.

# చంద్రబాబు, నితీశ్ ను 'ఫిక్స్' చేసిన మోదీ- నెక్ట్స్ టార్గెట్..!!



ఢిల్లీ ఎన్నికల ఫలితాలతో కొత్త సమీకరణాలు తెర మీదకు వస్తున్నాయి. మూడో సారి గెలిచినా భాగ స్వామ్య పక్షాల మద్దతు మోదీకి అవసరమైంది. వరుసగా హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ లో గెలుపు తరువాత మోదీ లెక్కలు మారుతున్నాయి. ఇండియా కూటమి పైన గురి పెట్టారు. కాంగ్రెస్ కూటమి మిత్రులను మోసం చేస్తోందని కొత్త పల్లవి అందుకున్నారు. ఇదే సమయంలో తమ పైనే మోదీ ప్రభుత్వం మనుగడ ఆధార పడి ఉందని భావిస్తున్న మిత్రపక్షాలను ప్రధాని ఫిక్స్ చేసారు. జమిలి వేళ వ్యూహాత్మక ఎత్తుగడలతో అడుగులు వేస్తున్నారు.

**వరుస విజయాలతో...** ప్రధాని మోదీకి వరుస విజయాలు దక్కుతున్నాయి. ఢిల్లీలో 27 ఏళ్ల తరువాత బీజేపీకి అధికారం దక్కింది. దీని వెనుక మోదీ – షా ద్వయం వ్యూహాలు పక్కాగా పని చేసాయి. ఆరెస్సెస్ శ్రేణులు శక్తి మేర పని చేసాయి. హర్యానా, మహారాష్ట్రలో బీజేపీ గెలుపులో కీలక పాత్ర పోషించిన ఆరెస్సెస్, ఢిల్లీలోనూ అదే కొనసాగించింది. కాగా, మూడో సారి మోదీ ప్రభుత్వం మిత్రపక్షాల మద్దతుగా కొనసాగుతోంది. కూటమిలో నితీశ్, చంద్రబాబు కీలకంగా మారారు. గతంలో చంద్రాబు, నితీశ్ తో బీజేపీ అధినాయకత్వానికి రాజకీయ అనుభవాలు ఉన్నాయి. దీంతో.. వారితో మైత్రి కొనసాగిస్తూనే.. తమ బలం చాటుతూ తమ సత్తా ఏంటో నిరూపించే ప్రయత్నం చేస్తున్నారు.

**పెరిగిన మోదీ ఇమేజ్...** మరి కొద్ది నెలల్లో బీహార్ లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. తాజా కేంద్ర బడ్జెట్ లో బీహార్ మినహా మరే రాష్ట్ర పేరు ప్రస్తావన చేయలేదు. బీహార్ బడ్జెట్ అనే విమర్శలు వచ్చినా.. మోదీ ప్రభుత్వం లెక్క చేయలేదు. బీహార్ లో ఎన్నికల నాటికి పొత్తులు.. సమీకరణాల్లో ఎలాంటి మార్పు లు వచ్చినా...ఎదుర్కొనేలా బడ్జెట్ తోనే పక్కా వ్యూహాత్మక అడుగులు ప్రారంభించారు. ఇటు ఏపీ లోనూ ఢిల్లీ కేంద్రంగా ఆసక్తి కర రాజకీయం కొనసాగుతోంది. ఏపీలో చంద్రబాబు సీఎంగా, పవన్ డిప్యూటీ సీఎంగా ఉన్నా.. కీలక నిర్ణయాలు మాత్రం ఢిల్లీతో చర్చించిన తరువాతనే తీసుకునే పరిస్థితి ఏర్పడింది. గతం కంటే భిన్నంగా బీజేపీ ఏపీతో డీల్ చేస్తోంది.

**పక్కా వ్యూహం...** ఏపీ ఆర్థిక – రాజకీయ పరిస్థితుల్లో పూర్తి పట్టు సాధించేలా బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. గత అనుభవాలతోనే బీజేపీ ఈ తరహా ప్లాన్ అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ ఏడాది బిహార్, వచ్చే ఏడాది పశ్చిమబెంగాల్, తర్వాత ఏడాది ఉత్తరప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. జమిలి దిశగా కసరత్తు చేస్తున్న మోదీ టీంకు ఈ రాష్ట్రాల్లో గెలుపు అవసరం. ఇందు కోసం మిత్ర పక్షాల నుంచి ఎటాంటి ఇబ్బంది లేకుండా ఫిక్స్ చేస్తూ.. ఎన్నికలు జరిగే రాష్ట్రాల పైన ప్రత్యేకంగా ఫోకస్ చేస్తోంది. మోదీ ఇప్పుడు బీహార్ తో పాటుగా ఇండియా కూటమి పైన గురి పెట్టారు. పార్ల మెంట్ సమావేశాల తరువాత ఆపరేషన్ బీహార్ ప్రారంభం కానుంది. దీంతో, రానున్న రోజుల్లో బీహార్ తో పాటుగా ఏపీలోనూ కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశం కనిపిస్తోంది.

# జస్ట్ 8 రోజుల్లో రూ.25 లక్షల కోట్లు ఆవిరి




ఆ మధ్య వరకు మహా దూకుడు ప్రదర్శించిన స్టాక్ మార్కెట్.. గడిచిన కొద్దిరోజులుగా చోటుచేసుకుంటున్న వరుస పరిణామాలతో బేర్ మంటున్న పరిస్థితి. దీంతో.. అటు సెన్సెక్స్.. ఇటు నిఫ్టీలు నేలచూపులు చూస్తున్న పరిస్థితి. వరుస పెట్టి ఎనిమిది రోజులుగా పడిపోతున్న సూచీల పుణ్యమా అని భారీ నష్టాలు మూటకట్టుకుంటున్న పరిస్థితి. వరుసగా ఎనిమిది రోజులుగా నమోదవుతున్న నష్టాలతో.. దగ్గర దగ్గర రూ.25 లక్షల కోట్ల మార్కెట్ సంపద ఆవిరైన పరిస్థితి. దీంతో.. మదుపరులు గగ్గోలు పెట్టేస్తున్నారు. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే నాటికి సెన్సెక్స్ 76వేల పాయింట్ల దిగువకు చేరగా.. నిఫ్టీ కీలకమైన 23 వేల పాయింట్ల స్థాయిని కోల్పోవటం గమనార్హం. చిన్న.. మధ్యస్థాయి షేర్లకు అమ్మకాలు పోటెత్తటంతో సూచీలు నేలచూపులు చూడటమే తప్పించి.. పైకెత్తి చేసే పరిస్థితి ఏ సందర్భంలోనూ లేకుండా పోయింది. బీఎస్ఈలో నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ శుక్రవారం ఒక్కరోజే దాదాపు రూ.7లక్షల కోట్లు ఆవిరైంది. గడిచిన ఎనిమిది రోజుల ట్రేడింగ్ పుణ్యమా అని రూ.25.31 లక్షల కోట్లకు తగ్గి రూ.400.19 లక్షల కోట్లకు చేరింది. గడిచిన 8 రోజుల్లో సెన్సెక్స్ 2644 పాయింట్లు కోల్పోతే.. నిఫ్టీ 810 పాయింట్లు నష్టపోయింది. 2024 సెప్టెంబరు 27నాటికి బీఎస్ఈ కంపెనీల మొత్తం నమోదిత విలువ రూ.477.93 లక్షల కోట్లు కాగా.. ఆ విలువలో ఇప్పుడు రూ.77.74 లక్షల వరకు తగ్గటం గమనార్హం. శుక్రవారం ఉదయం సెన్సెక్స్ లాభాల్లోదూసుకెళ్లింది. అంతకు ముందు రోజు క్లోజింగ్ తో పోలిస్తే 250 పాయింట్లతో ప్రారంభమైంది. ఒక దశలో గరిష్ఠాన్ని తాకిన సూచీ.. అనంతరం నష్టాల్లో జారుకుంది. ఒకదశలో 699 పాయింట్ల వరకు క్షీణించినప్పటికి.. ఆఖర్లో కాస్తంత కోలుకొని 199.7 పాయింట్ల నష్టంతో ట్రేడింగ్ ముగిసింది. అదే సమయంలో నిఫ్టీ 102.1పాయింట్లు తగ్గి 22,929.25 దగ్గర స్థిరపడింది. సెన్సెక్స్ సూచీలో 21 షేర్లు నష్టాలు చవిచూశాయి. రెండు శాతం కంటే ఎక్కువగా నష్టపోయిన షేర్లలో

- అదానీ పోర్ట్స్ 4.20శాతం
- అల్ట్రాటెక్ 2.47 శాతం
- సన్ ఫార్మా 2.40 శాతం
- ఇండస్ ఇండ్ బ్యాంక్ 2.19 శాతం
- ఎన్ టీపీసీ 2.18 శాతం నష్టపోయాయి.

ఇక.. ఒకశాతం కంటే ఎక్కువగానష్టపోయిన షేర్ల జాబితాలో టాటా స్టీల్.. ఎం అండ్ ఎం.. యాక్సిక్ బ్యాంక్.. టెక్ మహీంద్రా సంస్థలు ఉన్నాయి. రంగాల వారీగా సూచీల్లో సేవలు షేర్లు 3.16 శాతం.. పరిశ్రమలు 3.03 శాతం..యంత్ర పరికరాలు 2.76 శాతం.. విద్యుత్ 2.65 శాతం.. యుటిలిటీస్ 2.52 శాతం.. మన్నికైన వినిమయ వస్తువులు 2.39 శాతం.. కమొడిటీస్ 2.25 శాతం.. స్థిరాస్తి రంగ సంస్థల షేర్లు 2.03 శాతం నష్టపోయాయి.

# హైదరాబాద్ లో లేడీ 'అన్' లక్కీ భాస్కర్!

ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేని సూపర్ సక్సెస్ మూవీ లక్కీ భాస్కర్. నిజానికి థియేటర్లలో విడుదలై దానితో పోలిస్తే.. ఓటీటీలో రిలీజ్ తర్వాత ఈ మూవీ మరింత పాపులర్ కావటమే కాదు ఒకటికి రెండుసార్లు చూసిన తర్వాత కూడా మళ్లీ మరోసారిచూడాలన్న కిక్ ఇచ్చేస్తుంది ఈ మూవీ. దీన్ని చూడనోళ్లకు సింపుల్ గా రెండు లైన్లలో సినిమాస్టోరీ చెప్పేసి.. అసలు విషయంలోకి వెళదాం. ఎందుకంటే.. ఈ మూవీ లైన్ తెలీకుండా.. ఈ రియల్ క్రైం గురించి తెలిసినా అంత కిక్ ఉండదు. మూవీలో హీరో బ్యాంక్ క్యాషియర్ గా పని చేస్తుంటాడు. పని పూర్తి అయిన తర్వాత డబ్బుల్ని స్ట్రాంగ్ రూంలో జమ చేయాలి. అందుకు భిన్నంగా వారాంతాల్లో ఆ డబ్బుల్లో కొంత మొత్తాన్ని తనతో తీసుకెళ్లి.. బయట వ్యాపారం చేసి వారం మొదట్లో ఆ మొత్తాన్ని తీసుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా సర్దేస్తాడు. ఈ రెండు రోజుల వ్యవధిలో ఆ డబ్బుతో భారీగా డబ్బు పోగేస్తాడు. అతగాడు చేసే తప్పులు సినిమాలో బయటకు వచ్చినా.. అప్పటికే లక్కీగా తప్పించుకుంటాడు. లక్కీ భాస్కర్ గా నిలుస్తాడు. రీల్ మాదిరి రియల్ లైఫ్ ఉండదు కదా? ఈ సినిమాను చూసి స్ఫూర్తి పొందారో.. లేదంటే మరెలా ఆలోచించారో కానీహైదరాబాద్



కు చెందిన ఒక మహిళా ఇన్ స్పెక్టర్ ఒక కేసులో జప్తు చేసిన మొత్తంలో రూ.40 లక్షలు కొట్టేశారు. అనుకున్న సమయానికి ఆ మొత్తాన్ని జమ చేయటంలో జరిగిన తేడాతో ఉన్నతాధికారులకు అడ్డంగా బుక్ అయ్యారు. సినిమాలో లక్కీ అయిన హీరో.. రియల్ లైఫ్ లో మాత్రం ఈ లేడీ భాస్కర్ అన్ లక్కీగా నిలిచారు. సదరు మహిళా అధికారి చేసిన మోసాన్ని గర్తించిన ఉన్నతాధికారులు ఆమెను బదిలీ వేటు వేసినట్లుగా తెలిసింది. హైదరాబాద్ మహానగరంలో చోటుచేసుకున్న ఈ క్రైం ఉదంతం పోలీసు వర్గాల్లో సంచలనంగా మారింది. ఈ అధికారిణి ఆన్ లైన్ మోసాల విభాగంలో పని చేస్తుంటారని చెబుతున్నారు. ఇటీవల ఒక కేసులో ప్రైవేటు సంస్థకు చెందిన రూ.40 లక్షల మొత్తాన్ని సీజ్ చేశారు. ఆ డబ్బును డిపార్ట్ మెంట్ లో జమ చేయకుండా తన వద్దే ఉంచుకున్నారు. అధికారులు అడిగితే త్వరలో జమ చేస్తానని చెప్పేవారు. తన దగ్గర ఆ మొత్తం ఉన్న విషయాన్ని ఉన్నతాధికారులకు చెప్పానని బిల్డప్ ఇచ్చేశారు. అయితే.. ఇటీవల ఆమె భాగోతమంతా బయటకు రావటంతో సీనియర్ అధికారులు సైతం అవాక్కు అయిన పరిస్థితి. దీంతో.. ఆమెపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. విషయాన్ని బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నా.. అది కాస్తా మీడియా పుణ్యమా అని బయటకు వచ్చేసింది.

# వెల్వెట్ షాంపో మీకు గుర్తుందా? అదిప్పుడు ఎవరి సొంతమో తెలుసా?

మీ వయసు నలభైకు పైనే అయితే.. ఈ వార్తకు ఇట్టే కనెక్టు అవుతారు. అదే.. యాభైకు పైనే అయితే.. ఒక్కసారి ఆశ్చర్యానికి గురవుతారు. ఎందుకుంటే.. అప్పట్లో మార్కెట్ దుమ్ము రేపటమే కాదు.. దేశీయ షాంపో వినియోగంలో సరికొత్త సంచలనానికి కారణమైన ఒక సంస్థ తర్వాతి రోజుల్లో తనను తాను అప్డేట్ చేసుకోకపోవటం.. మార్కెటింగ్ లో జరిగిన పొరపాట్లు.. బడా విదేశీ సంస్థలు ఎంట్రీ ఇచ్చిన తర్వాత వాటికి ధీటుగా నిలవని తీరుతో తన కళను పూర్తిగా కోల్పోయింది. ఇంతకూ ఆ బ్రాండ్ ఏదంటారా? వెల్వెట్. మన దేశంలో శాచెట్ లో షాంపోలను అమ్మే ప్రక్రియను షురూ చేసింది ఈ బ్రాండే. తమిళనాడుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త సీకే రాజ్ కుమార్ 1980లో వెల్వెట్ బ్రాండ్ ను మార్కెట్ కు పరిచయం చేశారు. సుజాత బయోటెక్ సంస్థ పేరుతో దీన్ని మార్కెట్ లోపంపిణీ చేసేవారు. వెల్వెట్ షాంపోతో పాటు.. నివారణ్ 90 (దగ్గు సిరప్).. మెమరీ పెంచే మెమరీ ప్లస్ టాబ్లెట్లు ఈ సంస్థ ఉత్పత్తులే. అప్పట్లో వెల్వెట్ షాంపో పెను సంచలనం. అప్పటివరకు కుంకుడుకాయల్ని తలంటు కోసం




వాడే స్థానే.. వెల్వెట్ షాంపో అది కూడా రూపాయి అంతకంటే తక్కువ ధరకే శాచెట్ అందుబాటులోకి తేవటంతో.. సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ఈ షాంపోను కొనుగోలు చేయటానికి ఆసక్తి చూపేవారు. దీంతో.. వెల్వెట్ షాంపో బ్రాండ్ లీడర్ గా ఎదిగింది. ఆ తర్వాత బహుజాతి సంస్థలు కూడా ఈ సూత్రాన్ని పాటించటంతో.. మార్కెట్ లో పోటీ ఎక్కువైంది. తర్వాతి కాలంలో రాజ్ కుమార్ కాలం చేయటం.. ఆయన సతీమణి సుజాత రాజ్ కుమార్ కంపెనీకి ప్రమోటర్లుగా ఉన్నప్పటికి.. పూర్వ వైభవం దిశగా మాత్రం అడుగులు వేయలేకపోయారు ఇదిలా ఉండగా.. తాజాగా ఈ బ్రాండ్ ను దిగ్గజ సంస్థ రిలయన్స్ సొంతం చేసుకుంది. ఈ సంస్థను కొనుగోలు చేయటం ద్వారా ఎఫ్ఎంసీజీ విభాగంలో మరో పాత కంపెనీ చేరినట్లైంది. ఇటీవల కాలంలో పాత బ్రాండ్లను రిలయన్స్ వరుస పెట్టి కొనుగోలు చేస్తోంది. ఇందులో భాగంగా కాంపా.. రావల్ గావ్ షుగర్ సంస్థలను రిలయన్స్ సొంతం చేసుకోవటం తెలిసిందే. ఒకప్పుడు వెల్వెట్ షాంపోలకు మంచి ఆదరణ ఉండేదన్న విషయాన్ని గుర్తు చేసిన రిలయన్స్ కన్జూమర్ సీవోవో కేతన్ మోడీ.. తాజాగా తమిళనాడులో ఈ బ్రాండ్లకు చెందిన ఉత్పత్తుల్ని విడుదల చేస్తామని చెప్పారు. ఆ తర్వాతి దశలో వీటిని దేశంలోని ఇతర ప్రాంతాలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. సబ్బులు.. బాడీ వాష్ లను వెల్వెట్ బ్రాండ్ మీద తీసుకురానున్నట్లుగా కేతన్ చెబుతున్నారు. అయితే.. ఈ డీల్ విలువ ఎంతన్న విషయం బయటకురాలేదు. ఏమైనా.. ఒకప్పుడు పెను సంచలనంగా ఉన్న బ్రాండ్లు కాలగర్భంలో కళ తప్పిన వేళ.. వాటికి పూర్వ వైభవాన్ని తెచ్చే దిశగా రిలయన్స్ చేస్తున్న ప్రయత్నాలు ఏమేర సక్సెస్ అవుతాయో చూడాలి.

చురకలు

## సంపాదకీయం

# ఆరెస్సెస్ తో ఆరంభం... మమత కోట బద్దలవుతుందా ?

పశ్చిమ బెంగాల్ లో మూడు సార్లు వరసగా ముఖ్యమంత్రిగా చేసి బెంగాల్ లేడీ టైగర్ గా తృణ మూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ పేరు తెచ్చుకున్నారు. ఆమె 2011 నుంచి అప్రతిహతంగా అధికారాన్ని కొనసాగిస్తున్నారు. పశ్చిమ బెంగాల్ చరిత్రలో దాదాపుగా రెండున్నర దశాబ్దాల పాటు ఏలిన ఘనత జ్యోతిబసుకు ఉంది. ఆయన తరువాత ఎక్కువ కాలం పాలించిన వారు బుద్ధదేవ్ భట్టాచార్య. కమ్యూనిస్టులను గద్దె దించిన మమతా బెనర్జీ ఇప్పటికి పద్నాలుగేళ్ళుగా సీఎం గా ఉన్నారు. వచ్చే ఏడాది మే నెలతో ఆమె పదవీ కాలం 15 ఏళ్ళకు పూర్తి అవుతుంది. ఆ నెలలోనే ఎన్నికలు ఉన్నాయి. ఢిల్లీని స్వాధీనం చేసుకున్న బీజేపీ కదనోత్సాహంతో ఉంది. ఈసారి టార్గెట్ పశ్చిమ బెంగాల్ అనే అంటోంది. బెంగాల్ ని నిజానికి 2021లోనే గెలవాలని బీజేపీ తనదైన ప్రయత్నాలను ఎన్నో చేసింది. కానీ చిక్కలేదు అయినా సరే ఏకంగా 77 సీట్లు సాధించి బలమైన విపక్షంగా మారింది. అంతకు ముందు 2016లో జరిగిన ఎన్నికల్లో కేవలం 3 సీట్లు 10.16 శాతం ఓటు షేర్ తెచ్చుకున్న బీజేపీ 2021 లో అదనంగా 74 సీట్లను గెలుచుకుంది. ఆ పార్టీ ఓటు షేర్ అయితే 38.15 శాతానికి ఎగబాకింది. తృణమూల్ కాంగ్రెస్ కి ఈ పెరుగుదల వల్ల వచ్చిన నష్టం అయితే ఏమీ లేదు. ఆ పార్టీ కూడా 2016లో తెచ్చుకున్న 211 సీట్ల కంటే మరో నాలుగు అదనంగా దక్కించుకుని 215కి ఎగబాకింది. అంతే కాదు. 2016లో వచ్చిన 44.91 శాతం ఓటు షేర్ ని 2021 నాటికి 48.02 గా పెంచుకుంది. అంటే అదనంగా 3.11 శాతం దక్కించుకుంది అన్న మాట. మొత్తం 294 మంది సభ్యులు కలిగిన బెంగాల్ అసెంబ్లీలో ఈ రెండు పార్టీలే ఓట్లూ సీట్లూ తీసుకుంటే 2016లో 26 సీట్లు సాధించిన వామపక్షాలు కానీ 44 సీట్లు ఉన్న కాంగ్రెస్ కానీ జీరో నంబర్ కి పడిపోయాయి. అయితే ఈసారి ఎన్నికల్లోనూ ఒంటరిగానే పోటీ చేస్తామని ఇప్పటికే మమతా బెనర్జీ ప్రకటించారు. దాంతో వామపక్షాలు కాంగ్రెస్ కలసి పోటీ చేయవచ్చు. బీజేపీ ఈసారి బెంగాల్ కోటను బద్దలు కొట్టి దీదీని మాజీ సీఎం చేస్తామని కంకణం కట్టుకుంది. అరవింద్ కేజ్రీవాల్ తో పాటుగా మమతా బెనర్జీ కూడా ఎక్కువగా మోడీని కేంద్రాన్ని విమర్శిస్తూ వస్తున్నారు. ఇండియా కూటమికి తామే సారధులుగా వారధులుగా చెప్పుకుంటున్నారు. అందువల్ల సొంత రాష్ట్రంలోనే ఓడించినట్లు అయితే కచ్చితంగా మమత ఇమేజ్ తో పాటు ఇండియా కూటమి కూడా వీక్ అవుతుందని బీజేపీ భావిస్తోంది. ఈ నేపధ్యంతో అన్ని అస్త్రశస్త్రాలను సిద్ధం చేసుకుని బీజేపీ రంగంలోకి దిగుతోంది. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ లో హిందువుల పట్ల అక్కడి ప్రభుత్వం అనుసరిస్తున్న మారణ కాండ కూడా పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో కీలకం కాబోతున్నాయని హిందువుల ఓట్లను ఏకీకృతం చేస్తాయని భావిస్తున్నారు. హిందువులకు రక్షణ కల్పించేది బీజేపీయే అన్నది జనంలోకి బాగా తీసుకుని వెళ్ళడానికి ఆరెస్సెస్ కూడా రంగంలోకి దిగుతోంది. ఈ నేపథ్యంలో కోల్కతాలో ఈ నెల 16న భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు ఆరెస్సెస్ సిద్ధపడుతోంది. దానికి అక్కడి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో కోర్టుకు వెళ్ళి అనుమతిని ఆరెస్సెస్ నేతలు తెచ్చుకున్నారు. ఆరెస్సెస్ సభలో ఆ సంస్థ అధిపతి మోహన్ భగవత్ పాల్గొని ప్రసంగిస్తారు.

ఆయన ఏమి మాట్లాడుతారు అన్నది సర్వత్రా ఆసక్తిని పెంచుతోంది. ఢిల్లీ హర్యానా మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ విజయం వెనక తెర వెనక కీలక పాత్ర పోషించిన ఆరెస్సెస్ బెంగాల్ లోనూ అదే వ్యూహాన్ని అమలు చేయనుందని అంటున్నారు. హిందువులకు రక్షణ విషయంలో ఆరెస్సెస్ మొదటి నుంచి పోరాడుతుంది. బెంగాల్ ప్రభుత్వం మీద ఆరెస్సెస్ ఏ రకమైన విమర్శలు చేస్తుంది అన్నది కూడా చర్చగా ఉంది. మొత్తానికి మమతా బెనర్జీ కోటను బద్దలు కొట్టేందుకు ఆరెస్సెస్ ఆరంభం పలికింది అని అంటున్నారు.

# అసమాన పరిశోధకుడు మేఘనాథ్ సాహా - ఫిబ్రవరి 16... మేఘనాథ్ సాహా వర్ధంతి



మేఘనాథ్ సాహా (1893 అక్టోబరు 6 1956 ఫిబ్రవరి16) భారత దేశానికి చెందిన సుప్రసిద్ధ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త. నక్షత్రాలలో జరిగే మార్పు లు, ఉష్ణోగ్రత, పీడనం లాంటి ఎన్నో ధర్మాల్ని ఆవిష్కరించే సమీకరణాలను కనుగొన్నాడు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో గల ఢాకాలోని సియోర్ తలి గ్రామంలో 1893 అక్టోబరు 6న, జన్మించిన మేఘ నాథ్ సాహా, చదువులో బాల్యం నుండే రాణించాడు. తండ్రి సంపాదన చాలక పోవడంతో ఆ కుటుంబం తరచు పస్తులతో గడపాల్సి రాగా, సాహాను బడి మానిపించి ఏదైనా పనిలో పెట్ట డానికి తండ్రి ప్రయత్నించాడు. అయితే సాహా చురుకు దనాన్ని గమనించిన ఉ పాధ్యాయులు తండ్రికి నచ్చచెప్పి దాతల సాయం తో ఓ బోర్డింగ్ స్కూలులో చేర్చారు. సాహా చక్కగా చదువుతూ స్కాలర్‌షిప్‌లు సాధించి పై చదవుల కోసం ఢాకా వెళ్లాడు. ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం బెంగాల్ ను విభజించి నందుకు నిరసనగా పన్నెండేళ్ల సాహా, గవర్నర్ తమ స్కూలును సందర్శి స్తున్న కార్యక్ర మాన్ని స్నేహితులతో బహిష్కరించి డిస్మిస్ అయ్యాడు. మరో స్కూల్లో చేరి అక్కడ కూడా స్కాలర్‌షిప్ సాధించాడు. కలకత్తా ప్రెసిడెన్సీ కళాశాలలో ఆయనకు బోధించిన వారిలో ప్రఖ్యాత శాస్త్రవేత్తలు జగదీశ్ చంద్రబోస్, పీసీ రే ఉండగా, అతడి క్లాస్‌మేట్స్‌లో సత్యేంద్రనాథ్ బోస్, పీసీ మహాలనోబిస్ కూడా శాస్త్రవేత్తలు కావడం విశేషం. ఎమ్మెస్సీ తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం ఉ ద్యోగం ఇవ్వక పోవడంతో ఉపాధి కోసం ట్యూషన్లు చెబుతూనే పరిశోధనల్లో నిమగ్నమయ్యాడు. తర్వాత కలకత్తాలో అధ్యాపకుడిగా చేరిన ఆయన ఖగోళ భౌతిక శాస్త్రంపై పట్టు సాధించాడు. సూర్యకాంతి గాజు పట్టకం ద్వారా ప్రసరించి నప్పుడు ఏర్పడే వర్ణపటం ఎందుకు ఏర్పడుతుందో చెబుతూ అయనీ కరణ సూత్రాన్ని ప్రతిపాదించాడు. సూర్యుని ఉష్ణోగ్ర తలు, సౌష్టవం, సంయోజనం లాంటి ధర్మాలను విశ్లేషించాడు. ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ (లండన్) గా ఎన్నికయ్యాడు. అలహాబాదు యూనివర్శిటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్‌గా వర్ణపట విజ్ఞానం , అయనా వరణం పై పరిశోధనలు చేశాడు. సూర్య కిరణాల బరువును, వత్తిడిని కనిపెట్టే పరికరాన్ని రూపొందిం చాడు. ఇంకా పురాతన శి లలు, సూర్యుని నుంచి వెలువడే రేడియో తరంగాలు, రేడియో ధార్మిక తలపై కూడా పరిశోధన లు చేశాడు. కలకత్తా విశ్వ విద్యాల యంలో న్యూక్లియర్ ఫిజిక్స్ విభాగా న్ని1948లో సాహా ప్రారంభించాడు. దేశంలో పరమాణు కణాల త్వర ణాన్ని పెంచే తొలి యాక్సిలరేటర్ ఆయన పర్యవేక్షణ లోనే నిర్మిత మైంది. సైన్స్ అండ్ కల్చర్ పత్రికను నడిపాడు. ఆయన రాసిన 'ఎ ట్రిటైజ్ ఆన్ హీట్' ఓ ప్రామాణిక పాఠ్య గ్రంథం. 1923 లో సాహా అలహాబాదు విశ్వ విద్యాలయంలో ఆచార్యు డయి నాడు. 1927 లో రాయల్ సొసైటీ లో సభ్యత్వం లభించింది. 1934లో 21వ భారత సైన్సు కాంగ్రెస్ సదస్సు కు అధ్యక్షత వహిం చాడు. 1938 లో కలకత్తా విశ్వ విద్యాలయానికి వెళ్ళాడు. అక్కడ కలకత్తా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్ ను నెలకొల్పి దానికి గౌరవా ధ్యక్షుడిగా ఉన్నాడు. సాహా ఫిబ్రవరి 16, 1956న మరణించాడు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**


# తెలుగు పత్రికా రంగానికి మార్గ నిర్దేశకుడు నార్ల - ఫిబ్రవరి 16.... నార్ల వెంకటేశ్వరరావు వర్ధంతి

నార్ల వెంకటేశ్వరరావు... పరిచయం అక్కర్లేని పేరు. నిర్భయానికి, నిక్క చ్చితత్వానికి, నిబద్ధతకు మారు పేరు. వృత్తి నిబద్ధతతో నిర్వహిం చారు. వృత్తి నిర్వహణ సామాజిక బాధ్యతగా భావించారు. పత్రికా రంగానికి మార్గదర్శకులు, జర్నలిస్టు లకు దిశానిర్దేశకులు. ఆయనొక విజ్ఞాన సర్వస్వం. అయన జీవితం సంస్కరణల మయం. రచన ఏది చేసినా, ప్రక్రియ ఎదైనా, ప్రజా చైతన్యమే ఆయన లక్ష్యం. లక్ష్య సిద్ధి కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో ముందుకే సాగిన వైనం. రచయితగా, నాటకకర్తగా, విమర్శ కుడిగా, అనువాదకుడిగా బహు ముఖ పాత్రలు పోషించిన ఆయన జీవిత పర్యంతం హేతుబద్ధమైన ఆలోచనల ద్వారా సామాజిక స్పృహ కల్పించే ప్రయత్నం చేశారు. ఆంగ్ల భాషలోనూ నిష్ణాతులైనా, తెలుగు ప్రజలకు తన రచనలు చేరువ కావాలనే తలంపుతో, తెలుగు పత్రికా రంగాన్ని కావాలనే ఎంచుకున్నారు. మధ్య ప్రదేశ్ లోని జబల్‌పూర్‌లో డిసెంబర్ 1, 1908 జన్మించిన నార్ల, విద్యాభ్యాసం కృష్ణా జిల్లాలో జరిగిం ది. వెంకటేశ్వరరావు ఏప్రిల్ 3, 1958 నుండి ఏప్రిల్ 2, 1970 వరకు రెండు పర్యాయాలు రాజ్యసభ సభ్యునిగా పని చేశారు. స్వరాజ్య, జన వాణి, ప్రజా మిత్ర పత్రికలో పని చేసి, ఆంధ్ర ప్రభ, చివరకు ఆంధ్ర జ్యోతి పత్రికలకు ఎడిటర్ గా విధులు నిర్వర్తించారు. విధి నిర్వాహణలో ఎన్నడూ అయన రాజీ పడలేదు. ఆయన సంపాద కీయ రచనలు సూటిదనం, గడుసు దనం, వ్యంగ్యం, చమత్కారం, లోక జ్ఞత, సమయజ్ఞత కల గలిపి ఉండే వి. పండితునికి, పామరునికి తెలు గు భాష అర్థమయ్యే రీతిలో నార్ల సంపాదకీయాలు, రచనలు చేశారు. "వాస్తవమ్ము నార్లవారి మాట" మకుటంతో ఆటవెలదులు రచించారు. "నవయుగాల బాట నార్ల మాట" మకుటంతో 700కు పైగా సందేశాత్మక పద్యాలు రాశారు. 16 ఏకాంకికల సంపుటి వెలువరించారు. నార్ల సొంత గ్రంథాలయంలో 20,000 పుస్తకాలు ఉండేవట అంటే మాటలు కాదు. సంపాదకుడు అనే మాటను అయన అంగీకరించ లేదు. ఆమోదించ లేదు. ఎడిటర్ అనే పదాన్నే వాడే వారు. నార్ల... టంగుటూరి ప్రకాశం, నీలం సంజీవరెడ్డి, , కాసు బ్రహ్మానంద రెడ్డి, ఎన్.జి. రంగా ఎవరినీ వదల లేదు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ చాందసాన్ని విమర్శించక మాన లేదు. ఇందిరా గాంధి, ఆమె కుటుంబ వారసత్వ రాజకీయాల్ని ద్వేషించారు. ఆయన వ్యాసాలను నిరక్షరాస్యులు గ్రామాల్లోని రచ్చబండల దగ్గర చదివి వినిపించుకునే వారంటే ఆయనలోని రచనా వ్యాసంగ శక్తి ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు. ఆంధ్రప్రభ నుంచి వైదొలిగిన సందర్భంలో, నార్ల కోసం కొందరు ముఖ్యులు కలిసి ఆంధ్ర జ్యోతి పత్రిక ప్రారంభించారంటే ఆయన గొప్పతనం స్పష్టం అవుతున్నది. గోరాశాస్త్రి మాటల్లో చెప్పాలంటే 'కేవలం సత్వగుణ ప్రధానంగా, అచ్చ తెలుగులో చప్పచప్పగా ఉన్న పత్రికా రచనలో వాడినీ, వేడినీ సృష్టించి, తెలుగు నుడికారంలో ఎంత 'కారం' ఉందో తెలియజెప్పిన వాడు' నార్ల. "యొక్కలతో తెలుగుభాష డొక్క పొడవొద్దు...ఎంత గొప్ప వాడైనా వస్తాడే కాని విచ్చేయడు... సంపాదకుడు అనొద్దు ఎడిటర్ అనండి...బదు వాడేవాడు బదుద్దాయి. అంటూ పత్రికా భాష ఎలా ఉండాలో దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఫిబ్రవరి 16, 1985న ఈ లోకాన్ని వీడి వెళ్లిన నార్ల తెలుగు సాహిత్య, పత్రికా రంగాలలో చెరగని ముద్ర వేసి వెళ్లారు. "ఎడిటరైన వాడు బిడియము చూపుచో ధాటి తగ్గు వృత్తి ధర్మమందు, కడుపుకూటి రాత కక్కుర్తి రాతరా" "నిజము కప్పిపుచ్చి నీతిని విడనాడి స్వామి సేవ సేయు జర్నలిస్టు తార్చువాని కంటే తక్కువ వాడురా" అంటూ విలువలు వీడ వలదని హితవు పలికారు. ప్రస్తుత పరిస్థితులలో ఆయన చేసిన మార్గ నిర్దేశం నేటి జర్నలిస్టులకు నిజంగానే శిరోధార్యం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**




# భారతీయ సినిమా పితామహులు ఫాల్కే - ఫిబ్రవరి 16.. దాదాసాహెబ్ వర్ధంతి



దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గురించి భారత దేశములో తెలియని వారు ఉండరేమో. . భారతీయ సినిమాకు గణనీయమైన సేవ చేసిన వారికి ప్రతి సంవత్సరం ఇచ్చే పురస్కారం దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు. భారతీయ సినిమాకు పితామహుడుగా భావించబడే ఫాల్కే జన్మదిన సందర్భంగా 1963లో ఈ పురస్కారం ఏర్పాటు చేయబడింది. అయితే ఫాల్కే గురించి మాత్రం చాలా మందికి తెలియ దంటే ఆశ్చర్యం కలుగ మానదు. భారతీయ సినిమా పరిశ్రమ ప్రపంచంలోనే అతిపెద్ద పరిశ్రమలలో ఒకటి. ఎన్నో వేల కుటుంబాలకు జీవనాధారంగా ఉంటూ, కోట్ల ప్రజానీకానికి వినోదాన్ని, ఆటవిడుపునూ అందిస్తున్న సాధనం సినిమా. భారత సినీ పరిశ్రమకు ఆద్యునిగా పేరు గాంచింది దాదాసాహెబ్ ఫాల్కే. అతను అసలు పేరు ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే. 1896లో అతను బొంబాయి లోని వాట్సన్ హొటల్‌లో ఏసుక్రీస్తు చరితం పై ప్రదర్శించ బడిన సినిమాను చూడటం జరిగింది. ఆ ప్రభావంతో అతను హైందవ దేవతలను చూపుతూ సినిమాలు తియ్యాలన్న సంకల్పానికి వచ్చారు. 1913లో అతను తీసిన రాజా హరిశ్చంద్ర సినిమాతో మొదలైన అతను సినీ జీవితం 19 సంవత్సరాలు సాగింది. సినీ నిర్మాతగా, దర్శకుడుగా, స్క్రీన్‌ప్లే-రచయితగా ఈ కాలంలో అతను 95 చిత్రాలను, 26 లఘుచిత్రాలను రూపొందించారు. 1870లో నాసిక్‌లోని త్రయంబకేశ్వర్‌లో 1870 ఏప్రిల్ 30 న జన్మించారు. బొంబాయిలోని జెజె కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో, బరోడాలోని కళాభవన్ విద్యార్థి. మంచి చిత్రకారుడు, నాటకాల్లో మేకప్ వేశారు. మంచి మెజీషియన్ కూడా... ప్రింటింగ్ ప్రెస్‌ను ఏర్పాటు చేశారు. ఆ కాలంలోనే ప్రింటింగ్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కోసం జర్మనీ వెళ్లాలనుకున్నారు. సినిమాకు సంబంధించిన వార్త ఒకటి పత్రికలో వచ్చింది. తనను ఆ వార్త బాగా ఆలోచింపజేసింది. మన దేశంలో కూడా సినిమాను ఎందుకు తీయకూడదు అనే ఆలోచన అతన్ని కుదురుగా ఉండనివ్వలేదు. తన వద్ద ఉన్న డబ్బు, మిత్రుల నుంచి తీసుకున్న అప్పు, జీవిత బీమా డబ్బు మొత్తం తీసుకొని సినిమా నిర్మాణానికి సంబంధించిన పరికరాలు కొనడానికి 1912లో ఇంగ్లాండ్ వెళ్లారు. అయితే ఫాల్కేకు తాను చరిత్ర సృష్టించ బోతున్నానని తెలియదు, అదే తన జీవితాన్ని పేదరికం లోకి నెట్టివేస్తుందనీ ఊహించలేదు. ఫాల్కే 1913లో రాజా హరిశ్చంద్ర, ఆదే సంవత్సరం మోహినీ భస్మాసుర, సత్యవాన్ సావిత్రి (1914) శ్రీకృష్ణ జననం (1918) కాళీయ మర్దన్ (1919) నిర్మించారు. ఆ తరువాత సినిమా రంగంలో క్రమంగా వ్యాపార ధోరణి మొదలైంది. దాంతో పాల్కే పక్కకు తప్పుకున్నారు. సినిమా ప్రేమ ఆయన్ని నిలువనివ్వలేదు. తన పలుకుబడి, పరిచయాలు ఉపయోగించి నిధులు సమీకరించి 1937లో గంగావతరణ సినిమా తీశారు. నిండా మునిగి పోయారు. సినిమాను వ్యాపారంగా చూసి ఉంటే ఆయన పరిస్థితి బాగానే ఉండేది. సినిమాను విపరీతంగా ప్రేమించి దెబ్బతిన్నారు. తన వారసులను పేదరికంలోకి నెట్టేశారు. ఆయన దేశానికి తీసుకు వచ్చిన సినిమాతో సినీ వ్యాపారులు కోట్లు సంపాదించారు. పాపులారిటీని, రాజకీయాల్లో పదవులు సంపాదించారు కానీ ఫాల్కే మాత్రం కఠిక దరిద్రంలో మరణించారు. ఆయన కుమారుడు ముంబై వీధుల్లో చిల్లర వ్యాపారిగా జీవితం గడిపారు. బాగున్న రోజుల్లో ఫాల్కే ఫోర్డ్ కారును ఉపయోగించే వారు. 1920 ప్రాంతంలో ఆ కారులోనే షూటింగ్‌కు వెళ్లేవారు. తిరిగి సినిమా తీయాలని నిర్ణయించుకున్న కాలంలో దాన్ని అమ్మేశారు. ఆ కారు పెళ్ళిళ్ల ఊరేగింపునకు ఉపయోగించారు. ఐదేళ్ల క్రితం ఈ కారు నాసిక్ డంప్ యార్డ్‌లో లభించింది. తొలి భారతీయ సినిమా కెమెరాను ఫాల్కే జర్మనీ నుంచి తెప్పించారు. అదేమైందో ఇప్పుడు ఎవరికీ తెలియదు. సినిమా నిర్మాణానికి ఎలాంటి ఏర్పాట్లు లేని కాలంలో ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి ఫాల్కే తొలి సినిమా తీశారు. ఫాల్కే భార్య సరస్వతి భారతీయ తొలి సినిమా రాజా హరిశ్చంద్ర నిర్మాణంలో కీలక భూమిక పోషించారు. ఆమెనే తొలి భారతీయ సినిమా టెక్నీషియన్. సరస్వతి షూటింగ్ సమయంలో వెలుతురు కెమెరాపై పడకుండా బెడ్ షీట్‌ను అడ్డుగా పట్టుకుని ఉండేవారట. షూటింగ్‌కు కావలసినవన్నీ సమకూర్చేవారు. రాత్రి పూట క్యాండిల్ వెలుగులోనే ఈ సినిమాకు సంబంధించిన సాంకేతిక పనులు నిర్వహించే వారు. సినిమా బృందం 60-70 మందికి ఆమెనే వంట చేసి పెట్టేవారు. రాజా హరిశ్చంద్రలో హరిశ్చంద్రుని కుమారునిగా ఫాల్కే కుమారుడు బాలచంద్ర నటించారు. తొలి భారతీయ బాలనటుడు అతనే. శ్రీకృష్ణ జననం, కాళీయ మర్దన్‌లో బాల శ్రీకృష్ణునిగా మందాకిని నటించారు. ఆమె ఫాల్కే పెద్ద కూతురు. ఆమెనే తొలి భారతీయ బాలనటి. భారతీయ సినిమా రజతోత్సవ వేడుకల్లో దాదాసాహెబ్ ఫాల్కే ఒక అనామకుడిగా కూర్చోవడం చూసిన శాంతారాం ఆయన్ని గుర్తించి వేదికపైకి తీసుకు పోయి 1938లో అప్పటికప్పుడు వేదికపై ఐదువేల రూపాయల పర్స్ అంద జేశారు. ఆ డబ్బుతో ఫాల్కే తిరిగి సినిమా తీస్తాడేమోనని చాలా మంది భయపడ్డారు. ఎందుకంటే సినిమా అంటే ఆ మహనీయునికి అంత పిచ్చి. అందరూ ఒత్తిడి తెచ్చి ఆ డబ్బుతో నాసిక్‌లో ఒక ఇంటిని కొనిపించారు. అప్పటి వరకు ఫాల్కేకు సొంత ఇల్లు కూడా లేదు. ఆ ఇంటిలోనే తుది శ్వాస విడిచారు..1971 లో ఆయన గౌరవార్థం ఇండియా పోస్ట్ ప్రత్యేక స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసింది. ఫిబ్రవరి 16, 1944 న మరణించారు. 90 సినిమాలను నిర్మించిన భారతీయ సినిమా పితామహుడు దరిద్రంతోనే కన్నుమూసినా, ఈ నాటికీ అతని జీవన మూల్యాలు ఆదర్శంగా, స్ఫూర్తినిచ్చేవిగానే ఉన్నాయి. అతని పేరు మీద జాతీయ అవార్డుల సంరంభం ప్రతి యేటా జరుగుతున్నా, ఆయన జీవిత చరమాంకం ఎంతటి దైన్యావస్థలో గడిచిందో ఎవరూ తలచక పోవటం శోచనీయం. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# అలుపెరుగని పోరాట యోధుడు లోక్ సత్తా శ్రీనివాస్ - నరెడ్ల శ్రీనివాస్ యాదిలో...



నరెడ్ల శ్రీనివాస్ అంటే తెలియక పోవచ్చు కాని, లోక్ సత్తా శ్రీనివాస్ అనగానే ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితమే. చాలా మంది ఆయనను లోక్ సత్తా శ్రీనివాస్ అనే పిలిచేవారు. సామాజిక న్యాయం, ఉద్యమాలకు ఆయన కేర్ ఆఫ్ అడ్రస్ గా నిలిచారు. ఉత్తర తెలంగాణలో గత ఆ నాలుగు దశాబ్దాలుగా కొనసాగిన సామాజిక ఉ ద్యమా లతో ఆయన భాగస్వామ్యం లేని ఉద్యమమే లేదంటే అతిశయోక్తి కాదు. లోక్ సత్తా ఉద్యమ సంస్థతో గత పాతికేళ్లుగా ఆయనకు విడదీయరాని సంబంధం ఉంది. లోక్ సత్తా అంటే శ్రీనివాస్. శ్రీనివాస్ అంటే లోక్ సత్తా అని పేరెన్నిక గన్నారు. అవినీతి, అన్యాయాలు అక్రమాలపై నిరంతరమైన పోరాటాలు చేశారు. ఎన్నో విజయాలు సాధించారు. కరీంనగర్ లో ఉన్న అన్ని ఉద్యమ వేదికలు ఆయనవే. గత సామాజిక ఉద్యమా లతో ఆయనకు విడదీయరాని బంధం సంబంధం అనుబంధం ఉన్నాయి. ఆయన ప్రతి ఉ ద్యమం లో క్రియాశీలక పాత్ర పోషించారు. వాస్తవానికి ఉద్యమాలను నిర్మించారంటే సమంజసంగా ఉంటుంది. ఉద్యమాల నిర్వహణలో అలుపెరగక, ఏనాడూ రాజీ పడక, మొక్కవోని ధైర్యంతో, చెక్కు చెదరని ఆత్మ విశ్వాసంతో, అకుంఠిత కార్యదీక్ష తో, అంకిత భావంతో, అన్నింటినీ మించి చిత్తశుద్ధితో, ఉద్యమాలలో మమేకమైన పోరాట యోధుడు. 1955లో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామంలో నిరుపేద కుటుంబంలో నరెడ్ల శ్రీనివాస్ జన్మించిన శ్రీనివాస్... యూనియన్ బ్యాంకులో ఉద్యోగం చేస్తూ, బ్యాంకు మేనేజర్ గా ప్రమోషన్ మీద కొంత కాలంగా రాష్ట్రం విడిచి వెళ్ళిన సందర్భంలోనూ, ఏనాడూ ఉద్యమ కార్యా చరణను ఆయన వదిలి పెట్టలేదు. వినియోగదారుల మండలి తరపున వందలాది కేసులు వేసి హక్కులను పరిరక్షిం చేందుకు కృషి చేశారు. అవినీతి అధికారులను ఏసీబీకి పట్టించడం లో కృషి చేసిన వారిని సన్మానించి ప్రోత్స హించేవారు. పాలకుల తప్పులను, ప్రభుత్వ పాలసీల్లోని లోపాలను ఎత్తి చూపడంలో, ప్రజా సమస్యలతో పాటు, సామాన్య బాధితుల న్యాయం కోసం పోరాడ డంలో ఆయన వ్యక్తిత్వం అనన్య సామాన్యం. ఉమ్మడి రాష్ట్ర వినియోగ దారుల మండలి అధ్యక్షుడిగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో అందరికీ అందు బాటులో ఉండేలా కిరాయి ఇల్లు వేదికగా, కరీంనగర్ వినియోగ దారుల మండలి నిర్వాహక బాధ్యునిగా, వేలాది కేసులను ఆయన పరిష్కరించారు. అన్యా యానికి గురైన వారు తమకు న్యాయం తప్పక జరుగుతుందని నమ్మకంతో, లోక్ సత్తా ఆఫీసును వెతుక్కుంటూ వచ్చేవారు. వారి సమస్య పరిష్కారం అయ్యే దాకా సలహాలు సూచనలు అందించ డమే కాక, వెంట ఉండి సహకరించే వారు. హుజురాబాదులో జన్మించిన 69ఏళ్ళ శ్రీనివాస్... విద్యార్థి జీవితం లోనే ప్రగతిశీల భావాలు కలిగి, ఆనాటి పోరాట, విప్లవ యోధుల సాహచర్యంతో ఎదిగారు. 1970వ దశక ప్రారంభంలో మిత్రులతో కలిసి హుజురాబాద్ లో సాహితీ సంస్థ స్థాపనకు చొరవ చూపి, మహాకవి శ్రీశ్రీని ఆహ్వానించి, హుజురాబాద్ లో సమావేశాలు నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషించారు. కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్ కాలేజీలో డిగ్రీ, ఉస్మానియాలో పీజీ పూర్తి చేసి, కరీంనగర్ యూనియన్ బ్యాంక్ లో ఉద్యోగంలో చేరారు. ప్రగతి శీల, భావజాల పరిధిని విస్తృత పరుచుకుని, తన లాంటి భావాలున్న వారితో జత కట్టారు. ఒకనాడు జర్నలిస్టులకు వేదికగా, ఎందరో జర్నలిస్టులను తయారు చేసి, జర్నలిస్టుల తయారీ కర్మాగా రంగా విలసిల్లిన, విజయ కుమార్ సంపాదకత్వంలో వెలువ రించిన 'జీవగడ్డ పత్రికలో వారం వారం 'పెన్నుపోటు' పేర కాలమిస్టు గా పని చేశారు. ఆకాలంలో జీవగడ్డలో పని చేసిన అల్లం నారాయణ, ఘంటా చక్రపాణి, ఆనాడు జిల్లాలో విధులు నిర్వర్తించిన సీనియర్ జర్నలిస్టు మిత్రులు దేవులపల్లి అమర్, దామెర్ల సాయిబాబా, ఎస్. కే.జకీర్ తదితరులతో సాన్నిహిత్యాన్ని పెంచుకున్నారు. కరీంనగర్ వినియోగదారుల మండలి స్థాపించి వినియోగ దారుల పరిరక్షణ చట్టం కింద, రశీదో, బిల్లో, ఏ చిన్న ఆధారం తోనైనా సరే, ఫోరం కోర్టుల్లో వేలాది కేసులు వేస్తూ మోస పోయిన వినియోగ దారులకు లక్షలాది రూపాయల నష్ట పరిహారాలు వచ్చేలా కృషి చేశారు.

అలాగే సమాచార హక్కు చట్టాన్ని మరొక ఆయుధంగా చేసుకుని సామాన్యు లకు అండగా నిలిచారు. ఈ చట్టం కింద భూ కబ్జాలు, గ్రానైట్ రాళ్ళ సంభకోణాల లాంటివి బహిర్గత పరిచి, ప్రభుత్వానికి కోట్ల రూపాయల లబ్ధిని చేకూర్చారు. లోక్ సత్తా బాధ్యునిగా, జయప్రకాష్ నారాయణను కరీంనగర్ పలు మార్లు రప్పించి, చిత్తశుద్ధితో పని చేశారు. సమాజంలోని అవినీతి అక్రమాలపై అలుపెరుగని, అవిశ్రాం త పోరాటం చేసి, ఆశయ సాధనకు కృషి చేసిన పోరాట యోధుడు, నరెడ్ల చివరికి కరోనా మహమ్మారి తోనూ పోరాటం చేసి, ఓటమి పాలై, పోరాట యోధుని గానే 2021 ఫిబ్రవరి 15న తనువు చాలించారు. ఆయన పోరాటం ఎందరికో స్ఫూర్తి దాయకం అయిందనేది వాస్తవం.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



# తక్షణం మేల్కొంటేనే ఎద్దడి దూరం

కరీంనగర్ : వేసవి నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని 13 మున్సిపాలిటీలు, రెండు కార్పొరేషన్ల పరిధిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ చేపట్టాల్సిన అవసరముంది. గతేడాది పలు చోట్ల సమస్య తీవ్రమైన నేపథ్యంలో ఈసారి అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. విద్యుత్తు సరఫరాలో లోపాలు వచ్చినా జనరేటర్లతో పంపింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలి ఉంది. ఇప్పటికే రాష్ట్ర స్థాయి అధికారులు వేసవి ప్రణాళికపై ప్రతి రోజూ అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకుంటున్నట్లు సమాచారం.

**మిషన్ భగీరథే ఆధారం**

అత్యధిక మున్సిపాలిటీల్లో తాగునీటి అవసరాలకు మిషన్ భగీరథ గ్రిడ్‌పై ఆధారపడుతున్నారు. వేసవిలో గ్రిడ్‌కు సంబంధించిన సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. మోటార్లకు మరమ్మతులు, అదనంగా సామగ్రిని సమకూర్చుకోవడం వంటివి చేపడితే కొంతమేర ఇబ్బందులు దూరమవుతాయి. పాడయిన బోరుబావులకు సంబంధించిన సామగ్రిని



తెప్పిస్తే మరమ్మతుకు వీలుంటుంది.

కొన్ని పట్టణాల్లో ఉన్న పవర్ బోర్లకు విద్యుత్తు కనెక్షన్ ఇచ్చి మరమ్మతు చేయించాలి.

**వేసవిలో రోజు విడిచి రోజు**

నగరానికి ప్రధాన వనరైన దిగువ మానేరు జలాశయం నుంచి నీటిని సాగు అవసరాలకు దిగువకు వదులుతున్నారు. ఏప్రిల్, మే నాటికి నీటి నిల్వ 7 టీఎంసీలకు చేరే అవకాశముండటంతో గతేడాది మాదిరిగా ఈసారి కూడా ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉంది. ప్రస్తుతం పలు రిజర్వాయర్ల పరిధిలో రోజూ సరఫరా చేస్తుండగా హౌసింగ్‌బోర్డు కాలనీలో 24 గంటలూ వదులుతున్నారు. వేసవిలో నగరమంతా రోజు విడిచి రోజు సరఫరా చేసే అవకాశముంది.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**


చొప్పదండి పట్టణానికి సిరిసిల్ల గ్రిడ్ నుంచి నీటి సరఫరా జరుగుతోంది. ఇక్కడి నుంచి సక్రమంగా రాకపోతే బోరు బావులు, ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోంది. రాయికల్ మున్సిపాలిటీకి డబ్బా గ్రామంలోని గ్రిడ్ నుంచి సరఫరా చేస్తుండగా ఆశించిన స్థాయిలో నీరందకపోతే బావులే ప్రత్యామ్నాయం. జగిత్యాలలో ధర్మసముద్రం చెరువు ప్రధాన వనరు కాగా స్థానిక అవసరాలకు సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు మిషన్ భగీరథ నీరు రాకపోతే అవస్థలు తప్పవు. ఇక్కడ పవర్‌బోర్స్, ఇతర బావుల ద్వారా పంపింగ్ చేసేందుకు కార్యాచరణ చేపట్టారు. పెద్దపల్లి జిల్లాలో రామగుండం కార్పొరేషన్, ఇతర మున్సిపాలిటీలకు గోదావరి నది, చెరువుల ద్వారా నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. జమ్మికుంట, హుజూరాబాద్ ప్రాంతాలకు మిషన్ భగీరథ ద్వారానే సరఫరా అవుతోంది. సిరిసిల్ల, వేములవాడకు మధ్య మానేరు ద్వారా శుద్ధి కేంద్రానికి నీరు అందుతోంది.

# సీసీఐ కేంద్రాల్లో నిలిచిన కొనుగోళ్లు

ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోళ్లు నిలిచిపోయాయి బయ్యర్లు కొనుగోలు చేయకపోవడంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖమ్మం జిల్లాలో పది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నాలుగు కేంద్రాలున్నాయి. ఆధార్ సర్వర్ పని చేయకపోవటం లాంటి సాంకేతిక సమస్యలు తలెత్తడంతో పూర్తిగా కొనుగోళ్లు నిలిపివేశారు.

**సమాచారం లేక ఇబ్బందులు...**

కేంద్రాల్లో ఏర్పడిన సమస్యలతో కొనుగోళ్లు నిలిపివేసిన విషయం సీసీఐ అధికారులు, మార్కెటింగ్‌శాఖ అధికారులు ఇంతవరకు ప్రకటించలేదు. విషయం తెలియని చాలామంది రైతులు తమ ఇళ్లలో బస్తాల్లో ఉన్న పత్తిని వాహనాల్లో లూజుగా కేంద్రాలకు తెస్తున్నారు. తీరా ఇక్కడకు వచ్చాక విషయం తెలుస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి వాహనాలను అద్దెకు తీసుకుని సరకు తేవడంతో రూ.వేలల్లో అద్దెలు చెల్లించాల్సి వస్తోంది. అసలే ధర లేక దిగాలు పడిన అన్నదాతలకు ఇది తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది.



**ప్రైవేటులో అమ్ముకోలేక...**

సీసీఐ కేంద్రాల్లో సరకు కొనుగోళ్లు చేయలేకపోతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రైవేటులో అమ్ముకోవాలని సూచిస్తున్నారు. ప్రైవేటులో క్వింటా పత్తి రూ.6,500 నుంచి రూ.6,600లకు వ్యాపారులు అడుగుతున్నారు. తెచ్చిన పత్తిని తిరిగి తీసుకెళ్లలేని రైతులు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకే తెగనమ్ముకుంటున్నారు. ప్రభుత్వం ఏడాది పత్తికి కనీస మద్దతు ధర క్వింటాకు రూ. 7,520 ప్రకటించిన విషయం తెలిసిందే. నాణ్యమైన పత్తికి కేంద్రాల్లో కాస్త అటుఇటుగా ఈ ధర లభిస్తోంది. నాణ్యత తగ్గిన కొద్దీ ధర తగ్గించి కొంటున్నారు. ఎలా చూసినా ప్రైవేటు కన్నా ధర కొంత మెరుగ్గా ఉండటంతో ఈ సంవత్సరం చాలామంది సీసీఐ కేంద్రాల్లోనే అమ్ముకుంటున్నారు. మూడు రోజులుగా కేంద్రాల్లో కొనుగోలు చేయకపోవటంతో ప్రైవేటులో తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు. కొంతమంది రోజుల తరబడి కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

**సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం...**

కొత్తగా పత్తి తెచ్చే రైతులకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదు. పాత రైతులు అమ్ముకునేందుకు ఇబ్బందులు లేవు. సాంకేతిక సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతులు సీసీఐ కేంద్రాలకు నాణ్యమైన పత్తి తెచ్చి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర పొందాలి. ఎంఏ అలీం, డీఎంఓ, ఖమ్మం

# పెద్దపల్లి మార్కెట్ కార్యదర్శి సస్పెన్షన్



పెద్దపల్లి: సీసీఐ కొనుగోలు కోసం కౌలు రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన వ్యవహారంలో పెద్దపల్లి మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పృథ్వీరాజ్ సస్పెండ్ అయ్యారు. జిన్నింగ్ మిల్లర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో విచారణ నిర్వహించిన మార్కెటింగ్ శాఖ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. పెద్దపల్లి మార్కెట్‌కు తాత్కాలిక కార్యదర్శిగా సుల్తానాబాద్ కార్యదర్శి మనోహర్ అదనపు బాధ్యతలు స్వీకరించారు. కాగా కార్యదర్శి సస్పెన్షన్‌కు కారణాలేవీ ఉత్తర్వులలో స్పష్టంగా పేర్కొనలేదు. దీంతో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి వివరాల కోసం ఉన్నతాధికారులను సంప్రదిస్తున్నారు.

**నిబంధనల ఉల్లంఘన?** బహిరంగ మార్కెట్లో పత్తికి ధర లేకపోవడంతో రైతుల వద్ద సీసీఐ మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేస్తుంది. వ్యవసాయాధికారులు నమోదు చేసిన క్రాప్ బుకింగ్ ప్రకారం సంబంధిత రైతుల వద్దే పంటను కొనుగోలు చేస్తుంది. కౌలు రైతుల వివరాలేవి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండకపోవడంతో మార్కెట్ కార్యదర్శి తన లాగిన్‌లో కౌలురైతుకు సంబంధించిన వివరాలను తాత్కాలిక నమోదు చేస్తేనే సీసీఐ కొనుగోలు చేసేందుకు అవకాశముంటుంది. ఈ టెంపరరీ రిజిస్ట్రేషన్ కోసం మండల వ్యవసాయాధికారి ధ్రువీకరణ తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఈ పత్రాన్ని ఫైల్ చేయడంతో పాటు రాష్ట్ర కార్యాలయానికి కూడా ప్రతిని పంపించాలి. పెద్దపల్లి మార్కెట్‌లో ఇలాంటి తాత్కాలిక రిజిస్ట్రేషన్లు ఇప్పటి వరకు 810 జరిగాయి. ఇతర జిల్లాలకు సంబంధించినవి నాలుగు ఉన్నాయి. తాత్కాలికంగా నమోదైన రైతుల వివరాలు పూర్తిస్థాయిలో లేకపోవడం, ఇతర జిల్లాలకు చెందిన రైతుల వివరాలను సైతం నమోదు చేసినట్లు గుర్తించిన అధికారులు కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిసింది.

**మూడో రోజూ పనిచేయని సర్వర్లు** సీసీఐ కొనుగోళ్లకు ఆధార్ సర్వర్ పనిచేయకపోవడంతో జిల్లాలోని వివిధ సీసీఐ కొనుగోలు కేంద్రాలలో రెండు రోజులుగా పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడం తెలిసిందే. జిల్లాలోని అయిదు జిన్నింగ్ మిల్లులలో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాలలో పత్తి కొనుగోళ్లు జరగలేదు. రాత్రి వరకు సమస్య తొలిగిపోయే అవకాశముందని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

# మూగజీవాల దప్పిక తీరేదెలా?



సిరిసిల్ల : వేసవి ప్రారంభానికి ముందే జలవనరుల్లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతోంది. విరివిగా నీటి వినియోగంతో భూగర్భ జలాలు తగ్గుతూ వస్తున్నాయి. అడవుల్లో నీటి కుంటలు చాలా వరకు ఎండిపోయాయి. అడవులతోపాటు గ్రామాల్లో పశుగ్రాసం ఎండుముఖం పడుతోంది. ఫలితంగా మూగజీవాల ఆకలిదప్పికలు తీర్చేందుకు కాపర్లు ముప్పుతిప్పలు పడుతున్నారు. గోదావరి తీర ప్రాంతాలతోపాటు అనుకూలంగా ఉన్న చోటుకు మందలతో వలస వెళుతున్నారు.

జిల్లాలోని 13 మండలాల పరిధిలో 255 గ్రామపంచాయతీలున్నాయి. మెట్టప్రాంతం కావడంతో గొలుసుకట్టు చెరువులు, కుంటలపైనే జిల్లావాసులు ఆధారపడుతుంటారు. ఇవే పశువుల దాహార్తిని తీర్చే ప్రధాన వనరులు. గతేడాది వానాకాలంలో పూర్తి స్థాయిలో నిండిన జల వనరులు ఎండల తీవ్రత, సాగునీటి విడుదల కారణంగా ప్రస్తుతం అడుగంటుతున్నాయి. వరిసాగుకు అధిక మొత్తంలో నీటిని వినియోగిస్తుండటంతో బోరుబావుల్లో ఆశించిన మేర నీటిధారలు రావడం లేదు. అడవుల్లో పశుగ్రాసం దొరకడం లేదు, చెరువులు, కుంటలు ఉన్న ప్రాంతాల్లో గ్రాసం లభించక కాపర్లు ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు.

**నిరుపయోగంగా తొట్టీలు....**

గ్రామాల్లో జీవాల దాహార్తి తీర్చేందుకు గతంలో ప్రభుత్వం నీటి తొట్టీలను నిర్మించింది. ఈ వేసవిలో వాటిని వినియోగిస్తే కొంత ఉపశమనం ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో తొట్టీల వినియోగం బాగానే ఉన్నా మెజారిటీ గ్రామాల్లో నీటిని నింపడం లేదు. అధికారులు పట్టించుకోకపోవడంతో మరమ్మతులకు గురవుతున్నాయి. చాలాచోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. జిల్లా అధికారులు వేసవిలో పశువుల తొట్టీలను వినియోగంలోకి తీసుకువస్తే జంతువుల దాహార్తి తీరనుంది.

**ముమ్ముందు గ్రాసం కొరత-బండారి మహేష్, మద్దిమల్ల**

అడవులు, గ్రామాల్లో పశుగ్రాసం కొరత తీవ్రంగా ఏర్పడింది. మేతకోసం తీసువెళితే ఎక్కడా గడ్డి దొరకడం లేదు. అడవుల్లో నీటి లభ్యత అంతగా లేదు. చెరువులు, కుంట చుట్టూ పొలాలు ఉండటంతో జీవాలను నీటి వద్దకు తీసుకువెళ్లడం సాధ్యం కావడం లేదు. గతంలో నిర్మించిన నీటి తొట్టీలను వినియోగంలోకి తీసుకువస్తే చాలా వరకు ప్రయోజనం చేకూరుతుంది.

# రాజీవ్ రహదారి.. ప్రమాద దరి



సుల్తానాబాద్ : సుల్తానాబాద్ మండలంలో దుబ్బపల్లినుంచి చిన్నకల్వల వరకు దాదాపు 18 కిలోమీటర్ల మేర ఉన్న రాజీవ్ రహదారి ప్రమాదాల సవారీగా మారింది. నిత్యం ఏదో చోట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారి పైనే లారీలు, పలు వాహనాలు నిలిపి ఉండటంతో రాత్రిపూట వాహనదారులు గమనించక వాటిని ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. గడిచిన సంవత్సర కాలంలో దాదాపు 30 ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

**సూచికలు, వెలుగులు కరవు**

మండలపరిధిలోని రాజీవ్ రహదారిపై పలు కల్వర్టు, మూల మలుపులు, రహదారి దాటే దారుల్లో వేగనిరోధక సూచికలు, సరిపడా విద్యుత్తు వెలుగులు కరవయ్యాయి. దీంతో రాత్రిపూట వాహనదారులు వాటిని గమనించక ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు.

**సర్వీసు రోడ్డు లేక**

సుల్తానాబాద్ గ్రామపంచాయతీ నుంచి పురపాలక సంఘంగా అభివృద్ధి చెందింది. నానాటికీ పట్టణ జనాభా పెరుగుతోంది. పట్టణంలో సర్వీసు రోడ్డు నిర్మించాల్సి ఉండగా చేపట్టలేదు. దీంతో ఆర్టీసీ బస్సు, ప్రైవేటు వాహనాలు ఢీకొని బాటసారులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్టీసీ బస్సులు ప్రయాణ ప్రాంగణంలోకి వెళ్లి, బయటకు వచ్చే సమయంలో వేరే వాహనాలను ఢీకొంటున్నాయి.

**18 కిలోమీటర్లు 10 బ్లాక్ స్పాట్‌లు**

సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి నుంచి చిన్నకల్వల వరకు ఉన్న రాజీవ్ రహదారిపై పోలీసులు పది బ్లాక్‌స్పాట్లు గుర్తించారు. మండలంలో దుబ్బపల్లి, భూపతిపూర్, గర్రెపల్లి, నర్సయ్యపల్లి, కాట్నపల్లి, పూసాల, సుల్తానాబాద్, సుగ్లాంపల్లి, నారాయణపూర్ అడ్డరోడ్డు, చిన్నకల్వల గ్రామాల వద్ద బ్లాక్‌స్పాట్లు గుర్తించారు. ఈ ప్రాంతాల వద్ద పోలీసులు బారికేట్లు, వేగనిరోధక స్టాపర్లు, సీసీ కెమెరాల ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణ చేపడుతున్నారు.

**ఇటీవల జరిగిన ఘటనలు**

జనవరి 29న కాట్నపల్లి సమీపంలో రహదారి కల్వర్టును కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా, అయిదుగురికి గాయాలయ్యాయి. డిసెంబరు 27న సుగ్లాంపల్లి సమీపంలో పెట్రోల్ ట్యాంకర్ ఢీకొని ఒకరు గాయపడ్డారు.

డిసెంబరు 18న దుబ్బపల్లి వద్ద యూటర్న్ తీసుకుంటున్న లారీని ద్విచక్రవాహనదారులు ఢీకొనగా ముగ్గురు విద్యార్థులు గాయపడ్డారు.

ఇలా చేస్తే మేలు

మండలపరిధిలోని రాజీవ్ రహదారిపై కల్వర్టులు, మూలమలుపులు, రహదారి దాటే మార్గాల్లో ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలి.

రహదారులపై వాహనాలు నిలపకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

సుదూర వాహనదారులకు విశ్రాంతి భవనాలు, సౌకర్యాలు కల్పించాలి.

సుల్తానాబాద్ పట్టణంలో సర్వీసు రహదారిని నిర్మించాలి.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం- శ్రావణ్‌కుమార్, ఎస్సై సుల్తానాబాద్ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు ఎప్పటికప్పుడు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం. ఎచ్‌కేఆర్ రహదారి నిర్వాహకుల సౌజన్యంతో బ్లాక్‌స్పాట్లు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసి ప్రమాదాల నివారణ చేపడుతున్నాం. వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించి ప్రమాదాల బారి నుంచి రక్షించుకోవాలి.

# కొరవడిన నిఘా.. మాయమవుతున్న జాగా

ఆదిలాబాద్ : నాలుగు సిమెంటు స్తంభాలు పాతిన ఈ స్థలం బట్టిసావర్గాం పంచాయతీలోని 72 సర్వే నెంబరులోనిది. ఇది ప్రభుత్వ స్థలం. గ్రామంలో ఇంటి స్థలాల కోసం అర్హులున్నప్పటికీ ఎవరికీ కేటాయించలేదు. కానీ స్థిరాస్తి వ్యాపారులకు చెందిన బినామీ వ్యక్తులు ఇటీవల ఈ స్థలం తమదని స్తంభాలు వేశారు.

జిల్లాలో ప్రభుత్వ స్థలాలపై అధికారుల నిఘా కొరవడుతోంది. స్థిరాస్తి వ్యాపారుల అక్రమ వ్యాపారానికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. అసైన్డ్ భూములను ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా నియంత్రించాల్సిన అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోంది.

జిల్లా కేంద్రాన్ని ఆనుకుని ఉన్న మావల, బట్టిసావర్గాం, కేఆర్కే, వికలాంగుల కాలనీలు వెలిసిన ప్రభుత్వ సర్వే నెంబర్లు 72, 346లలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉండేది. ఎక్కువగా 1990 నుంచి ప్రభుత్వం పేదల ఇళ్ల స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల కోసం భూములను అసైన్ చ్టేస్తోంది. ఈ స్థలాలను మినహాయిస్తే మిగిలిన భూములను లెక్క తీసి అన్యాక్రాంతం కాకుండా చూడటంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటం స్థిరాస్తి వ్యాపారులకు కలిసి వస్తోంది. బహిరంగ మార్కెట్ ధరల ప్రకారం ప్రభుత్వ స్థలాల్లో వెలిసే ఒక్కో ఇంటిజాగా విలువ రూ.20 లక్షల వరకు ఉంటోంది. స్థిరాస్తి వ్యాపారులు, అధికారుల మధ్య నీకింతా, నాకింత అన్నట్లు దందా నడుస్తోంది.

**ఇలా చేస్తే మేలు..**

జిల్లా కలెక్టర్, ఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక సమావేశం నిర్వహించాలి. అసైన్డ్ స్థలాలను మినహాయిస్తే మిగిలిన భూములు ఎక్కడెక్కడో ఉన్నాయో నిర్ధారించాలి. ప్రభుత్వ భూములు ఆక్రమణని తేలితే స్వాధీనం చేసుకుని, బోర్డులు ఏర్పాటు చేయాలి. నకిలీ పత్రాలతో స్థిరాస్తి వ్యాపారులకు సహకరించే ప్రభుత్వ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.

ఇది మావల మండలం దుబ్బగూడలోనిది. ముందు సిమెంటు స్తంభాలతోపాటు వాటివెనక ఉన్న రేకుల షెడ్డు సైతం అక్రమంగా వెలిసిందే. వీటివిలువ దాదాపు రూ.30 లక్షల వరకు ఉంటుంది. కొంతమంది స్థిరాస్తి వ్యాపారులైతే ఒకడుగు ముందుకేసి ప్రభుత్వం తమకు అసైన్ చేసిందని, నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) ఇచ్చిందని నకిలీ పత్రాలను సృష్టించి వివాదాస్పదం చేస్తున్నారు.

**కలెక్టర్‌కు నివేదిస్తాం : వేణు, మావల తహసీల్దార్**


మావల, బట్టిసావర్గాం, దుబ్బగూడలో కొన్ని చోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురైనట్లు మా దృష్టికి వచ్చింది. కొన్ని స్థలాల విషయమై కోర్టులో కేసు నడుస్తోంది. క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదిక తయారు చేస్తాం. నకిలీ పత్రాలు తయారు చేయటంలో ప్రభుత్వ సిబ్బంది పాత్ర ఉంటే చర్యలు తీసుకునేలా కలెక్టర్‌కు నివేదిస్తాం.

# సీఎంఆర్‌లో మాయాజాలం

నిర్మల్ : జిల్లాలో సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్) వ్యవహారంలో పెద్దఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. కొంతమంది మిల్లర్లు తమ రైస్‌మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని సొమ్ము చేసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. గడువులోగా సీఎంఆర్ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ఇవ్వడంలో కొత్త ఎత్తుగడలు వేస్తూ మిల్లర్లు చేతివాటాన్ని ప్రదర్శించినట్లు స్పష్టమైంది. రూ.120 కోట్ల విలువైన దాదాపు 49 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలించి స్వాహా చేసినట్లు తేలడంతో వాటిని రాబట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని ఏడు రైస్‌మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు ఆర్‌ఆర్ (రెవెన్యూ రికవరీ) యాక్ట్ ప్రకారం వాటి ఆస్తులు వేలం వేయాలని నిర్ణయించారు. మరో 8 మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

**ఇదీ పరిస్థితి**

2001-22 యాసంగి, 2022-23 వానాకాలం, యాసంగి, 2023-24 వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలోని 15 రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యం మాయం చేస్తూ వచ్చారు. ఇందులో సారంగాపూర్ మండలం చించోలి(బి)లోని శ్రీ అన్నపూర్ణ ఆగ్రో ఇండస్ట్రీస్, ముథోల్ మండలం చింతకుంటలోని జశ్రిత, బాసర మండలం కిర్గుల్(బి)లోని అక్షయ్‌రెడ్డి, సారంగాపూర్ మండలం బీరవెల్లిలోని సాయికృప, లోకేశ్వరం మండలం జొహరాపూర్‌లోని రాజరాజేశ్వర, ధర్మోరలోని శ్రీ వెంకటేశ్వర, భైంసా మండలం దేగాంలోకి రాజరాజేశ్వర



రైస్‌మిల్లులకు కేటాయించిన 34,537 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయం చేశారు. వీటి విలువ రూ.84 కోట్లు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడు మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టారు. కడెం మండలం లక్ష్మీపూర్, భైంసా మండలం దేగాంలోని శ్రీ వెంకటలక్ష్మి నరసింహ, ఆదిత్య మోడ్రన్, నర్సాపూర్(జి)లోని శ్రీ అనంత, ఇదే మండలం చాక్‌పెల్లిలోని శ్రీరామ, భైంసా మండలం మాటేగాంలోని ఓంకారేశ్వర, లక్ష్మణచాంద మండలం తిర్పెల్లిలోని ప్రతిమ, శ్రీనిర్వాణ రైస్‌మిల్లులకు అప్పగించిన 15,066 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పక్కదారి పట్టించారని గుర్తించారు. వీటి విలువ రూ.36 కోట్లు ఉంటుందని లెక్కలు తేల్చారు. ఈ మిల్లులపైనా క్రిమినల్ కేసులు నమోదు చేశారు. సీఎంఆర్ అప్పగించని మిల్లులపై కొరడా ఝుళిపించడంతో మిగతా మిల్లుల యజమానులు వారికి కేటాయించిన ధాన్యాన్ని మర ఆడించి సీఎంఆర్ అప్పగిస్తున్నారు. ధాన్యం మాయం చేయడం, సకాలంలో బియ్యం ఇవ్వకపోవడాన్ని ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు వెనువెంటనే కేసులు నమోదు చేస్తున్నారు.

**మరో అవకాశం**

ఇప్పటివరకు సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఆర్‌ఆర్ యాక్ట్ కింద కేసులు నమోదైన వారితోపాటు క్రిమినల్ కేసులు నమోదైన మిల్లర్లు పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ అప్పగించే వీలు కల్పించింది. అయినా స్పందన లేకుంటే జిల్లా అధికారులు చర్యలు చేపడుతున్నారు. గత మూడు సీజన్ల నుంచి సీఎంఆర్ ఇవ్వకుండా బకాయిదారుల జాబితాలో చేరిన మిల్లర్ల నుంచి వడ్డీతో సహ డబ్బు వసూలుకు సిద్ధమయ్యారు. సీఎంఆర్ బకాయిల విషయంలో ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారని, ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ చెప్పారు.

# సర్కారు బడికి కార్పొరేట్ హంగులు

వేములవాడ: విశాలమైన భవనం, ఆహ్లాదకరమైన ఆవరణ, విశాలమైన తరగతి గదులు, వీటన్నింటికీ తోడు ప్రతి సబ్జెక్టులో బోధించే ఉపాధ్యాయులు ఉండటంతో ఆ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలో చదివిన అనుభూతి కలుగుతోంది. రెండేళ్ల క్రితం సామాజిక బాధ్యత(సీఎస్సార్)నిధులు రూ.5 కోట్లు వెచ్చించి హైదరాబాద్ యశోద ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అభివృద్ధి చేశారు. గతంలో ఉన్న భవనంపై మరో అంతస్తు నిర్మించి పాఠశాల మొత్తాన్ని ఆధునికీకరించారు. పాఠశాలలో దాదాపు 330 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు.



**ఆధునిక సౌకర్యాలు**

పాఠశాలలో ఆధునిక సౌకర్యాలను కల్పించారు. విశాలమైన తరగతి గదులతోపాటు మధ్యాహ్న భోజనం చేసేందుకు విశాలమైన డైనింగ్ హాల్, విద్యార్థులకు తాగునీటిని అందించేందుకు శుద్ధజల కేంద్రం, రీడింగ్ రూం, మరోవైపు ప్రయోగశాల, కార్యాలయం తదితర అన్ని వసతులను సమకూర్చారు. బాలురు, బాలికలకు ప్రత్యేకంగా శౌచాలయాలు, మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు ప్రత్యేకమైన వంటగది ఏర్పాటు చేశారు. దీంతో ఈ పాఠశాలలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.

**విద్యార్థులకు చక్కటి బోధన- రాజారత్నం, ప్రధానోపాధ్యాయుడు**

పాఠశాలలో విద్యార్థులకు వసతులు పూర్తి స్థాయిలో మెరుగుపడ్డాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో చక్కటి విద్యాబోధన జరుగుతోంది. తగినంత మంది బోధన సిబ్బంది ఉన్నారు. ఉత్తమ బోధనతో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించే విధంగా శిక్షణ ఇవ్వడానికి పీడీ కూడా ఉన్నారు. విద్యార్థులను ఇక్కడి సదుపాయాలను వినియోగించుకొని ఉత్తమ లక్ష్యాలను సాధించాలి.

# అక్రమమని తెలిసినా.. చర్యలెక్కడ?

మల్యాల : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ భూముల అన్యాక్రాంతంపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. ముత్యంపేట శివారులోని సంతొల్ల లొద్ది చెక్ డ్యాం కింది భాగంలో కొండగట్టు అంజన్న ఆలయం పేర విలువైన భూములున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో మల్యాలకు చెందిన ఓ వ్యక్తి దాదాపు 3 ఎకరాల భూమిని ఆక్రమించుకొని 25 ఏళ్లుగా మామిడితోట సాగు చేస్తున్నారు. ఈ విషయం ఇటీవల కొండగట్టు గిరి ప్రదక్షిణ కోసం చేపట్టిన దారి నిర్మాణం సమయంలో వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై రెండు నెలల కిందట కథనం ప్రచురించడంతో ఆలయ అధికారులు స్పందించి సదరు భూమిని స్వాధీనం చేసుకొని హద్దులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కోట్ల రూపాయల విలువైన ఆలయ



భూమి అన్యాక్రాంతమైనట్లు ఆలయ అధికారులు గుర్తించినప్పటికీ ఇంత వరకు కనీసం హద్దురాళ్లు కూడా ఏర్పాటు చేయలేదు. మల్యాల, కొడిమ్యాల మండలాల పరిధిలో అంజన్న ఆలయం పేర విలువైన భూములున్నాయి. వాటిలో కొన్ని భూములను కొందరు వ్యక్తులు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టగా, మరికొందరు కొన్నిచోట్ల సాగు చేసుకుంటున్నారు. ఆలయానికి పూర్తిస్థాయి ఈవో లేకపోవడంతో ఆలయ భూముల పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారిందని పలువురు భక్తులు పేర్కొంటున్నారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఆలయ భూములను ఆక్రమించుకొన్న వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు హద్దులు భూముల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# సరిపడా నిల్వలుంటే నిరీక్షణ ఎందుకో!

కరీంనగర్ : జిల్లాలో పలు చోట్ల యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత యాసంగి సీజన్‌లో అంచనాల మేరకే వరి సాగైనా ఎరువుల విక్రయ కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ముందస్తు ప్రణాళిక ప్రకారమే జిల్లాకు సరిపడా ఎరువుల ఇండెంట్ పెట్టామని, సరిపడా నిల్వలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అవసరమైన ఎరువుల నిల్వలను ఎక్కువగా కరీంనగర్‌లోనే డంప్ చేస్తారు. రెండు రోజుల కిందట రాజన్న సిరిసిల్ల జిల్లాలో యూరియా కొరత ఏర్పడగానే ఇక్కడి నుంచి పంపించినట్లు సమాచారం. జిల్లాలో యాసంగి వరిలో సింహభాగం పొట్ట



దశలో ఉంది. ఈ సమయంలో యూరియా కొరత రైతులను కలవరపెడుతోం ది. అధికారులు మందస్తు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

**మోతాదుకు మించి వినియోగం**

మిగిలిన ఎరువులతో పోలిస్తే శాస్త్రవేత్తలు సూచించిన దానికి మించి రైతులు యూరియా వినియోగిస్తున్నారు. సుమారు రూ.2 వేల విలువైన యూరియా సంచి రాయితీతో కేవలం రూ.267కే లభిస్తుండటమే ఇందుకు కారణమని భావిస్తున్నారు. జిల్లాలో యూరియా మినహా డీఏపీ, కాంప్లెక్స్, ఎంవోపీ ఎరువులు అవసరానికి మించి నిల్వ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**ఇబ్బందులు లేకుండా చర్యలు**–జె.భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి జిల్లాలోని అన్ని విక్రయ కేంద్రాల్లో సరిపడా యూరియా నిల్వలున్నాయి. కొన్ని ప్రాథమిక సహకార సంఘాలు సకాలంలో డబ్బులు చెల్లించకపో వడం, ఈ పాస్ విధానంలో నమోదు చేసిన తర్వాతే విక్రయించడం కారణాలతో పంపిణీ కొంత జాప్యం జరుగుతోంది. ఎక్కడా రైతులకు ఇబ్బంది కలగకుం డా చర్యలు చేపడుతున్నాం. రైతులు అవసరానికి మించి కొనుగోలు చేయొద్దు.

# హుస్సేన్‌సాగర్ స్కైవాక్‌కు మార్గం సుగమం!



హైదరాబాద్ : నగరంలో ప్రధాన పర్యాటక కేంద్రమైన హుస్సేన్‌సాగర్ చుట్టూ స్కైవాక్‌కు మార్గం సుగమమైంది. ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించింది. ఇప్పటికే హెచ్ఎండీఏ ప్రతిపాదనలు సిద్ధంచేసింది. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) విధానంలో చేపట్టాలనేది యోచన. ప్రాజెక్టు నిర్వహణకు ఆర్థిక వెసులుబాటు(ఫైనాన్షియల్ వయబులిటీ)పై అధికారులు కసరత్తు చేస్తున్నారు. నిర్వహణ కీలకం కావడంతో.. ఆదాయం పొందే మార్గాలపై హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ఉమ్మా ప్రణాళిక సిద్ధంచేస్తోంది. హుస్సేన్‌సాగర్ చరిత్రను దృష్టిలో పెట్టుకొని స్కైవాక్ నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోనున్నారు. సాధ్యమైనంత వరకు నీటిలో స్తంభాలు లేకుండా, గట్టుకు ఆనించి ఉండేలా డిజైన్ చేస్తున్నారు. స్కైవాక్‌తో పాటు ఒకవైపు సైకిల్ ట్రాక్ నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.500కోట్ల వరకు ఖర్చుచేయనున్నారు.

**ప్రాజెక్టులో కీలకాంశాలు**

నగరంలో ప్రధాన పర్యాటక ప్రాంతాలుగా.. హుస్సేన్‌సాగర్‌లోని నెక్లెస్ రోడ్డు, సంజీవయ్య పార్కు, లుంబిని పార్కు, ఎన్టీఆర్ గార్డెన్, ట్యాంక్‌బండ్ కీలకమైనవి. ఆయా చోట్ల మరింత మంది పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఖైరతాబాద్ మెట్రో స్టేషన్‌తో ఈ స్కైవాక్‌ను అనుసంధానించనున్నారు. మెట్రో దిగి స్కైవాక్‌పై నుంచి నడిచి వెళ్లి హుస్సేన్‌సాగర్ అందాలను తిలకించవచ్చు. మెట్రో, ఎంఎంటీఎస్ స్టేషన్లనుంచి ఐమాక్స్ మీదుగా అటు నెక్లెస్ రోడ్డు, ఇటు ఎన్టీఆర్ పార్కు నుంచి సాగర్ చుట్టూ 10 కి.మీ.మేర ఈ స్కైవాక్ రానుంది.

ఆరు మీటర్ల వెడల్పుతో ఏర్పాటుచేయనున్నారు. అందులోనే ఒకవైపు సైకిల్ ట్రాక్‌కు, ఇంకో భాగం నడిచే మార్గానికి కేటాయించనున్నారు. కీలకమైన మొత్తం 7 ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఉంటాయి. ఈ ప్రాంతాల్లో లిఫ్టులు ఏర్పాటుచేయనున్నారు. సైకిళ్లు తొక్కుతూ స్కైవాక్ పైకి చేరేలా ర్యాంపులు ఏర్పాటు కానున్నాయి.

**ఆదాయ మార్గం ఇలా..**

స్కైవాక్‌కు ఆనుకుని ఫుడ్‌కోర్టులు, ఓపెన్ థియేటర్లు, గేమింగ్ జోన్లు, మినీ థియేటర్లులాంటివి అందుబాటులోకి తేనున్నారు. స్కైవాక్ పైకి వెళ్లిన తర్వాత నడుచుకుంటూ హుస్సేన్‌సాగర్‌ను చుట్టి రావచ్చు. ఉదయపు నడకకు ఈ మార్గాన్ని వినియోగించుకోవచ్చు. పైకప్పుపై సోలార్ ప్యానళ్లను ఏర్పాటుచేసి సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయనున్నారు. ప్రవేశ రుసుం కింద పర్యాటకుల నుంచి కొంత వసూలు చేసే యోచన ఉందని ఓ అధికారి తెలిపారు. వ్యాపార, వాణిజ్య కార్యకలాపాల కోసం పలు చోట్ల జోన్లు కేటాయించడం, పార్టీలు, పుట్టిన రోజులు, పెళ్లి వేడుకలు లాంటివి చేసుకునేందుకు లాంజ్‌లు కూడా అందుబాటులోకి తేవడం ద్వారా ఆదాయం పొందనున్నారు. ఫలితంగా ప్రాజెక్టు నిర్వహణకు ఇబ్బంది ఉండదని భావిస్తున్నారు.

# ఉన్నది ఒక్కటే.. 'మూడేళ్ల' ముచ్చటే



హైదరాబాద్ : నగరానికి ఉన్న ఏకైక చెత్త నిల్వ కేంద్రం జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు. ఇది మరో మూడేళ్లలో స్తంభించనుంది. అయినా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం లేదు. చెత్త సమస్యకు ఉత్తమ పరిష్కారంగా భావించే డబ్ల్యూటీఈ (వేస్ట్ టు ఎనర్జీ) కేంద్రాలను విస్తరించడం లేదు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన పరిష్కారం చూపకపోతే రాబోయే రోజుల్లో ఇంటింటి చెత్త సేకరణపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనిపై తాజాగా ఘన వ్యర్థాల నిర్వహణ విభాగం ఇంజినీర్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి వద్ద ప్రస్తావించడం ఆందోళనకు అద్దం పడుతోంది.

**నాలుగు చోట్ల స్థలాలు..**

డంపింగ్‌యార్డుల కోసం రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో 42.22 ఎకరాలు, సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం లక్డారంలో 100ఎకరాలు, మేడ్చల్ జిల్లా దుండిగల్‌లో 85 ఎకరాలు, భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం మల్కాపూర్ వద్ద 200 ఎకరాల స్థలాలను జీహెచ్ఎంసీకి ఇవ్వాలని ఆయా జిల్లాల కలెక్టర్లను అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశించారు. భూమిని బల్దియాకు బదలాయించే క్రమంలో స్థానికులు, ప్రజాప్రతినిధులు అడ్డుకోవడంతో ప్రక్రియ నిలిచిపోయింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో అత్యాధునిక వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని నిర్మించేందుకు బల్దియా ఇటీవల పనులు చేపట్టగా.. స్థానికులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో అడ్డంకులు తలెత్తాయి.

**ప్రస్తుతం రెండు చోట్లే..**

జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు వచ్చే చెత్త నుంచి రోజూ 4వేల టన్నుల పొడి చెత్తను వేరు చేస్తున్నారు. 24మెగావాట్ల ఒకటో విద్యుదుత్పత్తి కేంద్రానికి 1,500 టన్నుల పొడి చెత్తను తరలిస్తున్నారు. అక్కడే 24 మెగావాట్ల రెండో విద్యుదుత్పత్తి కేంద్రం నిర్మాణంలో ఉంది. అది అందుబాటులోకి వస్తే మరో 1,500 టన్నుల పొడి చెత్తకూ పరిష్కారం లభిస్తుంది. దుండిగల్‌లో ఇటీవల అందుబాటులోకి వచ్చిన 15మెగావాట్ల ఒకటో విద్యుదుత్పత్తి కేంద్రానికి మరో 1,000టన్నుల పొడి చెత్త ప్రస్తుతం తరలుతోంది. ప్యారానగర్, దుండిగల్‌తోపాటు ఇతర కేంద్రాలు అందుబాటులోకి వస్తేనే పూర్తిస్థాయి పరిష్కారం లభిస్తుంది.

**మిగిలింది కొద్ది ప్రాంతమే..**

హైదరాబాద్‌లో ఉత్పత్తయ్యే చెత్త రెండు దశాబ్దాలుగా శామీర్‌పేట మండలం జవహర్‌నగర్ గ్రామంలోని 390 ఎకరాల స్థలంలో పోగవుతోంది. అక్కడి వ్యర్థాల యాజమాన్య కేంద్రంలో సాధ్యమైనంత చెత్తను రీసైక్లింగ్ చేస్తూ పునర్వినియోగానికి మళ్లిస్తున్నారు. ఇటీవల రెండెకరాల విస్తీర్ణంలోని డంపింగ్‌యార్డు నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని తొలగించి ఆ ప్రాంతాన్ని కూడా చెత్తతో నింపేస్తుండటం గమనార్హం. ప్రస్తుతం డంపింగ్‌యార్డులో మరో 30 ఎకరాల ఖాళీ స్థలం ఉంటుందని, రెండున్నరేళ్లలో అదీ నిండిపోతుందని నిర్వాహకులు చెబుతున్నారు.

ప్రమాదకర సూచనలు ఇలా.. (టన్నుల్లో..)

రోజుకు ఉత్పత్తయ్యే వ్యర్థాలు: 10 వేలు

విద్యుదుత్పత్తి కోసం వేరు చేస్తున్న పొడి చెత్త: 4,000–5,000

విద్యుదుత్పత్తి కేంద్రాల కోసం నిల్వ చేస్తోంది: 2,000–2,500

సేంద్రియ ఎరువు కోసం వేరు చేస్తున్న వ్యర్థాలు: 300–350

రీసైక్లింగ్, పునర్వినియోగానికి ఉపయోగపడని వ్యర్థాలు: 3,000–4,000

# ఇచ్చుకో.. పుచ్చుకో..

హైదరాబాద్ : 'మున్సిపాలిటీల్లో మన గ్రామాలు కలిసిపోతున్నాయి.. పన్నులు రెండింతలు వసూలు చేస్తారు. ఇళ్లు కట్టుకునేవారు తొందరగా నంబర్లు వేయించుకోండి" అంటూ కొందరు గ్రామ పంచాయతీ అధికారులు విలీన గ్రామాల్లో చేస్తున్న ప్రచారమిది. మున్సిపాలిటీల్లోకి కొత్తగా చేరిన కొన్ని గ్రామాల్లో ఇంటి నంబర్లు వేసుకుంటే పంచాయతీ పన్నులే కొన్నేళ్లు కొనసాగుతాయని నమ్మిస్తున్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీలోని నాలుగు గ్రామాలు, చేవెళ్లలోని మూడు గ్రామాల్లో కొద్దిరోజుల క్రితం వరకూ రూ.వేలల్లో వసూలుచేసి ఇంటి నంబర్లు కేటాయించారు. ఇందులో ఖాళీ స్థలాలు సైతం ఉన్నట్లు సమాచారం. ఆన్‌లైన్ విధానం రావడంతో ఈ తంతు ఆగిపోయింది.

**ప్రక్రియ పూర్తయ్యేలోపే..**మొయినాబాద్, చేవెళ్ల మేజర్ గ్రామ పంచాయతీలను మున్సిపాలిటీలుగా చేస్తామంటూ ఆరేడు నెలల క్రితం స్థానిక ఎమ్మెల్యేలు ప్రకటించారు. వీరి అభ్యర్థనల మేరకు గతనెల 25న మున్సిపాలిటీలుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అప్పటికి చేవెళ్ల, మొయినాబాద్ మున్సిపాలిటీల్లో ఎనిమిది గ్రామాల చొప్పున కలిపేశారు. విలీన ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ ఇంటిపన్నులు, ఇళ్ల వివరాలన్నీ పంచాయతీ అధికారుల వద్దే ఉన్నాయి. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయ్యేలోపు పన్నులు, కొత్తగా ఇంటి నంబర్ల కేటాయింపు అంశాలపై కొందరు అధికారులు దృష్టిసారించారు. వెంటనే ఇంటి నంబర్లు వేసుకుంటే తక్కువ పన్ను వసూలు చేస్తామని, ఏడాది దాకా తక్కువగానే ఉంటుందని నమ్మించి రూ.వేలల్లో వసూలు చేశారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు పెయింట్‌తో నంబర్లు రాయించారు.

**111 జీవో నిబంధనలు తప్పించుకునేందుకు..**మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిది గ్రామాల్లో 111జీవో వర్తిస్తుంది. కొత్తగా నిర్మాణాలు వద్దని రెండేళ్ల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఎవరైనా కట్టుకున్నా.. వాటికి నంబర్లు కేటాయించవద్దని ప్రత్యేకంగా ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో.. మొయినాబాద్ మున్సిపాలిటీ అవుతుందన్న ప్రచారంతో అనుమతుల్లేకుండా ఇళ్లు నిర్మించుకునే వారిపై కొందరు అధికారుల దృష్టిపడింది. ఇంటి నంబర్లు కేటాయిస్తే గతంలో ఉన్నవిగా చూపిస్తామని, దీంతో కచ్చితంగా సక్రమమవుతుందంటూ వారు గండిపేట చెరువు సమీపంలోని ఓ గ్రామస్థులకు చెప్పారు. ఆయా ఇళ్ల నిర్మాణాన్ని బట్టి రూ.లక్షల్లో ముడుపులు తీసుకున్నారు. అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశాలున్నాయి.

# సర్కారు వైద్యం.. అందని దైన్యం

కరీంనగర్ : గంగాధర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండు వైద్యుల పోస్టులూ భర్తీకి నోచుకోలేదు. రామడుగు మండలం గుండి గోపాల్‌రావుపేట వైద్యురాలికి అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో నలుగురు స్టాఫ్‌నర్సులు విధులు నిర్వర్తించగా ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. ఇద్దరు ఏఎన్ఎంలు డిప్యుటేషన్‌లో వెళ్లడంతో గంగాధర, నారాయణపూర్ గ్రామాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒక సూపర్‌వైజర్ డిప్యుటేషన్‌లో ఉండగా వాచ్‌మెన్ లేక ఏళ్ల తరబడి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రి వేళ ఆసుపత్రిలో మహిళా సిబ్బందికి, రోగులకు రక్షణ లేక ఆందోళనకు గురవుతున్నారు.

ఈ ఒక్క ఆసుపత్రిలోనే కాదు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది నియామకం లేక రోగులకు సేవలు పూర్తి స్థాయిలో అందడం లేదు. ప్రసవాలు, అత్యవసర సేవలు అవసరమైనపుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని సిబ్బందిపై అదనపు భారం పడుతోంది. గంగాధర మండలంలోని 33 పంచాయతీలతో పాటు 10 అనుబంధ గ్రామాలకు గంగాధర ప్రధాన కూడలిలో ఉన్న ఆసుపత్రే పెద్ద దిక్కు. ఇక్కడికి నిత్యం రోగులు పెద్ద సంఖ్యలో వస్తుండగా వైద్యులు, సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మేజర్ పంచాయతీ అయిన గర్శకుర్తిలో ఏఎన్ఎం డిప్యుటేషన్‌పై వెళ్లగా



రెండో ఏఎన్ఎంపై అదనపు భారం పడుతోంది. ఓవైపు ప్రభుత్వాసుపత్రుల్లో సహజ ప్రసవాలు పెంచాలని జిల్లా అధికారులు లక్ష్యం నిర్దేశిస్తుండగా ఈ మేరకు పోస్టులు భర్తీ చేయడం లేదు.

**రక్త పరీక్షల నిర్వహణకు ఆటంకాలు**

జిల్లాలోని 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 52 మహిళా ఆరోగ్య సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 25 స్టాఫ్‌నర్సు, 12 గ్రేడ్–2 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు, 10 ఫార్మాసిస్టు గ్రేడ్ 2 పోస్టులు ఏళ్ల తరబడి భర్తీకి నోచుకోవడం లేదు. 97 పల్లె దవాఖానాలుండగా అన్ని చోట్లా వైద్యుల నియామకం జరిగిందని జిల్లా అధికారులు చెబుతున్నా కొందరు దీర్ఘకాలిక సెలవులో వెళ్లినట్లు తెలుస్తోంది. 6 అర్బన్, నాలుగు బస్తీ దవాఖానాల్లో వైద్యులున్నారని చెబుతున్నారు. పారామెడికల్ సిబ్బంది నియామకానికి ప్రభుత్వం ఇటీవలే రాత పరీక్షలు నిర్వహించినా ఎప్పుడు భర్తీ చేస్తారో స్పష్టత లేదు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉండటం రక్త పరీక్షల నిర్వహణకు ఆటంకంగా మారింది. వైద్య సిబ్బంది ఖాళీల భర్తీపై ప్రభుత్వానికి నివేదించినట్లు జిల్లా వైద్యాధికారులు తెలిపారు. అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బందితో ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఇసుక లూటీకి పడేనా అడ్డుకట్ట!

కరీంనగర్ : 'అవసరమైతే నేనే రీచ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేస్తా. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇసుక పక్కాగా సరఫరా అవ్వాలి. పటిష్ఠ పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి. మాఫియాపై ఉక్కుపాదం మోపాలి'.–ఈ నెల 10న మైనింగ్ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలుఉమ్మడి జిల్లాలో లభ్యమయ్యే ఇసుకకు రాష్ట్రంలో డిమాండ్ ఎక్కువ. మానేరు, గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఇసుక నాణ్యంగా ఉండటంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాలవారు ఇక్కడి ఇసుకను కొనుగోలు చేస్తారు. ఈ క్రమంలో గతంలో అనుమతికి మించి తవ్వకాలు, రవాణా జరిగేది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఇసుక రవాణా, సరఫరా వ్యవస్థను పక్కాగా చేపట్టే దిశగా సన్నద్ధమవుతున్న నేపథ్యంలో పటిష్ఠ చర్యలు తీసుకుంటేనే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది.

**గతంలో అక్రమాలు**

తెలంగాణ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (టీఎస్ఎండీఎస్) 2015 నుంచి ఉమ్మడి జిల్లాలో రీచ్‌ల సంఖ్యను పెంచుతూ వచ్చింది. గరిష్ఠంగా కరీంనగర్ జిల్లాలో 12, పెద్దపల్లి జిల్లాలో 23 రీచ్‌లకు ఆయా సందర్భాల్లో అనుమతినిచ్చారు. ఇదేకాకుండా సిరిసిల్ల, జగిత్యాలలో 'మన ఇసుక విధానం'తో కొన్నింటిని ఇసుక రవాణా ప్రాంతాలుగా గుర్తించి ఆన్‌లైన్‌లో నమోదైన వారికి సరఫరా చేశారు. ఒక్కో రీచ్ వద్ద 25 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తవ్వే అవకాశం ఉండగా అంతకు మించి దోపిడీ జరిగింది. ఒక్కో లారీలో 14 క్యూబిక్ మీటర్లు (21 టన్నులు) నింపాల్సి ఉండగా అక్కడి సిబ్బంది అదనంగా లారీకి రూ.2 నుంచి 3 వేలు వసూలు చేసి 30 టన్నులు నింపేవారు.

రాజకీయ నాయకుల అండదండలు, పోలీసు, మైనింగ్ శాఖల్లోని



కొందరు అధికారుల సహకారంతో గతంలో ఇసుక దోపిడీ ఇష్టారాజ్యంగా సాగింది. సగటున రోజుకు 200 టిప్పర్లు, 500 ట్రాక్టర్ల ఇసుక పక్కదారి పట్టేది. పేరుకే అధికారిక రీచ్‌లున్నా.. నిబంధనలకు విరుద్ధంగా అదనపు దందా నడిచింది. నిర్ణీత పరిమాణాన్ని మించి అధిక లోడుతో ఇసుకను వ్యాపారులు దోచుకెళ్లేవారు. ఈ క్రమంలో ప్రభుత్వానికి ఏటా రూ.18 కోట్ల ఆదాయం నష్టపోయినట్లు అంచనా. పేరుకు ఆన్‌లైన్ విధానం ఉన్నా.. అక్రమాలకు అడ్డుకట్ట లేకుండా పోయింది. ఇక్కడి దందాపై జాతీయ హరిత ట్రైబ్యునల్ కూడా పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేసి కొన్ని రీచ్‌లను నిలిపి వేయడం గమనార్హం.అక్రమాలు గుర్తించినా నామమాత్రంగా కేసుల నమోదు, సరైన జరిమానాలు విధించకపోవడంతో అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.

పర్యవేక్షణ ఇలా పెరిగితేనే..చాలా రీచ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. ఈ నిఘా పెరగాలి. కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానించాలి.ప్రతి వాహనానికి జీపీఎస్ విధానంతోపాటు వే బిల్లుల వ్యవహారంపై మూడంచెల తనిఖీ విధానం ఉండాలి.

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లాస్థాయిలో సమన్వయ కమిటీల బాధ్యతతో రేయింబవళ్లు పర్యవేక్షణ జరగాలి.

# డిగ్రీ విద్యార్థులకు ఇంజినీరింగ్ అంశాలు

హైదరాబాద్: బీఏ, బీకాం, బీఎస్సీ పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభించేలా వర్సిటీలు వినూత్న పంథా అనుసరించనున్నాయి. ఉపాధి కల్పన, ప్రాంగణ నియామకాలు కల్పించేలా డిగ్రీ కోర్సుల్లో ఇంజినీరింగ్ సబ్జెక్టులను ప్రవేశపెట్టనున్నాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యాసంస్థల తరహాలో పాఠ్యాంశాలను రూపొందించనున్నారు. ఉస్మానియా అధికారులు ఉన్నతవిద్యా మండలి, అఖిల భారత సాంకేతిక విద్యామండలి ఆమోదంతో ఇంజినీరింగ్ పాఠ్యాంశాలు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఐఐటీల్లోనూ బ్యాచిలర్ ఆఫ్ సైన్స్.. విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల్లో పదేళ్ల నుంచి బీఎస్సీ చదువుకుంటున్న విద్యార్థులకు ఐటీ, ఫార్మా, ఇంజినీరింగ్ రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. పరిశోధన సంస్థల్లో జూనియర్ స్థాయి శాస్త్రవేత్తలుగా, పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఈ అంశాలను గమనించిన ఐఐటీలు తమ దృక్పథాన్ని మార్చుకున్నాయి. రెండు, మూడేళ్ల నుంచి బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ పేరుతో నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ప్రవేశపెట్టాయి. ఐఐటీ బాంబేలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్‌లో భౌతిక, రసాయన, గణిత శాస్త్రాల కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌లో సాధించిన ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తోంది. ఐఐటీ మద్రాస్‌లో నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (డేటా సైన్స్)ను



అందుబాటులోకి తీసుకొచ్చింది. డేటా సైన్స్ కోర్సులో ఏఏ అంశాలు ఉండాలి? మూల్యాంకనం ఎలా ఉండాలి? అన్న విషయాలపై ఐఐటీ మద్రాస్ అధికారులు పలు పరిశ్రమల ప్రతినిధులతో చర్చించి, పాఠ్యాంశాలు రూపొందించారు.

కృత్రిమ మేధ.. డేటా సైన్స్..సైబర్ భద్రత.. వర్సిటీల అనుబంధ డిగ్రీ కళాశాలల్లో బీఏ, బీకాం, బీఎస్సీ విభాగాల్లో ప్రథమ సంవత్సరం నుంచే కృత్రిమ మేధ, డేటా సైన్స్, సైబర్ భద్రత సబ్జెక్టులను ప్రవేశపెట్టాలని ఉస్మానియా విశ్వవిద్యాలయ అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. బీఏ, బీకాం విద్యార్థులకు కృత్రిమ మేధ, డేటా సైన్స్‌పై అవగాహన కలిగేలా పాఠ్యాంశాలు రూపొందించనున్నారు. బీకాం విద్యార్థులకు కృత్రిమ మేధ ద్వారా అకౌంటింగ్, టాలీలను సులువుగా నేర్చుకునేందుకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. వినోద, పర్యాటక, హాస్పిటాలిటీ రంగాల్లో ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేలా సిలబస్ తీర్చిదిద్దనున్నారు.

# అదిగో.. ఇదిగో!


సుభాష్‌నగర్: జిల్లాలో సమగ్ర, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వే చేపట్టారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించి ప్రత్యేక పర్యవేక్షణతో ఈ సర్వే కొనసాగించా రు. ఇంటింటికి తిరుగుతూ స్టిక్కర్లు అందించి వివరాలు నమోదు చేశారు. పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో సుమారు 45 రోజులపాటు సర్వే చేయగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు, అధికారులు భాగస్వాములయ్యారు. సమగ్ర సర్వేలో విధులు నిర్వర్తించిన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పారితోషికం ఇస్తామని చెప్పి వదిలేశారు. అదిగో, ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. కనీసం పండుగ అవసరాలకైనా తోడు అవుతాయని చిరు ఉద్యోగులు ఎదురు చూసినా ఫలితం లేకుండా పోయింది.

**సర్వే చేసింది వీరే..**

గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పాఠశాల ఉపాధ్యాయులు, పురపాలికల్లో మున్సిపల్ ఉద్యోగులు, ప్రభుత్వ శాఖల్లో పని చేసే వారు, ఉపాధ్యాయులు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, సీవోలు, ఇతర సిబ్బంది హాజరై ఇంటింటా తిరుగుతూ వివరాలను నమోదు చేశారు. ఆ తర్వాత కార్యాలయాల్లో వాటిని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు.

**నిధులొచ్చినా..**

ప్రభుత్వం సర్వే ఏర్పాట్లు చేసేందుకు, సిబ్బంది కోసం జిల్లాకు



రూ. 2.37 కోట్లు మంజూరు చేసింది. సర్వే నిర్వహించిన ఎన్యుమరేటర్‌కు రూ. 10 వేలు, సూపర్‌వైజర్‌కు రూ. 12 వేల చొప్పున, ఆపరేటర్లకు పారితోషికాల మొత్తాన్ని చెల్లించాల్సి ఉంది. సర్వే పూర్తయిన తర్వాత ఎంపీడీవోలు, కమిషనర్లు బ్యాంకు ఖాతాలు తీసుకున్నారు. కరీంనగర్ నగరపాలికలో సైతం కొద్ది రోజుల కిందట బ్యాంకు ఖాతాలు తీసుకోగా ఇప్పటి వరకు చెల్లింపులు చేయలేదని, అసలు ఇస్తారా లేదా? అనేది కూడా చెప్పడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. సర్వేకు అయితే పరుగులు పెట్టిస్తున్న అధికారులు కనీసం ఉద్యోగుల తరపున పారితోషికాలు ఇప్పించాలనే ఆలోచన మాత్రం చేయడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లాలో వివరాలు

| | |
|---|---|
| మున్సిపాలిటీల వార్డులు: | 146 |
| పంచాయతీ వార్డులు : | 313 |
| ఎన్యుమరేటర్లు : | 2,864 |
| సూపర్‌వైజర్లు : | 287 |
| ప్రత్యేక అధికారులు : | 20 |

**త్వరలోనే ఖాతాల్లో జమ**

సర్వే చేసిన సిబ్బందికి పారితోషికం అందించేందుకు చర్యలు చేపట్టాం. త్వరలోనే వారి ఖాతాల్లో జమ అవుతాయి. ఎంపీడీవోలు, కమిషనర్లకు నిధులు విడుదల చేశాం. నెలవారీ జీతాల చెల్లింపు తరహాలోనే ఈ మొత్తం ఖాతాల్లో చేరుతోంది. ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్

# అధ్యయనం చేయాలి.. అడ్డుకట్ట వేయాలి



హైదరాబాద్ : రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు రాచకొండ పోలీసులు సరికొత్త ప్రణాళికతో ముందుకెళుతున్నారు. కమిషనరేట్ పరిధిలో ఎక్కడైనా పెద్ద రోడ్డు ప్రమాదం జరిగితే.. క్షతగాత్రులకు సత్వర వైద్యం అందించడంతోనే సరిపెట్టకుండా.. అలాంటి ప్రమాదాలు భవిష్యత్తులో జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఇందుకు ఏఏపీటీ(ప్రమాద విశ్లేషణ, నియంత్రణ విభాగం)ను ఏర్పాటుచేశారు. రాచకొండలో ఏటా మూడు వేలకుపైగా రోడ్డు ప్రమాదాలు, 700 దాకా మరణాలు నమోదవుతున్నాయి. ఏఏపీటీ చర్యలతో రోడ్డు ప్రమాదాలు తగ్గుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

**ఏఏపీటీ ఎలా పనిచేస్తుందంటే..?**

కమిషనరేట్ పరిధిలో ఏదైనా ప్రాంతంలో రోడ్డు ప్రమాదం జరిగి మరణాలు నమోదవ్వడం, ఎక్కువ మంది క్షతగాత్రులైనప్పుడు ఏఏపీటీ రంగంలోకి దిగుతుంది. దీనికి ఏసీపీ స్థాయి అధికారి నేతృత్వం వహిస్తారు. ఈ బృందం ఘటనా స్థలికి వెళ్లి పరిశీలిస్తుంది. ప్రమాదం జరగడానికి కారణం రోడ్డు ఇంజినీరింగ్ లోపమా.. ఆ ప్రాంతంలో అనూహ్య మలుపులు ఉన్నాయా.. స్తంభాలు అడ్డుగా ఉన్నాయా..? ఇలా అన్ని రకాలుగా విశ్లేషించి లోపం ఎక్కడుందో గుర్తిస్తుంది. తర్వాత సమస్యను పరిష్కరించే సంబంధిత శాఖకు నివేదిస్తుంది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో చేపట్టాల్సిన పనులను సూచిస్తుంది. 2024 డిసెంబరు తొలివారంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పోచంపల్లి మండలం జలాల్‌పూర్ చెరువులోకి కారు దూసుకెళ్లి ఐదుగురు యువకులు మృత్యువాతపడ్డారు. ఈ ప్రమాదం జరగడానికి కారణాలపై అధ్యయనం చేసిన రాచకొండ ఏఏపీటీ బృందం.. జలాల్‌పూర్ చెరువు కట్ట వెంట రెయిలింగ్ లేకపోవడం, పెద్ద మలుపును గుర్తించింది. దీన్ని సంబంధిత శాఖకు నివేదించగా రెయిలింగ్, ప్రమాద సూచికల ఏర్పాటుకోసం ప్రభుత్వం రూ. 30లక్షలు మంజూరుచేసినట్లు అధికారులు తెలిపారు.

**బ్లాక్‌స్పాట్లను తగ్గించే ప్రయత్నం**

కమిషనరేట్ పరిధిలో 246 కి.మీ.ల జాతీయ రహదారులు, 61 కి.మీ.ల మేర ఔటర్ రింగురోడ్డు, 783.5 కి.మీ.ల అంతర్గత రహదారులున్నాయి. ఏటా ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. దీనికి పరిష్కారాలు చూపేందుకు ఏఏపీటీ పనిచేస్తోంది. ప్రమాదాలు ఎక్కువగా జరిగే 103 బ్లాక్ స్పాట్లను గుర్తించింది. ఆ ప్రాంతాల్లో ప్రమాదాలు పూర్తిగా తగ్గించే దిశగా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

**12.4 శాతం తగ్గించగలిగాం**

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ఏఏపీటీని అందుబాటులో తీసుకొచ్చాం. ఎక్కడైనా తీవ్ర రోడ్డు ప్రమాదం జరిగితే ఈ బృందం అక్కడ లోపాలేంటో గుర్తించి పరిష్కారాలు సూచిస్తుంది. ఈ తరహా చర్యలతో తీవ్ర రోడ్డు ప్రమాదాలను 12.41 శాతం తీవ్ర రోడ్డు ప్రమాదాలను తగ్గించగలిగాం. ఔటర్‌పై 36.6 శాతం తగ్గాయి. సుధీర్‌బాబు, రాచకొండ పోలీస్ కమిషనర్

# సైబర్ ఉచ్చులో పల్లె బిడ్డలు!




హైదరాబాద్: చదువులు పూర్తయి ఉపాధి కోసం ఎదురుచూపులు చూస్తున్న యువత.. నిరాశ, నిస్పృహ మధ్య ఏ చిన్న అవకాశం వచ్చినా ఆకర్షితులవుతున్నారు. ఈ బలహీనతనతో సైబర్ ఉచ్చులో చిక్కుతున్నారు. తెలుగు రాష్ట్రాలను లక్ష్యం చేసుకొని సైబర్ ముఠాలు కొత్త ఎత్తులు వేస్తున్నాయి. ఒక వైపు మోసాలతో రూ.కోట్లు కొల్లగొడుతూనే మరోవైపు ఇక్కడి పేద, మధ్యతరగతి కుటుంబాల్లోని యువతను ఉద్యోగం, ఉపాధి పేరిట ఏజెంట్లుగా మలచుకుంటున్నాయి. ఇలా రెండురకాల మోసానికి గురై ఠాణాల చుట్టు తిరుగుతున్నారు. ఇటీవల పెట్టుబడులు మోసాల కేసుల్లో దర్యాప్తు చేపట్టిన పరిశీలిస్తున్న నగర సైబర్‌క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మధులత బృందం లింకులను గుర్తించారు. యువత జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్న కేటుగాళ్ల చేతుల నుంచి బయటపడేసేందుకు సైబర్‌క్రైమ్ పోలీసులు సిద్ధమయ్యారు. అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మూసారాంబాగ్‌కు చెందిన యువకుడు బీ ఫార్మసీ పూర్తిచేశాడు. ఉద్యోగ వేట కొనసాగిస్తూ.. ఆటో నడుపుతున్నాడు. ప్రతి నెలా రూ. 5వేలు కమీషన్ వస్తుందనే మిత్రుడి సలహాతో బ్యాంకు ఖాతా అతడికిచ్చాడు. దానిలో జరిగే లావాదేవీలను గుర్తించలేకపోయాడు. గుజరాత్‌కు చెందిన ముఠా ఆ ఖాతాను దుర్వినియోగం చేసినట్టు గుర్తించిన సైబర్ పోలీసులు అతడిని నిందితుల జాబితాలో చేర్చారు.

కోదాడ చుట్టుపక్కల కొన్ని గ్రామాల్లో యువతీ, యువకులు సైబర్ మోసగాళ్లకు ఏజెంట్లుగా మారినట్టు నిర్ధారించారు. యువత బ్యాంకు ఖాతాలను ఉపయోగించుకుంటున్నారు. వీరి ద్వారానే ఖాతాల్లోకి చేరిన సొమ్మును క్రిప్టోగా మార్చి తాము సూచించిన విదేశీ ఖాతాల్లో జమ చేయించుకుంటున్నారు.

**ఇప్పుడేం జరుగుతుందంటే**

దుబాయ్, థాయ్‌లాండ్, సింగపూర్, కంబోడియా, చైనా తదితర దేశాల్లో సూత్రదారులు గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, తెలంగాణల్లో దళారులను నియమించుకుంటున్నారు. వీరికి పెద్దఎత్తున కమీషన్‌లు ఇస్తూ మోసాల చక్రం తిప్పుతున్నారు. సైబర్‌క్రైమ్ పోలీసులు లింకులను ఛేదించే క్రమంలో హైదరాబాద్, నిజామాబాద్, కోదాడ ప్రాంతాలకు చెందిన గ్రామీణ యువతను మాయగాళ్లు లక్ష్యం చేసుకొని వారి ఖాతాల నుంచి రూ.కోట్లు లావాదేవీలు నిర్వహిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. అగ్రికల్చర్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన యువకుడు, మరో విద్యార్థికి ఈ కేసులో నోటీసులు జారీచేశారు.

**బ్యాంకుల తీరుపై ఆర్బీఐకి ఫిర్యాదు**

అడ్డదారిలో ఆదాయానికి ఆశపడితే అపాయంలోకి నెట్టేస్తుందని యువత గుర్తించాలి. ఏ సంస్థ డబ్బు తీసుకొని ఉద్యోగాలివ్వదు. కమీషన్, రాబడి వస్తుందనే భరోసాతో మోసగాళ్లకు సహకరించటం కూడా నేరమే. షెల్‌కంపెనీలకు కరెంట్‌ఎకౌంట్ ఖాతాలను సులువుగా ప్రారంభిస్తున్న బ్యాంకుల తీరుపై రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేశాం. లక్ష్యాన్ని పూర్తిచేసేందుకు కొన్ని బ్యాంకులు కేవైసీ మాత్రమే తీసుకుంటున్నాయి.

దార కవిత, డీసీపీ నగర సైబర్‌క్రైమ్

# శుద్ధీకరణకు నీటి కొరత



కోరుట్ల: ఇంటింటికీ శుద్ధజలం అందించేందుకు ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ఇబ్రహీంపట్నం మండలం డబ్బా వద్ద నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల, ధర్మపురి, రాయికల్ పురపాలికలతోపాటు 15 మండలాల్లోని 346 గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. కొంతకాలంగా ఎస్సారెస్పీ వద్ద పంపింగ్ మోటార్లు చెడిపోవడంతో నీటి సరఫరా సక్రమంగా కావడం లేదు. ముఖ్యంగా పట్టణ ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ జలాశయం నుంచి బాల్కొండ మండలం జలాల్‌పూర్ వద్ద నిర్మించిన ఇన్‌టెక్‌వెల్‌లోకి జలాలు చేరుతుండగా.. అక్కడ నుంచి ఆరు మోటార్ల ద్వారా 35 కి.మీ మేర నిర్మించిన పైపులైన్ ద్వారా డబ్బా నీటి శుద్ధి కేంద్రానికి తరలిస్తారు. జిల్లాలో 1.70 లక్షల మంది జనాభాకు నీటిని అందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. అందుకోసం సంపులు, ట్యాంకులను నిర్మించి పట్టణాలు, గ్రామాల్లోని అంతర్గత పైపులైన్ల ద్వారా ఇంటింటికీ కుళాయిల ద్వారా భగీరథ నీరు అందించాల్సి ఉంటుంది. జలాల్‌పూర్ వద్ద నిత్యం నాలుగు మోటార్లు నడిపించడం ద్వారా గ్రిడ్‌కు సంవత్సరానికి అవసరమైన 1.25 టీఎంసీల నీరు అందుతుంది. రెండు మోటార్లు చెడిపోయి చాలా రోజులు కావస్తుండగా కేవలం రెండు మోటార్లు మాత్రమే నడుస్తున్నాయి. రెండు మోటార్లను మరమ్మతు కోసం పంపించారు. దీంతో సగం మాత్రమే నీరు పంపింగ్ అవుతుంది. నిత్యం 9 కోట్ల లీటర్ల నీటిని శుద్ధి చేయాల్సి ఉండగా కేవలం సగం వరకు మాత్రమే శుద్ధి చేస్తున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా విషయమై ఈఈ శేఖర్‌రెడ్డిని సంప్రదించగా ఎస్సారెస్పీ వద్ద నాలుగు మోటార్లకు కేవలం రెండు మోటార్లు మాత్రమే పనిచేస్తున్నాయని వాటి ద్వారా వచ్చే నీటిని గ్రిడ్‌లో శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నామన్నారు. రెండు మోటార్లను మరమ్మతు కోసం పంపించామన్నారు. ఒక మోటారు రెండు రోజుల్లోగా రాగా, మరో మోటారు వారం రోజుల్లోగా వస్తుందని పేర్కొన్నారు. అప్పుడు పూర్తిస్థాయిలో నీటి పంపింగ్ చేపట్టి భగీరథ నీరు అందేలా చూస్తామని వివరించారు.

**వేసవికి ముందే..**

ఎస్సారెస్పీ నుంచి రెండు మోటార్ల ద్వారా మాత్రమే నీటి పంపింగ్ జరుగుతోంది. గ్రిడ్ నుంచి నీటి సరఫరా సామర్థ్యం తగ్గడంతో సరిపడా నీరు సరఫరా కావడం లేదు. ధర్మపురి పట్టణానికి డబ్బా నుంచి 3 నెలలుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. స్థానికంగా ఉన్న బోలి చెరువు ద్వారా నీటిని అందిస్తున్నారు. కోరుట్ల పట్టణం కేవలం మిషన్ భగీరథ మీదనే ఆధారపడి ఉంది. ఫుల్‌వాగు నుంచి పాతపైపులైన్‌ను తొలగించడంతో స్థానికంగా నీటి వనరులు లేకపోవడంతో కేవలం భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. రెండు, మూడు రోజులకోకసారి, ఒక్కోసారి అంతకంటే ఎక్కువ రోజుల నీటి సరఫరా కావడం లేదు. జగిత్యాల పట్టణంలో నెల రోజులుగా భగీరథ నీరు రావడం లేదు. స్థానికంగా ఉన్న ధర్మసముద్రం నుంచి నీటిని రెండు, మూడు రోజులకోకసారి అందిస్తున్నారు. రాయికల్ పట్టణంలోనూ మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో స్థానికంగా ఉన్న బావుల నుంచి నీటిని అందజేస్తున్నారు. మెట్‌పల్లి పట్టణంలో మిషన్ భగీరథ నీటిని అందజేయగా సరఫరా నిలిచిపోతే స్థానికంగా బోరుబావుల నీటిని అందిస్తున్నారు.

# నివేదిక సరే.. అవకతవకలపై చర్యలేవి?

వేములవాడ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాల నుంచి మూడో దఫా కోడెల పంపిణీలో జరిగిన అవకతవకలకు బాధ్యులపై చర్యలు లేనట్లు కనిపిస్తున్నాయి. మొదటిల్లో హడావుడి చేసిన జిల్లా యంత్రాంగం ప్రస్తుతం పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజన్న గోశాల నుంచి రైతుల పేరిట 66 కోడెలను వరంగల్ జిల్లా గీసుకొండకు చెందిన రాంబాబు తరలించిన అంశం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇందులో కోడెలు పక్కదారి పట్టించిన రాంబాబుతో పాటు మరో ఇద్దరు వ్యక్తులను అక్కడి పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే. కాగా వేములవాడలోని తిప్పాపూర్ రాజన్న గోశాల నుంచి మూడో దఫా 188 కోడెలు, ఆవులను ఆలయ అధికారులు కలెక్టర్‌కు చెప్పకుండా పంపిణీ చేశారు. మరోవైపు ఇందులో అవకతవకలు చోటు చేసుకున్నాయి. మూడో దఫా పంపిణీపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. గత నెల 17న గోశాల పటిష్ఠ నిర్వహణకు తీసుకోవాల్సిన అంశాలపై నిర్వహించిన సమీక్షాసమావేశంలో ఆలయ అధికారులకు ఈ విషయం స్పష్టం చేశారు. ఇందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని



కలెక్టర్ పేర్కొన్నప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఆలస్యంపై అనుమానాలు..**

రాజన్న గోశాలలో కోడెల పంపిణీ పారదర్శకంగా చేసేందుకు విధి విధానాలను రూపొందించారు. కలెక్టర్ ఛైర్మన్‌గా, పశువైద్యాధికారి, జిల్లా వ్యవసాయాధికారి, ఆలయ ఈవో, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులతో కలిసి కమిటీ వేశారు. ఈ కమిటీకి చెప్పకుండానే మూడో దఫా 188 కోడెలను పంపిణీ చేశారు. దీంతో ఆలయ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి దఫా 1,278 కోడెలు, 75 ఆవులను, రెండో దఫా 389 కోడెలు, 45 ఆవులను కలెక్టర్ అనుమతితో పంపిణీ చేసినప్పటికీ మూడోసారి ఇష్టానుసారంగా చేశారు. ఇందులో అవకతవకలు చోటుచేసుకోవడం పెద్ద ఎత్తున దుమారం రేగింది. ఇందులో గోశాల పర్యవేక్షకులు, సిబ్బంది ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీనిపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా ఆందోళనలు చేశారు. అవకతవకలపై ఆలయ అధికారులు నివేదిక సమర్పించినప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు.

# గ్రామీణ రైల్వే స్టేషన్లపై శీతకన్ను

పెద్దపల్లి: రహదారులు కూడా సరిగా లేని మారుమూల గ్రామాలకు రైలు ప్రయాణాలే ఆయువుపట్టుగా మారాయి. ఆటోలు, బస్సులు లేని రోజుల్లో రైలు కూతతో పరుగుపెట్టి గమ్యస్థానాలకు చేరుకునేవారెందరో జిల్లాలో ఉన్నారు. 95 ఏళ్ల క్రితం నిర్మితమైన గ్రాండ్ ట్రంక్ రైలు మార్గంలో అనేక గ్రామాలకు రవాణా సౌకర్యం ఏర్పడి, ప్రజలకు రైలుతో విడదీయరాని అనుబంధం ఏర్పడింది కానీ.. కొన్ని నెలలుగా ఆదాయం రావడం లేదనే కారణంగా పలు స్టేషన్లలో రైళ్ల హాల్టింగ్ ఎత్తివేస్తుండటంతో అలంకార ప్రాయమవుతున్నాయి. రైలు టికెట్లను కాంట్రాక్టు పద్ధతిలో విక్రయించే గ్రామీణ స్టేషన్లలో క్రమంగా హాల్టింగ్‌లు ఎత్తివేస్తున్నారు.

**క్రమంగా హాల్టింగుల ఎత్తివేత**

రైల్వేశాఖ ఆదాయం తక్కువగా ఉండే స్టేషన్ల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తారు. బిజిగిరిషరీఫ్, పొత్కపల్లి, కొలనూరు, రాఘవపూర్, పెద్దంపేట స్టేషన్లలో టికెట్ బుకింగ్ వ్యవహారాలను గుత్తేదారు, ఇతర పనులను రైల్వే చూసుకుంటోంది. ఓదెల, కొత్తపల్లి రైల్వేస్టేషన్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్‌తో పాటు స్టేషన్ పరిశుభ్రత నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టర్ నిర్వహించాల్సి ఉంటుంది. స్టేషన్‌కు వచ్చే ఆదాయంను బట్టి స్థాయిని నిర్ణయించి, నిర్వాహణ బాధ్యతలను విభజిస్తుంది కానీ.. ఆయా స్టేషన్లకు ఆదాయం పెంచేందుకు మాత్రం దృష్టిపెట్టిన దఖలాలు లేవు. ఉన్నంతలో ఓదెల రైల్వేస్టేషన్ ఒక్కటే రాబడి అధికంగా ఉండడంతో ఎక్కువ సంఖ్యలో రైళ్లకు హాల్టింగ్ కల్పించారు. మిగతా స్టేషన్లలో ఉన్న రైళ్ల హాల్టింగ్‌లే రద్దు చేశారు. కరోనా అనంతరం పలు ప్యాసింజర్ రైళ్లను కూడా ఎక్స్‌ప్రెస్ స్థాయికి మార్చి, గ్రామీణ స్టేషన్లలో హాల్టింగ్‌లు ఎత్తివేశారు. ఎక్స్‌ప్రెస్ స్థాయి నుంచి ప్యాసింజర్ స్థాయికి మారిన భాగ్యనగర్ రైలు రాఘవపూర్, పెద్దంపేటలతో ఆగుతుంది. ఈరైలు సికింద్రాబాద్ వైపు తెల్లవారు జామున, కాగజ్‌నగర్ వైపు రాత్రి సమయంలో వెలుతుండటంతో గ్రామీణ ప్రజలకు పెద్ద ప్రయోజనం కలగడం లేదు. కొత్తపల్లి రైల్వేస్టేషన్‌లో ఆగడం లేదు. రైల్వే యాప్‌లో హాల్టింగ్ ఉన్నట్లు చూపుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం రైలు ఆగకపోవడంతో రైళ్ల హాల్టింగ్‌లేని స్టేషన్‌గా కొత్తపల్లి మిగిలిపోయింది.

# పట్టుజారితే ఆసుపత్రికే!

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో వాహనాల రద్దీని తగ్గించేందుకు వ్యవసాయ పొలాల గుండా బైపాస్ రహదారి నిర్మించారు. రాచర్ల గొల్లపల్లి బస్టాండుకు వెళ్లకుండానే గ్రామ చివరలోని బీసీ వసతి గృహం వరకు, అటు నుంచి రాజన్నపేట, కిష్టునాయక్‌తండా, అల్మాస్‌పూర్ గ్రామాల మీదుగా వీర్నపల్లి మండలంలోకి చేరుకోవచ్చు. ప్రతి శనివారం వారసంత, ఇతర రోజుల్లోనూ వాహనాలు ఎక్కువగా ఈ రోడ్డు గుండానే వెళ్తుంటాయి. వ్యవసాయ



పొలాలకు సమాన ఎత్తులో ఉండటం వల్ల సాగునీరు బైపాస్ రోడ్డు మీదుగా ప్రవహిస్తోంది. వాహనాల ధాటికి భారీ గుంతలు ఏర్పడి బురదమయంగా మారింది. వాహనదారులు పట్టు జారితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ సాగు నీటిని ఎక్కువగా పొలాల్లోకి మళ్లించడం వల్ల నీరు రోడ్డుపైకి చేరుతోందన్నారు. ఇటీవల రోడ్డుపై మట్టిని పోయించి, గుంతలను పూడ్చివేయించామని, పంట పొలాల కాల్వను సరిచేశామన్నారు. ఇతర చర్యలు కూడా చేపట్టి, ఇబ్బందులు తీర్చుతామని ఆయన పేర్కొన్నారు.

## కట్ట.. ఆక్రమణల పుట్ట..

ఏర్పేడు : చెరువులే కాదు వాటి కట్టల రూపురేఖలూ మార్చేసి ఆక్రమించేస్తున్నారు. ఏర్పేడు మండలం వికృతమాల చెరువును ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాకు ఏళ్లుగా ప్రయత్నాలు సాగుతున్నాయి. తాజాగా చెరువును ఆనుకుని ఉన్న స్థలంతో పాటు కట్టను తవ్వేసి ఆక్రమించేందుకు యత్నిస్తున్నారు.

**మీనమేషాలు లెక్కిస్తున్నారు**

రేణిగుంట, ఏర్పేడు రెవెన్యూ అధికారులు ఇది తమ పరిధి కాదంటూ ఆక్రమణలపై చర్యలకు మీనమేషాలు లెక్కించడం విమర్శలకు తావిస్తోంది. ఇక్కడి స్థలం కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు.



**ఆక్రమిత స్థలం.. రూ.కోట్లలోనే..**

ఆక్రమిత స్థలం ఓ వైపు ఏర్పేడు మండలం వికృతమాలకు చెందినదైతే.. మరోవైపు రేణిగుంట మండలం జీపాళెంకు కిందకు వస్తుంది. ఇక్కడున్న ఆరెకరాల ప్రభుత్వ స్థలానికి సమీపంలో టిడ్కో ఇళ్ల సముదాయం ఉండటం, బీసీ కాలనీ దగ్గర కావడంతో ఎలాగైనా భూమిని సొంతం చేసుకోవాలని చూస్తున్నారు. కబ్జాదారులు రాత్రి వేళల్లో మాత్రమే పనులు చేపడుతున్నారు. చెరువు స్థలంతో పాటు కట్ట రూపురేఖలు మార్చేయడంతో పనులు నిలిపివేయాలని స్థానికులు అభ్యంతరం తెలిపారు. **పరిశీలించి.. చర్యలు తీసుకుంటాం..- భార్గవి, తహసీల్దార్, ఏర్పేడు మండలం** ఆక్రమిత స్థలం ఏ మండలం కిందకు వస్తున్నది పరిశీలించాలి. ఏర్పేడు మండల పరిధిలోది అయితే ఆక్రమణలకు వీల్లేకుండా చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం.

## పట్టాల సృష్టి.. సర్కారు దృష్టి

విశాఖ : జగనన్న కాలనీల్లో వైకాపా నాయకుల అక్రమాలు తవ్వేకొద్దీ బయట పడుతున్నాయి. 2020 డిసెంబరులో ఇంటి పట్టాలు పంపిణీ చేపట్టారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికే పట్టాలు ఇవ్వాలని చెప్పినా వీరిలో పలువురు వైకాపా నాయకులు, వారి అనుచరులే ఉన్నారు. కొందరు తమ స్థలాలను అమ్ముకాలు చేశారు. దీనిపై నిరుపేదలు ఆందోళనలు చేశారు. పేదల ముసుగులో కొందరు నాయకులు పట్టాలు పొంది కాలనీల్లో భవంతులు నిర్మించారు. కొన్ని చోట్ల నిరుపేదల నుంచి కారుచౌకగా పట్టాలు కొనుగోలు చేసి వాటిని అధిక ధరలకు అమ్మేశారు. ఈ అక్రమాలు నిగ్గుతేల్చాలని కూటమి సర్కార్ నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బందిని పంపించి అనర్హుల జాబితా సిద్ధం చేసి ఏరివేతకు రంగం సిద్ధం చేసింది.

జిల్లాలో 704 జగన్న కాలనీల్లో 56వేల మందికి పట్టాలు పంపిణీ చేశారు. 33,155 మందికిపైగా లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. అయితే 20వేలకు పైగా నకిలీ పట్టాలు పుట్టుకొచ్చాయి.



ఒక్కో పట్టాను రూ.20 వేల నుంచి రూ.30 వేలకు అమ్మడం విశేషం. కట్టిన ఇళ్లను రూ.15 లక్షలకు విక్రయించారు. అనకాపల్లి, మునగపాక, పాయకరావుపేట, ఎలమంచిలి, నర్సీపట్నం తదితర మండలాల్లోని లేఅవుట్‌లలో ఎక్కువగా అమ్మకాలు జరిగాయి.

**15లోగా పునః పరిశీలించాలి:** కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీల్లో మంజూరు చేసిన ఇంటి పట్టాలను పునః పరిశీలించాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో కాలనీల్లో లబ్ధిదారులు ముసుగులో ఉన్న అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. పరిశీలనకు తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్లతో బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 10 నుంచి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి కాలనీల్లో లబ్ధిదారుల వివరాలు సేకరించాలి. ప్రత్యేక మొబైల్ యాప్‌లో ఎప్పటిప్పుడు వివరాలను నమోదు చేయాలి. ఈ నెల 15లోగా వివరాలు ఇవ్వాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## ఫలించే.. సాగరమ'ధనం'

విశాఖ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం గడువు దగ్గరపడుతున్న నేపథ్యంలో జిల్లాలో మత్స్యశాఖ నిర్దేశించిన లక్ష్యం సాధించే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. మొత్తం దిగుబడుల్లో సముద్ర ఉత్పత్తులే అధికంగా ఉంటున్నాయి. జిల్లాలో 1,02,246 మెట్రిక్ టన్నుల మత్స్య ఉత్పత్తుల లక్ష్యం కాగా, జనవరి నెలాఖరు నాటికి 1,04,569 టన్నుల దిగుబడులు వచ్చాయి. విశాఖలో లభ్యమవుతున్న సముద్ర ఉత్పత్తుల్లో అధిక శాతం రొయ్యలు, ట్యూనా రకం చేపలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. కొన్ని రకాల రొయ్యలతో పాటు వివిధ రకాల చేపలు దేశంలోని ముంబయి, హైదరాబాద్, కోల్‌కతా, దిల్లీ తదితర నగరాలకు తరలివెళ్తున్నాయి. ఈ ఆర్థిక ఏడాది ప్రారంభంలో వాతావరణం అనుకూలించక పలుమార్లు వేటకు అంతరాయం ఏర్పడి నా... రెండు నెలల నుంచి అంతా సవ్యంగా ఉండడంతో భారీ దిగుబడులు సాధ్యమవుతున్నాయని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ 15 వరకు: ఇప్పటి వరకు లభ్యమైన మత్స్యసంపద విలువ రూ.వెయ్యి కోట్లకుపైగా ఉంటుందని అంచనా. ఏటా జూన్ 15న సముద్ర జలాల్లో చేపల వేట ప్రారంభమై ఏప్రిల్ 15న ముగుస్తుంది. ఏప్రిల్ 16 నుంచి జూన్ 14 వరకు చేపల వేట పూర్తిగా నిలిపేస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆశాజనకంగా ఉండడంతో రానున్న రెండు నెలల్లో మరిన్ని దిగుబడులు వచ్చే అవకాశం ఉందని ఆయా వర్గాలు భావిస్తున్నాయి. **వేటకు ప్రోత్సాహం..:** మత్స్యకారులకు కూటమి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ, చేపల వేటను ప్రోత్సహిస్తున్నాం. వేటకు వెళ్లే బోట్లకు ఉచితంగా ట్రాన్స్‌పాండర్లను అందిస్తున్నాం. ఆ పరికరం విలువ రూ.38 వేలు ఉంటుంది. ఇప్పటి వరకు 586 బోట్లకు అందించాం. వాటి సాయంతో వెళ్లిన బోటు ఆచూకీ తెలుసుకునే వీలుంటుంది.

# ఆరోగ్యం 'ఉక్కు'రి బిక్కిరి..




విశాఖ : విశాఖ ఉక్కు కర్మాగారంలో పనిచేస్తున్న వేలమంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య అవసరాలు తీర్చడంలో ఒకప్పుడు తన ప్రత్యేకత చాటుకున్న స్టీల్ జనరల్ ఆసుపత్రి నేడు ఆ స్థాయిలో సేవలు అందించలేక పోతోంది. చాలామంది వైద్యులు, సిబ్బంది పదవీ విరమణ చేస్తున్నా తిరిగి భర్తీ జరగడం లేదు. కీలకమైన బర్న్ యూనిట్ మూతపడింది.

ఉక్కు యాజమాన్యం కార్మికుల వైద్య సేవలను దృష్టిలో పెట్టుకొని స్టీల్ జనరల్ ఆసుపత్రిని 1984లో 60 ఎకరాల్లో ప్రారంభించారు. 1991 నాటికి 160 పడకలకు విస్తరించారు. ఈ ఆసుపత్రిలో కేవలం ఉక్కు కార్మికులు వారి కుటుంబ సభ్యులకే కాకుండా సీఐఎస్ఎఫ్, ఉక్కునగరం పాఠశాలల సిబ్బందికి కూడా వైద్య సేవలు పొందేందుకు అవకాశం ఉంది. సుమారు 18 వేల మంది దీని పరిధిలోకి వచ్చేలా ఆసుపత్రి తీర్చిదిద్దారు.

**మందుల కొరత:** ఆసుపత్రిలో మందుల కొరత కూడా వేధిస్తోంది. 'నాట్ అవైలబుల్ అంటూ' చీటి మీద రాసి బయట కొనుక్కోమని చెప్తున్నారు. దీంతో బయట కొనుగోలు చేసిన ఉద్యోగులు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఓ ప్రముఖ మందుల దుకాణం ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసి ఆ దుకాణదారునకు నేరుగా యాజమాన్యం బిల్లులు చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఆసుపత్రి నిర్వహణ, జీతాలు, మందులు, నిర్వహణ, అంబులెన్స్‌ల కోసం గతంలో సుమారు రూ. 75 కోట్లు వ్యయం చేసేవారు. ప్రస్తుతం దానిని రూ. 35 కోట్లకు కుదించినట్లు సమాచారం. అది వైద్య సేవలపై ప్రభావం చూపుతోంది.

**ప్రమాదాలు జరిగితే...**

ఉక్కు ఆసుపత్రిలో ప్రధానంగా ఉండాల్సింది బర్న్ యూనిట్ అయినా.. అది మూతపడింది. కార్మికులు 1700 డిగ్రీలకు పైగా వేడి వద్ద పనిచేస్తుంటారు. తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. గతంలో ఆసియాలోనే మొదటిస్థానంలో నిలిచిన బర్న్ యూనిట్ ప్లాస్టిక్ సర్జన్లు లేని కారణంగా మూతపడింది. దీంతో ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను ప్రైవేటు ఆసుపత్రులకు పంపించేస్తున్నారు.

**వైద్యుల కొరత..**

1 వైద్యులు, పారామెడికల్ సిబ్బందిలో సుమారు 50 శాతం ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానాలు భర్తీ కావడం లేదు.

2 వైద్యులు 105 మంది ఉండేవారు. ప్రస్తుతం 53 మంది మెడికల్ ఆఫీసర్లు, 1 స్పెషలిస్టు, ఇద్దరు సర్జన్లు మాత్రమే ఉన్నారు. వారిలో ఒకరు ఈ మే నెలలో ఉద్యోగ విరమణ చేయనున్నారు.

3 నేత్ర వైద్యులు లేరు. నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది మొత్తం 380 ఉండేవారు. ప్రస్తుతం 220 మంది మాత్రమే పని చేస్తున్నారు.

4 గుండె సంబంధ సమస్యలు గుర్తించేందుకు ఉపయోగించే టీఎంటీ (ట్రెడ్ మిల్) పరికరం పనిచేయడం లేదు. 3 ఎక్స్‌రే యంత్రాలకు గాను కేవలం ఒక్కటి మాత్రమే పనిచేస్తుంది. 5 వైద్యుల కొరతను అధిగమించేందుకు ఇటీవల కేవలం 10 మంది వైద్యులను తాత్కాలిక విధానంలో చేర్చుకునేందుకు ప్రకటన జారీ చేశారు.

# మన్ను దోపిడీ మొదలై'నది'



నందికొట్కూరు : శ్రీశైలం జలాశయంలో వే'గంగా'నీటి మట్టం తగ్గుతోంది.. వెనుక జలాలు తగ్గడంతో ముంపు భూములు తేలుతున్నాయి.. వాటిలో విలువైన మట్టి ఉండటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. భారీ యంత్రాలతో నదీ గర్భాన్ని తోడేస్తున్నారు.. నందికొట్కూరు మండలంలోని శాతనకోట, జంగంపాడు, మల్యాల, పగిడ్యాల మండలంలోని ముచ్చుమర్రి, నెహ్రూనగర్, జూపాడుబంగ్లా మండలంలోని చాబోలు, కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం, బలపాలతిప్ప, జానాలగూడెం గ్రామాలు కృష్ణానది పరివాహక ప్రాంతంలో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో మట్టి తవ్వకాలతో పాటుగా అక్రమ ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.

**ఇసుకపైనా కన్నేశారు**

నందికొట్కూరు మండలం జంగంపాడు, శాతనకోట, మల్యాల, బిజినవేముల గ్రామాల సమీపాన కృష్ణానదిలో ఇసుక నిల్వలు ఉన్నాయి. ప్రస్తుతం నదిలో జలాలు తగ్గుముఖం పట్టడంతో అక్రమార్కులు వెళ్లి తవ్వకాలకు అనువైన స్థలాలను గుర్తించి హద్దులు పాతారు. తెదేపా పాలనలో శాతనకోట సమీపంలో ఇసు రీచ్ నిర్వహించే వారు. గత వైకాపా పాలనలో అక్రమార్కులు నదిలోకి చొరబడి ఇష్టానుసారం తవ్వి పెద్దఎత్తున ఇసుక నిల్వ చేసుకుని బహిరంగ విక్రయాలు సాగించారు. 'కూటమి' ప్రభుత్వం దృష్టి సారించాలని స్థానికులు విన్నవిస్తున్నారు.

**దారిమళ్లిస్తున్నారు** పాములపాడులో కొనసాగుతున్న జాతీయ రహదారి 340సీ నిర్మాణానికి చెలిమిల్ల- మాడుగుల గ్రామాల మధ్య ఉన్న ఓ రైతు పొలంలో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్నట్లు స్థానికులు పేర్కొన్నారు. నెల రోజులుగా సుమారు 6 ఎకరాల్లో మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. సంబంధిత రైతును అడిగితే తాను పొలాన్ని విక్రయించానని, తవ్వకాలతో తనకు సంబంధం లేదని చెబుతున్నారు. మట్టిని తవ్వి తరలించాలంటే రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలి. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తమకు తెలియదని చెప్పడం గమనార్హం.

**మేటలు మేస్తున్నారు**

నదిలో మేటలు వేసిన సారవంతమైన నల్లరేగడి మట్టికి ఎక్కువ డిమాండ్ ఉంది. దూరాన్ని బట్టి ట్రిప్పు మట్టి రూ.1500 నుంచి విక్రయిస్తున్నారు. దీనిని పొలాల్లో వేసుకుని పంటలకు ఎరువులు వేయాల్సిన అవసరం ఉండకపోవడంతో చాలామంది రైతులు దీని కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. ఇదే అదనుగా అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు సాగిస్తున్నారు. ఇంటి నిర్మాణం కోసమని చెప్పి పక్కదారి పట్టిస్తున్నారు. కొత్తపల్లి మండలం చిన్నగుమ్మడాపురం సమీపంలో మట్టి తవ్వి తరలిస్తున్నారు.

# రూ.150 కోట్ల మాన్యం అక్రమార్కులకు నైవేద్యం

నంద్యాల : అక్రమార్కుల అత్యాశకు ఆలయ మాన్యాలు కర్పూరంలా కరిగిపోతున్నాయి. బేతంచెర్లలో ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి, మాధవస్వామి, గట్ల నరసింహస్వామి సముదాయ ఆలయాలకు వందలాది ఎకరాల మాన్యం ఉంది. బేతంచెర్ల మున్సిపాల్టీతో పాటు ఆర్.ఎస్.రంగాపురంలోని భూములు 20 ఏళ్లుగా ఆక్రమణలకు గురవుతున్నాయి. ఇప్పటికే బేతంచెర్ల పట్టణంలో 168.29 ఎకరాలు, ఆర్.ఎస్.రంగాపురంలో 17.17 ఎకరాలు పరాధీనమైంది. రాజకీయ పార్టీల నాయకులతో పాటు వ్యాపారులు, గుత్తేదారులు, ఇతరులు ఇష్టానుసారం కబ్జా చేశారు. ఆక్రమణలకు గురైన భూమిలో కొంత ఇప్పటి వరకు మాన్యం భూములే అని చెబుతున్నా అధికారులు వాటిని స్వాధీనం చేసుకొనే ప్రయత్నాలు చేయకపోవడం గమనార్హం.


**దస్త్రాలనే మార్చేశారు**

సముదాయ ఆలయాలకు సంబంధించిన మాన్యంలో బత్రాజులకు 13.09, నర్తకిలకు 69.02, భజంత్రీలకు 78.83, గొర్రి మాన్యం 7.34 ఎకరాలు కేటాయించారు. వీరు ఆయా భూములను అనుభవించడానికి మాత్రమే అవకాశం కల్పించారు. అక్రమార్కులు రంగ ప్రవేశం చేసి మొత్తం 168.29 ఎకరాల భూమిని ఆక్రమించారు. కొంతమంది దస్త్రాలను మార్చి రెవెన్యూ దస్త్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. మరికొందరు ఆలయ దస్త్రాల్లో తమ పేరు లేకున్నాసరే దర్జాగా భూములు అనుభవిస్తున్నారు. కొందరైతే ఏకంగా మాన్యం భూములను ఆక్రమించి ఇతరులకు విక్రయించారు.

**పరాధీనమైన భూములివే**

సర్వే నంబరు 23-7-34లో ఉన్న భూమిని జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తీసుకున్నా ఇంత వరకు నష్ట పరిహారం అందలేదు.

సర్వే నంబరు 175లో ఉన్న 8 ఎకరాల భూమి ఆక్రమణకు గురైంది.



సర్వే నంబరు 235లోని 2.36 ఎకరాల బత్రాజుల మాన్యాన్ని ఇతరులు కబ్జా చేశారు. సర్వే నంబర్లు 293లో 6.10 ఎకరాలు, 306లో 0.97, 334లో 0.32, 338లో 4.06, 393లో 3.54, 543లో 13.60, 545లో 2.12, 640లో 15.35, 646లో 6.74, 6.98లో 4.10, 780లో 12.16, 872లో 8.07, 878లో 8.92, 903లో 9.93, 911లో 17.90, 1004లో 4.60, 22లో 11.83, 49లో 8.80, 612లో 14.35, సర్వే నంబరు 186లో 5.36 ఎకరాల భూమి ఆక్రమణలు గురైంది. ఆర్.ఎస్.రంగాపురంలో సర్వే నంబరు 810లోని 23.35 ఎకరాల ఆంజనేయస్వామి ఆలయ మాన్యం ఉంది. ఇందులో 19.35 ఎకరాలు అన్యాక్రాంతమైంది.

**అధికారులు చేతులెత్తేశారు**

అక్కడ బహిరంగ విపణిలో ఎకరం రూ.కోటిపైనే ధర పలుకుతోంది. సెంటు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు విక్రయిస్తున్నారు. ఆర్.రంగాపురంలో ఉన్న భూమి ఎకరం ధర రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు విలువ చేస్తుంది. మొత్తం మాన్యం విలువ రూ.150 కోట్లకు పైగానే ఉంటుంది. ఇంతటి విలువైన భూమిని ఆక్రమిస్తున్నా ఆలయ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# 5ఏళ్ల అలసత్వం.. రూ.100 కోట్ల భారం

కర్నూలు : పట్టణ ప్రజలు 30 ఏళ్ల వరకు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవద్దన్న ఉద్దేశంతో తెదేపా హయాంలో రూ.593 కోట్లతో ప్రాజెక్టుకు పునాది వేశారు. ఐదేళ్ల అధికారంలో ఉన్న వైపాకా ఆయా పథకాలను 'నీరు'గార్చింది. ఇప్పుడు వాటిని పూర్తి చేయాలంటే రూ.100 కోట్ల వరకు అదనంగా వెచ్చించాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లక్షలోపు జనాభా ఉన్న పట్టణాల్లో మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఉద్దేశంతో తెదేపా హయాంలో పనులకు శ్రీకారం చుట్టారు.

జలాశయాల నుంచి పైపులైన్లు వేసి, అధునాతన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్లను (ఇ.ఎల్.ఎస్.ఆర్.) నిర్మించి, పట్టణ వ్యాప్తంగా పైపులైను వ్యవస్థ ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ప్రాజెక్టు వ్యయంలో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబీ) 70 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులు సమకూర్చాలని ఒప్పందం చేసుకున్నారు. అప్పట్లోనే దాదాపు 25 శాతం పనులు పూర్తయ్యాయి. జగన్ ప్రభుత్వం వాటా సరిగా విడుదల చేయలేదు.



**ఎండుతున్న పుర గొంతులు**

చదువు.. ఉద్యోగం.. ఉపాధి ఇలా అవసరం ఏదైనా పల్లె జనం పట్టణ బాట పడుతోంది. ప్రస్తుతం అందుతున్న నీరు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. గూడూరులో ట్యాంకు, పైపులైన్లు, ఫిల్టర్ బెడ్ల పనులు చేపట్టకుండా మధ్యలోనే వదిలేశారు. 35 వేల జనాభాకు సరిపడా నీరు సక్రమంగా రాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

ఎమ్మిగనూరు పట్టణంలో ట్యాంకుల నిర్మాణం అసంపూర్తిగా వదిలేశారు. పట్టణంలో న్యూ ఎస్సీ, క్రాంతినగర్, హరిజనవాడ, ఉసేనప్ప కొట్టాల, గణేశ్ కాలనీ, శివన్ననగర్, సాయినగర్, మిలటరీ, నక్కరామయ్య కొట్టాల, హనుమాన్, ముగతిపేట, ఎన్టీఆర్ కాలనీ, యల్లమ్మ బీడు, ఓల్డ్ ఎస్సీ కాలనీ, శాంతినగర్, సోగనూరు రోడ్డు ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది.

ఆత్మకూరు పట్టణంలో ఖల్లావీధి, నీలితొట్ల వీధి, ఇస్లాంపేట, కొత్తపేట, వడ్లపేట, పెద్దబజారు, సంత మార్కెట్ ప్రాంతం, ఆర్డీటీ కాలనీ, స్వరాజ్‌నగర్, అర్బన్ కాలనీ, ఏరాసు అయ్యపురెడ్డినగర్, వెంగళరెడ్డినగర్‌లో నీటి కష్టాలు ఎక్కువయ్యాయి.

## ఇంటి పట్టా.. అనర్హుల పుట్ట

కర్నూలు : పేదలందరికీ ఇల్లు.. ఇళ్లు కాదూ ఊళ్లు నిర్మిస్తున్నామని ఐదేళ్లు జగన్నాటకం ఆడారు. పేదల పేరుతో వైకాపా కార్యకర్తలు, వాలంటీర్లు, వారి బంధువులు, సచివాలయ ఉద్యోగుల కుటుంబ సభ్యులకు 'పట్ట'ం కట్టారు. నగరంలో పాతబస్తీలో నివాసముంటున్న వారికి పాణ్యం నియోజకవర్గం కల్లూరు అర్బన్‌లోని కృష్ణానగర్ ప్రాంతంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేశారంటే ఎంపిక తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. స్థానికేతరులు కొందరు జిల్లా కేంద్రంలో ఉన్నట్లు తప్పుడు చిరునామాలతో పట్టాలు పొందారు. రాజకీయపలుకుబడి ఉన్నవారు పట్టాలు దక్కించుకోగా.. నిరుపేదలకు పథకం ప్రయోజనం చేకూరలేదు. కొన్నిచోట్ల ఇంటి నంబరు, భర్త పేరు, సమగ్ర వివరాలు లేకపోయినా.. ఇళ్లున్నా పట్టాలిచ్చేశారు. ఇలాంటి అక్రమ పట్టాల కథ తేల్చాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు

ఉప తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్వోలు, సర్వేయర్ల బృందం పట్టాలను పరిశీలించాలని భూపరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్లు, జేసీలు ప్రత్యేక డ్రైవ్‌ను పర్యవేక్షిస్తూ ర్యాండమ్‌గా తనిఖీలు చేయాలన్నారు.

ఇందుకు వీఆర్వోల లాగిన్‌తో ప్రత్యేక మొబైల్ యాప్ (హౌస్ సైట్



రీ-వెరిఫికేషన్) అందుబాటులోకి తెచ్చారు.

యాప్‌లో గ్రామం, లేఅవుట్, ఇళ్ల పట్టాలు పొందిన వారి పేర్లు ఉంటాయి. లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ ఐడీ, లబ్ధిదారు పేరు, రిలేషన్ నేమ్, ఆధార్ నంబరు, చరవాణి నంబరు, ప్లాట్ వివరాలు పరిశీలిస్తారు. స్థలం ఖాళీగా ఉందా ? ఇంటి నిర్మాణం జరిగిందా ? ఇళ్ల పట్టాలకు అర్హులేనా వంటి వివరాలన్నీ నమోదు చేస్తారు.

ఇలా లెక్క తేల్చుతారు

బీపీఎల్ కేటగిరీ కానివారు, ఇల్లు లేదా ఇంటి స్థలం ఉన్నవారు, ఇంతకు ముందు గృహనిర్మాణ పథకం వినియోగించుకున్న వారు, వ్యవసాయ భూమి 10 ఎకరాలు ఉన్నా, ఆదాయ పన్ను చెల్లించినా, నాలుగు చక్రాల వాహనాలు కలిగిన ఉన్నా అనర్హులుగా పరిగణిస్తారు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉన్నా, ఒకే కుటుంబంలో ఒకటి కంటే ఎక్కువ ప్లాట్లు కలిగి ఉన్నా, తమప్లాట్‌ను ఇతరులకు విక్రయించినా అనర్హులే అవుతారు ఓర్వకల్లులో పునాదులు, బేస్‌మెంట్ల వరకు ఇళ్ల నిర్మించిన 350 మంది ప్లాట్లను ఒక్కోటి రూ.4-5లక్షలకు విక్రయించేశారు. ఇంటి పట్టా స్థలంలో లబ్ధిదారులు స్థానికంగా లేకపోయినా, అవివాహితుల పేరిట ఉన్నా, మైనర్లకు ఇచ్చినా అనర్హులని అధికారులు చెబుతున్నారు.

# పన్ను వసూళ్లు సగమే..

అనంతపురం: ఆస్తి పన్ను వసూళ్లలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పురపాలికలు పూర్తిగా వెనకబడ్డాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 54 శాతం మాత్రమే పన్నులు వసూలయ్యాయి. మార్చి 31 నాటికి అనంతపురం నగర కార్పొరేషన్‌తో పాటు మిగిలిన 11 పురపాలికల్లో రూ.113.72 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా.. ఈనెల 10 నాటికి 62.40 కోట్లే వచ్చింది. అనంతపురం, హిందూపురంలో 50 శాతం మించకపోవడం గమనార్హం. లక్ష్యాన్ని సాధించడానికి 47 రోజులే మిగిలాయి.

**పాత బకాయిలు రూ.129 కోట్లు**



ఉమ్మడి జిల్లాలోని అన్ని పురపాలికలు పాత బకాయిల వసూళ్లలో ఆలసత్వం ప్రదర్శిస్తున్నారు. జరిమానాలతో కలుపుకొని రూ.141.96 కోట్ల బకాయిలు ఉండగా.. ఈ ఏడాది రూ.12.22 కోట్లు వసూలు చేశారు. కోర్టు కేసులు, రైట్‌ఆఫ్‌లు రూ.1.53 కోట్లు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.8.198 కోట్లకు గాను రూ.2.41 కోట్లు వసూలు చేశారు. బకాయిలు, జరిమానాలతో పాటు ఈ ఏడాది ఇంకా వసూలు చేయాల్సినవి కలిపితే పురపాలికల్లో రూ.178.56 కోట్ల మేర ఆస్తి పన్ను వసూలు కావాల్సి ఉంది. **ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నాం- విశ్వనాథ్, మున్సిపల్ ఆర్డీ**గతేడాది అక్టోబరు నుంచి ప్లానింగ్ సెక్రటరీ, మున్సిపల్ అడ్మిన్‌లతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఆస్తి పన్ను వసూలుపై దృష్టిపెట్టాం. వారానికి ఒకసారి సమీక్షలు నిర్వహించి ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం. క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

# కలపను కొల్లగొడుతున్నా పట్టదేం?

కుప్పం : కుప్పంలో కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పచ్చదనాన్ని కాపాడాల్సిన అటవీశాఖ అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. పగలు... రాత్రి తేడా లేకుండా లారీలు.. ట్రాక్టర్ల ద్వారా కలపను రవాణా చేస్తున్నా... అటవీ అధికారులు నోరుమెదపడం లేదని పెదఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**చట్టం ఏం చెబుతుందంటే..**

పట్టా భూమిలో చెట్టు నరకాలంటే సంబంధిత తహసీల్దారు ధ్రువపత్రాన్ని అటవీశాఖ అధికారులకు అందించాలి. అనంతరం మొక్కలు అంచనావేసి కోత అనుమతి కోసం జిల్లా అటవీ అధికారికి నివేదికలు పంపాలి. ఈ రికార్డుల పరిశీలించి అనుమతులివ్వాలి. అలా జిల్లా అధికారులు పర్మిట్ ఇస్తే ఒక్కో టన్ను కలపకు రూ.16,800, లేదా



అందుకు ఐదురెట్లు పెంచి చెల్లించాలని సూచిస్తారు. అది చెల్లిస్తే అనుమతిస్తారు.

**పుట్టగొడుల్లా కలప మండీలు...**

కలప అక్రమ రవాణాను ఆదాయ మార్గంగా ఎంచుకొన్న కొందరు అక్రమార్కులు ఆంధ్రా-తమిళనాడు సరిహద్దు రాష్ట్రం కెంపాపురం, రాజుపేట రోడ్డు, శాంతిపురం, వి.కోట పరిసరాల్లో కలప మండీలను ఏర్పాటు చేసుకొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా పచ్చని చెట్లను కొల్లగొట్టి ఒక్కో టన్నుకు రూ.5 వేల నుంచి రూ.6 వేలు వరకు కొనుగోలుచేస్తున్నారు. ఈ కలపను డీబార్గింగ్(పొట్టుఒలిచి) చేసి లారీల ద్వారా తమిళనాడులోని సేలం, ధర్మపురిలోని పేపరు మిల్లులకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారమంతా బహిరంగంగా జరుగుతున్నా... అటవీశాఖ అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపలున్నాయి.

**సీఎం వస్తేనే స్పందిస్తారా..?**

గత నెలలో సీఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన ఖరారైన వెంటనే ముందస్తుగా కలప అక్రమ రవాణా విషయమై తమపై ఎవరైనా నాయకులు ఫిర్యాదు చేస్తారేమోననే భయంతో కుప్పం అటవీశాఖ అధికారులు ఒక్కరోజు మెరుపు దాడిచేశారు. ఏకంగా తొమ్మిది కలప ట్రాక్టర్లు స్వాధీనం చేసుకొని జరిమానాలు కూడా విధించారు. ఇలా... నిత్యం ఎందుకు అటవీశాఖ అధికారులు దాడులు చేయలేకపోతున్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**ఊరూ... వాడా వెలసిన ఇటుకబట్టీలు**

కర్ణాటకలో అటవీ అధికారులు కలప నరికివేతపై ఉక్కుపాదం మోపుతారు. దీనివల్ల ఇటుకల తయారీదారులు ఇటుకలను బొగ్గు, వరిపొట్టు, చింతపొట్టుతో కాల్చుతారు. అదే... కుప్పంలో మాత్రం ఇటుకలను కాల్చేందుకు కలప వినియోగిస్తున్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం అంతరించిపోతోందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కిసుక్కుమనని కియోస్క్ యంత్రాలు



పుట్టపర్తి : రైతు సేవ కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల వ్యయంతో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన యంత్రాలు సేవలు అందించకుండా మూలకు చేరాయి. రైతులకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశంతో కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఈ యంత్రం పనిచేయాలంటే అంతర్జాల సౌకర్యం ఉండాలి. గత ప్రభుత్వం యంత్రాలిచ్చిందే తప్ప అంతర్జాల సౌకర్యం కల్పించలేదు. దీంతో సిబ్బందే సొంత నిధులతో ఈ సదుపాయం ఏర్పాటు చేసుకుని సేవలందించారు. తర్వాత చరవాణిలోనే అందుకు సంబంధించిన యాప్ ఉండటంతో యంత్రాలను పట్టించుకోలేదు. ఫలితంగా రైతు సేవా కేంద్రాల్లో నిరుపయోగంగా మారాయి. 50 శాతం మరమ్మతులకు గురికాగా, 30 శాతం గోదాముల్లో పడేశారు. 20 శాతం యంత్రాలు దిష్టిబొమ్మలా దర్శనం ఇస్తున్నాయి. ఎలాంటి ఆలోచన లేకుండా గత పాలకులు, ఉన్నతాధికారులు కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వృథా చేశారు.

**తొలి ఏడాది వినియోగించినా..**

శ్రీసత్యసాయి జిల్లాలో 2020 జూన్‌లో కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేశారు. తొలి ఏడాదిలో సిబ్బంది సొంత డబ్బులతో ఇంటర్నెట్ రీఛార్జి చేసి వినియోగించారు. వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందితో సంబంధం లేకుండా రైతులే స్వయంగా కేంద్రానికి వెళ్లి, వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, యంత్రాలు, పశుగ్రాసం వంటివి అవసరమైన పరిమాణంలో కియోస్క్‌ల ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఇందుకు అవసరమైన నగదు రైతు చెల్లిస్తే 48 గంటల్లో అందిస్తామని ప్రకటించారు. ఆచరణలో సక్రమంగా అమలు చేయకపోవడంతో యంత్రాలు మూలనపడాయి. వీటిలో 50 శాతానికిపైగా యంత్రాలకు అంతర్జాలం సౌకర్యంతో పాటు, బ్యాటరీలు పనిచేయకపోవడంతో నిరుపయోగంగా మారాయి. అధికారులు, సిబ్బంది వీటిని గాలికి వదిలేశారు.

తలుపుల మండల వ్యాప్తంగా 13 రైతు సేవా కేంద్రాలు ఉండగా 4 కేంద్రాల్లో మూలనపడేశారు. బీ కొత్తచెరువు మండలంలో 16 కేంద్రాలు ఉండగా మీర్జాపురం, పోతులకుంట కేంద్రాల్లో ఏడాదిగా పనిచేయడం లేదు. చాలాచోట్ల వాటిని వినియోగించడం లేదు.

**వినియోగంలోకి తెచ్చేలా చర్యలు- సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి**

రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది చరవాణిలోని యాప్ ద్వారా అవసరమైన సేవలందిస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఉన్న కియోస్క్‌లన్నిటినీ వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

జిల్లాలో మండలాలు: 32

రైతు సేవా కేంద్రాలు: 416

ఏర్పాటు చేసిన కియోస్క్‌లు: 389

ఒక్కో యంత్రం విలువ: రూ.80 వేలు

# కలెక్టరేట్‌లో కదలని దస్త్రాలు



కదిరి : జిల్లా సాధారణ పరిపాలన సైతం స్తంభించింది. సాఫీగా కదలాల్సిన దస్త్రాలు ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు, ఒత్తిడి ఉన్న దస్త్రాలు మాత్రమే ముందుకెళ్తున్నాయి. సాధారణ దస్త్రాల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లాలోని 124 ప్రభుత్వ శాఖల నుంచి వివిధ అంశాల ఆమోదానికి కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చే దస్త్రాలు పేరుకుపోతున్నాయి. ఎనిమిది నెలల్లో అన్ని శాఖల సంబంధించిన దస్త్రాలు, అర్జీలు సుమారు 10 వేలకుపైగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. కీలక అధికారుల నిర్లక్ష్య ధోరణితో ప్రధాన శాఖల్లో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతి కుంటుపడుతోంది.

**నెలలు తరబడి నిరీక్షణ**

ఆర్థిక సంబంధమైన దస్త్రాలు మినహా.. మిగతావి సకాలంలో పరిష్కరించాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు తెగేసి చెప్పారు. పంచాయతీరాజ్, జిల్లా పరిషత్తు, వైద్య-ఆరోగ్యం, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా, డీఆర్‌డీఏ, జలవనరులు, పౌర సరఫరాలు, సంక్షేమం, కార్పొరేషన్లు, సహకార.. తదితర శాఖలకు చెందిన దస్త్రాలు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. రైతుల పొలాలు సబ్ డివిజన్, తండ్రుల నుంచి కుమారులకు బదలాయించిన పేర్లు మార్పునకు పంపిన మ్యూటేషన్ దస్త్రాలు వందల్లో మూలనపడేశారు. నెలల తరబడి నిరీక్షిస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు.

**ఫలించని సమీక్షలు**

ఏ దస్త్రం ఎంత కాలం పెండింగ్‌లో ఉందన్న విషయం స్పష్టంగా తెలుస్తుంది. మాన్యువల్ ఫైళ్లల్లోనూ తేదీలు ఉంటాయి. అడపాదడపా సమీక్షలు జరిపి చేతులు దులుపుకొంటున్నారు. తర్వాత పరిష్కారంపై కనీస వాకాబు చేయడం లేదు. స్వయంగా కలెక్టరేట్లోనే ఈ దుస్థితి ఉంటే.. ఇతర శాఖల పరిస్థితి చెప్పనవసరమే లేదు.

మూడు మాసాలు.. ఆరు నెలలు.. ఏడాది... ఇలా ఎంత కాలం కాలక్షేపం చేస్తారు. దస్త్రాల పరిష్కారంపై ఎందుకు దృష్టి సారించడం లేదు. సాధారణ పాలన కుంటుపడుతుంది. మీ వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉంది. ఇక ఎవరిని సహించేది లేదు. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం దస్త్రాలు ఎప్పటికపుడు పరిష్కారం కావాల్సిందే. ఇందులో రెండో మాటే లేదు.

మంత్రులు, కార్యదర్శులతో నిర్వహించిన సమీక్షలో సీఎం చంద్రబాబు అనంత గ్రామీణం పరిధి కందుకూరు సమీపాన జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్ల కోసం అనేక మంది నిర్దేశిత డబ్బు చెల్లించారు. అక్కడి పరిస్థితులు సరిగా లేకపోవడం.. ప్లాట్లు నచ్చకపోవడంతో చెల్లించిన డబ్బు వెనక్కి ఇవ్వాలని అహుడా కార్యాలయానికి దరఖాస్తు పెట్టుకున్నారు. ఏడాదిగా కార్యాలయం చుట్టూ తిరిగినా డబ్బులు వెనక్కి ఇవ్వడం లేదు. ఇన్‌ఛార్జి వైస్ ఛైర్మన్‌గా ఉన్న జేసీ నుంచి ఆమోదం కావాలంటూ తిప్పుకొంటున్నారు.

మ్యుటేషన్ కోసం రైతులు, కుల ధ్రువీకరణలో అక్షర దోషాలు, ఇతరాత్ర లోపాలు సరిచేసుకోడానికి విద్యార్థులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఈ తరహా దస్త్రాలన్నీ కలెక్టరేట్లోనే ఆమోదం లభించాలి.

**ప్రత్యేక దృష్టి సారిస్తాం- డాక్టర్ వినోద్‌కుమార్, కలెక్టర్**

దస్త్రాల పరిష్కారంపై దృష్టి సారిస్తాం. ఏ శాఖ కార్యాలయంలో ఎన్ని పెండింగ్ ఉన్నాయో ఆరా తీస్తాం. అధికారులతో ప్రత్యేక సమీక్షలు జరిపి ఫైళ్లను త్వరగా పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడతాం.

# తెల్లబంగారం.. ఏమి ప్రయోజనం



పెద్దవడుగూరు : మండలంలో అత్యధికంగా పండించే పత్తి పంటకు కనీస మద్దతు కరవైంది. ఈవిషయంలో రైతులు ఏటా వంచనకు గురవుతున్నారు. ఇక్కడి రైతులకు ప్రధాన పంట పత్తికాగా అందులో వచ్చిన దిగుబడులను అమ్ముకునేందుకు మద్దతు ధరలు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మండల వ్యాప్తంగా ఈఏడాది సుమారు 30 వేల ఎకరాల్లో పత్తి పంటను రైతులు సాగుచేయగా వాటిని అమ్ముకునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు. ఇక్కడి నుంచి ఏటా దాదాపు 3.5 లక్షల క్వింటాళ్ల దిగుబడులు వస్తుండగా గత రెండేళ్లుగా ఈపంట దిగుబడులు తగ్గాయి. కనీసం దిగుబడులు తగ్గినప్పుడైనా ధరలు వస్తాయనే ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుత ధరలు చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పత్తి క్వింటా ధర రూ.5,800 వేలు నుంచి రూ.6,200 వేల మధ్య పలుకుతోంది. ఈధరలతో తమకు నష్టం వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడులు సైతం రావని, ఇలాంటి ధరలతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలని రైతులు అంటున్నారు.

**మార్కెట్ ఉన్నా వృథానే**

పండించిన పత్తి పంటను అమ్ముకునేందుకు గుత్తి ప్రాంతంలో మార్కెట్ సదుపాయం ప్రభుత్వం కల్పించినప్పటికీ వాటివల్ల ఎలాంటి ఉపయోగం లేదని ఇక్కడి రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.7,250 కల్పించింది. అందులో కూడా నాణ్యమైన పత్తికి ఆ ధరలను వెచ్చిస్తున్నారు. దీంతో తమకు గిట్టుబాటు ధరలు కావని ఇక్కడి రైతులు వాపోతున్నారు. ఈఏడాది ఎకరాకు ఆరు క్వింటాల దిగుమడి వచ్చింది. ఈలెక్కన 1.80 లక్షల క్వింటాల దిగుబడి వచ్చింది.

**అంతులేని వేదన**

పత్తిపంటలను ఎక్కువగా కొట్టాలపల్లి, పెద్దవడుగూరు, చిన్నవడుగూరు, దిమ్మగుడి, మేడిమాకులపల్లి, లక్షుంపల్లి, మిడుతూరు, కాశేపల్లి, విరుపాపురం, ఆవులాంపల్లి, చిట్టూరు, కండ్లగూడూరు, తెలికి, ముప్పాలగుత్తి, బుర్నాకుంట, మల్లేనిపల్లి తదితర గ్రామాల్లో సాగుచేశారు. ప్రస్తుతం ఉన్న ధరలను చూసి పంట దిగుబడులను అమ్ముకునేందుకు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇక్కడి పలుగ్రామాలకు చెందిన రైతులు మూడేళ్లుగా పండించిన పత్తిపంట నిల్వలను ధరలు వచ్చేవరకు అలానే ఇళ్లలో నిల్వ చేసుకున్నారు.

# అక్రమంగా అమ్మేసి.. రూ.లక్షలు కాజేసి

గూడూరు : వైకాపా హయాంలో 2022 నవంబరు నుంచి 2023 ఫిబ్రవరి వరకు వాకాడు మండలం దుగరాజపట్నం, కొండూరుపాలెం, తూపిలిపాలెం తదితర ప్రాంతాల్లో ఇద్దరు ఉద్యోగులు డిస్కంలో నియంత్రికలు, ఇతర సామగ్రిని అక్రమంగా అమ్మేసి రూ.80 లక్షల మేర దిగమింగారు. వీటిపై అప్పట్లో డిస్కం, విజిలెన్సు విచారణ అధికారులు నిగ్గు తేల్చినా ఎలాంటి చర్యలు లేవు. తాజాగా మరో అక్రమాల పుట్ట తెరపైకి వచ్చింది. మొనపాలెం, ఓడపాలెం, వైట్‌కుప్పం, రావిగుంటపాలెం పంచాయతీల పరిధిలోని పంబలి తీర గ్రామాల్లో రైతుల వద్ద రూ.15 లక్షల వరకు డిస్కంలోని కొందరు ఉద్యోగులు దోచుకున్నారు. డీడీలు చెల్లించిన వారికి ఏర్పాటు చేయాల్సిన నియంత్రికలను ఇతరులకు విక్రయించి విద్యుత్ వాడినట్లు బిల్లులు పంపడంతో అక్రమాల పుట్ట వెలుగులోకి వచ్చింది.

దీనిపై డిస్కం గూడూరు ఈఈ నరేంద్రరెడ్డిని వివరణ కోరగా.. వీటన్నింటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.



**సర్వీసు దరఖాస్తుకు రూ.5 వేలు**

తీర గ్రామాల్లో రైతులకు విద్యుత్ సర్వీసు కావాలంటే కోట సబ్ డివిజన్ కార్యాలయం వద్ద ఓ ఉద్యోగి దరఖాస్తుకు రూ.5 వేలు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. కోట సబ్ డివిజన్ పరిధిలో 2022 నుంచి జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాల్సిన డిస్కం విజిలెన్సు విభాగంలోని కొందరు ఉద్యోగులు అక్రమార్కులతో చేతులు కలిపి దోచుకుంటున్నట్లు తెలుస్తోంది.

**తీరంలో నియంత్రికల ఏర్పాటులో అవినీతి**

వాకాడు మండలం మొనపాలెంకు చెందిన మామిడి మంగమ్మ, వీరం బుజ్జమ్మలు వ్యవసాయ విద్యుత్తు నియంత్రణ కావాలని ఎనిమిది నెలల కిందట డీడీ చెల్లించారు. నేటికీ ఏర్పాటు చేయకపోగా వారం కిందట బిల్లులు రావడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఇదే ప్రాంతంలో ఆదిపరెడ్డి ముత్యాలమ్మ, విజయ కల్పన పేర్లపై నియంత్రికలకు డీడీలు కట్టినా నేటికీ అమర్చలేదు. వీరి కేటాయించాల్సిన వాటిని ఇతరులకు విక్రయించినట్లు స్థానికులు చెబుతున్నారు.

తాజాగా వాకాడు మండలం వైట్‌కుప్పానికి చెందిన ఓ రైతు వద్ద డిస్కంలోని ఓ ఉద్యోగి రూ.లక్ష తీసుకొని నియంత్రిక ఏర్పాటు చేశారు. డబ్బులు తీసుకొని నియంత్రిక ఏర్పాటు చేయడంపై విమర్శలు రావడంతో సమీప రైతులను రూ.80 వేలకు డీడీ తీయాలంటూ సదరు ఉద్యోగి ఒత్తిడి చేస్తున్నాడు.

మొనపాలెంలో మరో రైతు నియంత్రికకు డీడీ చెల్లించగా.. ఆయనకే కేటాయించాల్సిన నియంత్రికను ఇతరులకు ఇచ్చారు. దీనిపై చర్చ సాగడంతో హడావుడిగా నియంత్రిక అమర్చారు.

# వరి సాగు భళా

చిత్తూరు : జిల్లాలో రబీ సీజన్ ఆశాజనకంగా సాగుతోంది. కర్షకులు వరి సాగుకు ఎంతో ఆసక్తి చూపుతూ పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ ప్రోత్సాహం అందుబాటులో సాగు సేవల విస్తరణతో రబీ సీజన్ లక్ష్యాల దిశగా ముందుకు సాగుతోంది. గతేడాది నవంబరు, డిసెంబరు నెలల్లో జిల్లా తూర్పు ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురిశాయి. వాగులు, వంకలు ప్రవహించడంతో పాటు చెరువుల్లోకి నీరు భారీగా చేరడంతో భూగర్భజలాలు వృద్ధి చెందడంతో వరి సాగుపై అన్నదాతలు దృష్టిసారించారు. వరి సాధారణ సాగు విస్తీర్ణం 26 వేల ఎకరాలు కాగా.. ఇప్పటివరకు 14 వేల (51 శాతం) ఎకరాల్లో విస్తరించింది. ఈ నెలాఖరు వరకు నాట్లు కొనసాగి సాధారణ సాగును మించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

**పరికరాల పంపిణీకి వినతి**

గత ఐదేళ్ల వైకాపా పాలనలో యాంత్రీకరణ పరికరాల పంపిణీ ఊసే లేదు. యంత్ర సేవా పథకం కింద రైతు సంఘాలకు అందజేసిన పరికరాలు వైకాపా నాయకుల పరమయ్యాయి. కూటమి ప్రభుత్వం సాగును ప్రోత్సహిస్తోంది. రాయితీపై టార్పాలిన్ పట్టలు, ఇతర పరికరాల పంపిణీకి జిల్లా వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదించింది. త్వరలో వీటిని అందజేయనున్నారు.

**పొలంబాట దిశగా చర్యలు..- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి**

రైతులు పొలంబాట పట్టే దిశగా చర్యలు చేపట్టాం. రబీ సీజన్‌లో అన్ని పంటల సాగు లక్ష్యాన్ని అధిగమిస్తాం. అవసరాలకు అనుగుణంగా ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచాం. నిధులు రాగానే యంత్ర పరికరాలు అందజేస్తాం.

# నిధుల వరద

చిత్తూరు : గ్రామ పంచాయతీలకు కేంద్రం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులకు వైకాపా హయాంలో పలు విధాలుగా కోత పెట్టారు. ఆర్థిక సంఘం నిధులతో పాటు, రిజిస్ట్రేషన్ శాఖ నుంచి పంచాయతీలకు స్టాంపు డ్యూటీ సర్‌ఛార్జీలు రెండేళ్ల పాటు ఒక్క పైసా జమ చేయలేదు.. ఫలితంగా పంచాయతీల్లో పాలన పడకేసింది.. చిన్నచిన్న సమస్యలు పరిష్కరించలేని దయనీయ స్థితి. కూటమి ప్రభుత్వం రాకతో గతంలో నిలిచిన నిధులు నేడు నేరుగా పంచాయతీల ఖాతాలకు జమవుతుండటం గమనార్హం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లో పంచాయతీలకు అన్ని రకాల నిధులు అందుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు, వృత్తిపన్ను, తలసరి ఆదాయం, సర్పంచుల గౌరవ వేతనం, సీనరేజ్ ఛార్జీలు వెంటవెంటనే జమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం లేకుండా నేరుగా పంచాయతీల ఖాతాలకే నిధులు జమ కావడంపై రాజకీయాలకు అతీతంగా సర్పంచులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాకు రూ.89.32 కోట్లు..**కూటమి ప్రభుత్వం వచ్చాక నిధులన్నీ పంచాయతీల ఖాతాలకే జమ చేస్తోంది. ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలకు రూ.89.32 కోట్లు విడుదలయ్యాయి. వీటితో గ్రామాల్లో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. అత్యవసర పనులు చేసేందుకు సర్పంచులకు కాసింత ఊరట లభించింది. **పూర్తిస్థాయిలో నిధులు - సుధాకర్‌రావు, డీపీవో**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు పూర్తి స్థాయిలో నిధులు విడుదలవుతున్నాయి. పంచాయతీల్లో అత్యవసర సేవలతో పాటు, అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి.

## ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

ఆచంట : అన్నదాతలు విచ్చలవిడిగా ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తుండటంతో వారిపై పెట్టుబడి భారం పెరుగుతోంది. ఫలితంగా ఏటా అప్పుల పాలవుతున్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు నష్టాల నుంచి బయట పడాలంటే పెట్టుబడి వ్యయం తగ్గించుకోవాలి. ఇందుకు ఏకైక మార్గం ప్రకృతి వ్యవసాయం. పూర్వం అంతా గోఆధారిత వ్యవసాయమే. మళ్లీ ఇప్పుడు ప్రకృతి వ్యవసాయం వైపు కొందరు రైతులు అడుగులు వేస్తున్నారు. ఆచంట నియోజకవర్గంలోని ఆచంట, పెనుగొండ, పోడూరు మండలాల్లో కొందరు రైతులు విజయవంతంగా ప్రకృతి వ్యవసాయం చేస్తూ నాణ్యమైన దిగుబడులు సాధిస్తున్నారు. ఆరోగ్యాన్ని సొంతం చేసుకుంటున్నారు. నీ జిల్లాలో 2.11 లక్షల వరి 1.08 లక్షల మంది వరి పంట సాగు చేస్తున్నారు. మరో లక్షన్నర ఎకరాల్లో 80 వేల మంది ఇతర పంటలు సాగు చేస్తున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం నియోజకవర్గానికి 120 పైగా గోకులం మినీ షెడ్లు మంజూరు చేసింది. ఇలాంటి ప్రోత్సాహకాలతో పాటు ప్రకృతి వ్యవసాయానికి రాయితీలు ప్రకటించాలని రైతులు కోరుతున్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను చౌకధరల



దుకాణాల ద్వారా విక్రయిస్తే ప్రయోజనం ఉంటుందంటున్నారు. ప్రకృతి వ్యవసాయానికి దేశీ ఆవులే కీలకం. ఆవు మూత్రం, పేడ, పులిసిపోయిన మజ్జిగ ఏదీ వృథా కాదు. ఇవి ఎరువు, క్రిమి సంహారిగా ఉపయోగ పడుతున్నాయి.

**ఎరువులు, పురుగు మందుల ఖర్చు లేదు**

నేను అయిదేళ్లగా 20 ఆవులతో పాడి- పంటలు సమతుల్యం చేసుకుని నాలుగెకరాల్లో వ్యవసాయం చేస్తున్నా. కేవలం కూలీల ఖర్చు మినహా ఎరువులు, పురుగుమందుల ఖర్చు లేదు. ప్రకృతి వ్యవసాయం చేస్తూ పెట్టుబడులు తగ్గించుకుని, ఇతర రైతుల కంటే ఎక్కువ ధరకు బియ్యం విక్రయిస్తున్నా.- చిలుకూరి విశ్వేశ్వరరావు, ఆచంట

**అవగాహన కల్పిస్తున్నా**

నేను మా కుటుంబానికి సరిపడా ఆహారం, కూరగాయలు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించుకుంటున్నా. మందులు, ఎరువులు లేకుండా పండించిన పంటలతో ఆరోగ్యంగా ఉండవచ్చు. నాకు తెలిసిన రైతులందరికీ ఈ విధానంపై అవగాహన కల్పిస్తున్నా. -నెక్కంటి బుచ్చేశ్వరరావు, చినమల్లం, పెనుగొండ మండలం

## టిడ్కో లబ్ధిదారులకు గృహయోగం

పార్వతీపురం : సంక్రాంతి వేళ కూటమి ప్రభుత్వం టిడ్కో గృహ లబ్ధిదారులకు తీపి కబురు చెప్పింది. గృహ సముదాయాల్లో మరో ఆరు నెలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి, సొంతింటి కల నెరవేర్చనుంది. ప్రధానమంత్రి ఆవాస యోజన పథకంలో భాగంగా 2014- 19లో తెదేపా ప్రభుత్వం సాలూరు, పార్వతీపురంలో పట్టణ పేదలకు 2544 ఇళ్లు మంజూరు చేసింది. కొంతమేర పనులు జరిగాయి. గత ప్రభుత్వం రివర్స్ టెండర్లకు వెళ్లి 528 రద్దు చేసింది. రెండేళ్ల తర్వాత పనులు పునఃప్రారంభించింది. కానీ పూర్తిచేయలేకపోయింది. మొక్కుబడిగా కొందరితో గృహప్రవేశాలు నిర్వహించి చేతులు దులిపేసుకుంది. సదుపాయాలు లేకపోవడంతో



అక్కడికి వెళ్లేందుకు ఎవరూ సాహసించడం లేదు.

**చేపట్టాల్సిన పనులివీ..**

సాలూరు పురపాలిక పరిధిలోని చంద్రంపేట వద్ద నిర్మించిన టిడ్కో గృహాలకు గుమడాం వేగావతి నది వద్ద సంపు నిర్మించి, తాగునీటి పైపులైను ఏర్పాటు చేయాలి. అసంపూర్తిగా ఉన్న 192 గృహాలు, రోడ్లు, కాలువలు నిర్మించాలి. పార్వతీపురం అడ్డాపుశీల వద్ద 768 ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. గత ప్రభుత్వం 20 శాతం ప్రక్రియను మాత్రమే పూర్తి చేసింది. నీటి సరఫరాకు రూ. 5.28 కోట్లు మంజూరైనా చర్యలు తీసుకోలేదు.

మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మించాలి.

మరోవైపు సాలూరు పట్టణంలో పేదల పేరున బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు చెల్లించాల్సి ఉంది. పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రాజెక్టు అధికారి డి.వి. రమణమూర్తి తెలిపారు.


## దేవుడి భూమిలో అక్రమ దారి..!

శ్రీకాకుళం : ఆక్రమణకు కాదేది అనర్హమన్నట్లు ఏకంగా దేవుడి భూమినే ఆక్రమించేశారు.. ఓ వ్యక్తి తనకున్న భూమిలో లేఅవుట్ నిర్మాణానికి రోడ్డు మార్గానికి ఏకంగా ఆలయ భూమిని రెండు భాగాలుగా చేసి మధ్యలో బాట వేశారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం పేరు మీదుగా ఒప్పంగి వెళ్లే దారిలో దాబా వద్ద సర్వే నంబరు 130లో 87 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. దీనిలో ఇప్పటికే పంట వేశారు. దీన్ని ఆనుకొని ఉన్న కాలువపై అనధికారి కంగా సిమెంటుతో కల్వర్టు నిర్మించారు. దీనికి అనుసంధానం చేస్తూ గ్రావెల్ రహదారి నిర్మాణం చేపడుతున్నారు. 'ఇది దేవాలయానికి చెందిన భూమి. ఆక్రమించిన వారు శిక్షార్హులు' అని హెచ్చరిక బోర్డు పెట్టినప్పటికీ తొలగించి మరీ రోడ్డేశారు. ఇక్కడ మరో విషయం



ఏమిటంటే రహదారి నిర్మాణానికి అరసవల్లి దేవస్థానంలో కూల్చివేస్తున్న భవన నిర్మాణాల శిథిలాలను తీసుకెళ్లి బాటకు ఉపయోగిస్తున్నారు. ఆలయానికి కూతవేటు దూరంలో ఇంత జరుగుతున్నా ఎవరూ పట్టించు కోలేదు. దీనిపై అరసవల్లి ఆలయ ఈవో భద్రాజీని మాట్లాడుతూ 'ఆలయ భూమిలో రోడ్డు నిర్మిస్తున్నట్లు మా దృష్టికొచ్చింది. తక్షణం వాటిని తొలగించే చర్యలు చేపడతాం. కల్వర్టు నిర్మాణానికి సంబంధించి గతంలో పోలీస్‌స్టేషన్‌లో కేసు సైతం నమోదైంది. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం' అని పేర్కొన్నారు.

# బాల్యానికి పసుపుతాడు



భోగాపురం : సమాజాన్ని అర్థం చేసుకుంటున్న సమయంలో పెళ్లి పీటలు ఎక్కిస్తున్నారు.. బాధ్యతలే తెలియని వయసులో మూడు ముళ్లు వేయిస్తున్నారు.. బిడ్డను ఓ అయ్య చేతిలో పెడితే తమ బరువు తీరుతుందని భావిస్తున్నారు. జిల్లాలో బాల్య వివాహాలు పెరుగుతుండడంతో అభం శుభం తెలియని చిన్నారులు మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్థిక వెనుకబాటు, నిరక్షరాస్యతే దీనికి కారణం. బాలికల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామాల్లో మైనర్ల వివాహాల నియంత్రణకు అవగాహన కల్పిస్తున్నా మార్పు ఉండడం లేదు. గత అయిదేళ్ల వైకాపా పాలనలో బాలికల చట్టాల అమలును కాలరాశారు. గతంలో అమలులో ఉన్న కిశోర వికాసం కార్యక్రమానికి పూర్తిగా తూట్లు పొడిచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కిశోర వికాసం పథకాన్ని విస్తృతం చేసింది.

**ఇవీ నష్టాలు**

బాలలు నిరక్ష్యరాస్యులుగా, నైపుణ్యం లేని వారిగా మిగిలిపోతారు. చిన్న వయసులో గర్భం దాల్చితే ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉంది. పిల్లలు తక్కువ బరువుతో పుట్టడం, పౌష్టికాహార లోపం, రక్తహీనత సమస్యలతో బాధపడతారు.

**పర్యవేక్షణ బాధ్యత**

జిల్లాస్థాయిలో కలెక్టరు, సబ్ కలెక్టరు, రెవెన్యూ డివిజనల్ అధికారి, పంచాయతీ కార్యదర్శి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఐసీడీఎస్ శాఖ, మండలంలో తహసీల్దార్ బాల్య వివాహాల నిరోధక అధికారులుగా వ్యవహరిస్తారు. బాలల పరిరక్షణ విభాగం, ఛైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది ఈ సాంఘిక దురాచారంపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ఈ వివాహాలపై సమాచారం తెలిసిన వారు 1098 నంబరుకు ఫోన్ చేయాలని అధికారులు సూచిస్తున్నారు. చట్టం అతిక్రమిస్తే చర్యలు: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కిశోర వికాసం పథకంలో భాగంగా జిల్లాలో బాల్య వివాహాల కట్టడికి గ్రామ, మండల కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. అయినా ఎక్కడో చోట పెళ్లిళ్లు చేస్తూనే ఉన్నారు. ఇది చట్టరీత్యా నేరం. సమాజం కలిసి వస్తేనే వీటిని నియంత్రించగలం. బి. హెచ్. లక్ష్మి, జిల్లా సంక్షేమాధికారిణి, విజయనగరం

# వరద నీటి కాలువలకు మోక్షం!



ఒంగోలు : వర్షాకాలంలో నగర ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుంది. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నిధులు రూ. 13 కోట్లు నగరపాలక సంస్థకు కేటాయించారు. దీంతో నిధులు అందుబాటులోకి వచ్చాయి. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సూచన మేరకు ఈ నిధులు మొత్తం మురుగుకాలువల నిర్మాణానికి ఖర్చుచేయాలని నిర్ణయించారు. ఆ మేరకు కార్పొరేషన్ కమిషనర్, ఇంజినీర్లు ప్రతిపాదనలు రూపొందించి సంయుక్త కలెక్టర్‌కు సమర్పించారు. ఆమోదం రాగానే టెండర్లు చేపట్టాలని యోచిస్తున్నారు.

**దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం..**

చిన్నపాటి వర్షం పడినా నగరంలోని రహదార్లు, వీధులు జలమయమై రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. ఉత్తరాన పోతురాజు కాలువ, దక్షిణాన నల్లకాలువ ఉన్నప్పటికీ వాటికి అనుసంధానంగా ఉన్న వరదనీటి కాలువలు సక్రమంగా లేవు. 20 ఏళ్ల కిందట నిర్మించిన కాలువలు పగిలిపోయి, పూడికతో నీరుపారదలకు అనువుగా లేవు. గుంటూరురోడ్డు, బాలాజీరావు పేట, బండ్లమిట్ట ప్రాంతాల్లో కల్వర్టులు కుంగిపోయి కాలువల్లో నీరు పోవడంలేదు. ఇలాంటివి నగరంలో 12 కాలువలు గుర్తించారు. వాటిని పునర్నిర్మిస్తే వరద, మురుగునీరు సులభంగా తరలి పోతుందని అంచనా వేశారు. మొత్తం రూ. 16 కోట్లకు అంచనాలు వేయగా, జాయింట్ కలెక్టర్ సమక్షంలో పరిశీలన అనంతరం రూ. 13 కోట్లుకు ప్రతిపాదించారు. ఈనెలాఖరులోగా ఈ పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. అద్దంకి బస్టాండ్, వెంగముక్కలపాలెం, కొప్పోలు సమీపంలో కల్వర్టు, బైపాస్‌రోడ్డు అల్లూరయ్య దుకాణం పక్కరోడ్డులో కాలువ, సుజాతానగర్ మెయిన్‌రోడ్డు కాలువ, రాజీవ్‌నగర్, 40వ డివిజన్ రెడ్డిపాలెం వద్ద కాలువలతోపాటు మరికొన్ని అత్యవసరమైన వాటిని ఎంపిక చేశారు. ఇదిలా ఉండగా నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద వచ్చిన రూ. 4.10 కోట్లుతో కొన్ని రహదారులు, పార్కులు, పచ్చదనం అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచారు. ప్రస్తుతం అవి వర్క్‌ఆర్డర్లు ఇచ్చే దశలో ఉన్నాయి.

**మురుగు సమస్య ఉండదు..**

ఒడా నిధులతో చేపడుతున్న పనులతో మురుగు సమస్య చాలావరకు పరిష్కారమవుతుంది. దాదాపు 20 ఏళ్లుగా వాటికి మరమ్మతులు లేవు. దాదాపు 20 కాలువల పనులు జరగబోతున్నాయి. అధికవర్షం పడినా సులభంగా వరదకాలువల ద్వారా బయటికి తరలి పోతాయి. చంద్రయ్య, మున్సిపల్ ఇంజినీర్

# గంగపుత్రుల ఆనందం రెట్టింపు



ఒంగోలు : ఎగిసి పడే అలలను చీల్చుకుంటూ..పగలు, రాత్రీ కల్లోల కడలిలో వేట కొనసాగించే గంగపుత్రులకు ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. అనంత సాగరాన్ని వీడి ఏటా రెండు నెలలపాటు వారు విశ్రాంతి తీసుకుంటుంటారు. వారందరికీ ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఏటా చేపల వేటపై ఏప్రిల్ 15 నుంచి జూన్ 14వ తేదీ అర్ధరాత్రి వరకు దాదాపు 61 రోజుల పాటు నిషేధం అమల్లో ఉంటుంది. ఆ సమయంలో వారికి కుటుంబం గడవడం కష్టంగా మారుతోంది. వైకాపా ప్రభుత్వ పాలనలో వారికి వేట విరామ సమయంలో కేవలం రూ. 10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించింది. పెరిగిన ధరలతో అది ఏ మూలకు చాలక ఇబ్బందులు పడుతుండటంతో కూటమి ప్రభుత్వం రూ. 20 వేలు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దీంతో తీర ప్రాంతంలోని మత్స్యకార కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

**వేల కుటుంబాల్లో వెలుగులు:** ఉమ్మడి ప్రకాశంలో కోస్తా తీర ప్రాంతం 102 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండగా, నూతన జిల్లాల విభజన తర్వాత ప్రకాశం జిల్లాలో ఇది కాస్తా 52 కిలోమీటర్లకు పరిమితమైంది. చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాలు బాపట్ల జిల్లాలోకిబీ ఉలవపాడు, గుడ్లూరు తీర ప్రాంత మండలాలు నెల్లూరు జిల్లా పరిధిలోకి వెళ్లాయి. దీంతో ఒంగోలు, కొత్తపట్నం, నాగులుప్పలపాడు, టంగుటూరు, సింగరాయకొండ మండలాలు ప్రస్తుతం జిల్లాలో మిగిలాయి. గతంలో పది మండలాల్లోని 38 పంచాయతీల పరిధిలోని 74 గ్రామాల్లో 74 వేల మత్స్యకార కుటుంబాలు ఉండగా, ప్రస్తుతం 14 పంచాయతీల పరిధిలోని 30 గ్రామాల్లో సుమారు 32 వేల కుటుంబాలున్నాయి. గతంలో 3,200 బోట్లు ఉండగా, ప్రస్తుతం బోట్ల సంఖ్య కూడా 1200కు తగ్గింది.

**ఉచిత బియ్యం మొదలు.. నగదు వరకు :** బంగాళాఖాతంలో మత్స్య సంపద పెంపుతోపాటు, మత్స్యకారుల జీవనోపాధి మెరుగు పరిచే లక్ష్యంతో ఏటా 61 రోజులపాటు వేట నిషేధం అమల్లో ఉంటుంది. విరామ సమయంలో ఉపాధి కోల్పోనున్న ఆయా కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం గతంలో ఉచిత బియ్యం నుంచి ఆర్థికసాయం వరకు పలు మార్పులు చేసుకుంటూ వచ్చింది. ప్రతి ఏటా మత్స్యశాఖ అధికారులు తీర గ్రామాల్లో అర్హులను గుర్తిస్తారు. ఈ మేరకు ఇప్పటికే మత్స్యకార భరోసా పథకం లబ్ధిదారుల ఎంపిక జాబితాను ప్రభుత్వానికి నివేదించారు. లైసెన్స్ ఉన్న ఒక్కో బోటు కింద యజమానితోపాటు, మరో ఇద్దరికిబీ ఇంజిన్ బోటు కింద యజమానితోపాటు, మరో అయిదుగురికి గతేడాది భరోసా అందించారు. గత ప్రభుత్వ హయాంలో ఏటా నిబంధనలను మరింత కఠినం చేయడం ద్వారా లబ్ధి పొందుతున్న వారి సంఖ్య తగ్గింది. ఇతర పథకాల కింద లబ్ధి పొందుతున్న మత్స్యకారులను భరోసాకు అనర్హులుగా ప్రకటించడంతో సగం కుటుంబాలు ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయానికి దూరమవుతున్నారు. గత ఆర్థిక సంవత్సరానికి వేట నిషేధ కాల భృతిగా కుటుంబానికి రూ. 10 వేలు చొప్పున 5,286 మందికి రూ. 5.28 కోట్ల నగదును వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి తాజాగా 5,429 మంది లబ్ధిదారులను గుర్తించారు. త్వరలోనే వారి బ్యాంక్ ఖాతాలకు నగదు జమ చేయనున్నారు.

## స్మార్ట్ మీటర్లు వచ్చేశాయ్..

ఇబ్రహీంపట్నం : విద్యుత్తు చౌర్యంతో పాటు బిల్లింగ్‌లో జరిగే అవకతవకలకు చెల్లుచీటి ఇచ్చేందుకు ప్రభుత్వం విద్యుత్తు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తుంది. ఇబ్రహీంపట్నం విద్యుత్తు సెక్షన్ కార్యాలయం పరిధిలో తొలిదశలో ప్రభుత్వ సంస్థలతో పాటు వ్యాపార సంస్థలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం విద్యుత్తు వినియోగాన్ని లెక్కించేందకు ఏజెన్సీ సిబ్బంది ఇంటికి వచ్చి మీటరు రీడింగ్ నమోదు చేసి బిల్లును అందజేస్తున్నారు. సిబ్బంది ప్రతి నెల ఒక్కే తేదీన వచ్చి రీడింగ్ తీయాల్సి ఉంది. అయితే సిబ్బంది తమకు అనుకూలమైన రోజు వచ్చి రీడింగ్ తీయడంతో శ్లాబ్ మారిపోయి ఎక్కువ బిల్లు రావడంతో వినియోగదారులు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో ఇలాంటి ఫిర్యాదులు రావని అధికారులు భరోసా ఇస్తున్నారు.

**ఏపీఎస్‌పీడీసీఎల్ పరిధిలో..**

ఇబ్రహీంపట్నం విద్యుత్తు కార్యాలయం పరిధిలో ప్రస్తుతం ఉన్న ఇన్‌ఫ్రారెడ్ రేడియేషన్ మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నారు. ముందుగా ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు వీటిని అమరుస్తున్నారు. ఇబ్రహీంపట్నం కార్యాలయం పరిధిలో 1,900 ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య విద్యుత్తు సర్వీసులుండగా ప్రస్తుతం దాదాపు వెయ్యి మీటర్లు బిగించారు.



**ప్రయోజనాలు**

విద్యుత్తు సంస్థకు వంద శాతం బిల్లింగ్ జరుగుతుంది. భవిష్యత్తులో ఈ మీటర్లను ప్రీ పెయిడ్‌గా వినియోగించే అవకాశం ఉంటుంది. దీంతో నెలవారీ విద్యుత్తు ఎంత అవసరమో ఆ మేరకు రీఛార్జి చేసుకోవచ్చు. విద్యుత్తు సరఫరాలో హెచ్చుతగ్గులు ఉండవు. నాణ్యమైన సరఫరా ఉంటుందని ఎప్పుడు కావాలంటే అప్పుడు బిల్లు ఎంత అవుతుందో వినియోగదారుడు సులభంగా తెలుసుకోవచ్చు. దీంతో విద్యుత్తు వృథా కాకుండా వినియోగంపై స్వీయ నియంత్రణ చేసుకునే అవకాశం ఉంటుంది.

**సరఫరాపై స్పష్టత - వెంకన్న, ఏఈ, ఇబ్రహీంపట్నం**

విద్యుత్తు సంస్థకు వంద శాతం బిల్లింగ్‌తో పాటు పంపిణీ సంస్థలు నష్టాల నుంచి గట్టెక్కేందుకు స్మార్ట్ మీటర్ల ప్రక్రియ ఉపయోగపడుతుంది. అదే విధంగా సరఫరాపై స్పష్టత వస్తుంది. విద్యుత్తు వినియోగదారులు ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చు. త్వరలోనే గృహ సర్వీసులకు కూడా వీటిని అమరుస్తాం.

## చక్కదిద్దితే నవలోకమే

అవనిగడ్డ : కృష్ణా నదికి ఇటీవల వచ్చిన వరదలకు సరికొత్త అందాలతో నవలంక పునరుద్భవించింది. ఉదయించే సూర్యకిరణాల వెలుగుల్లో జిగేలు మనిపించే గడ్డిపూలు, ప్రకృతి రమణీయత, సముద్రపు పక్షుల గుంపు మనల్ని చూపుతిప్పుకోనివ్వవు. సూర్యాస్తమయ మనోహర దృశ్యాలతో నాగాయలంక శ్రీరామపాద క్షేత్రం అదనపు ఆకర్షణ.

**ఎలా చేరాలంటే?**

నవలంకను సందర్శించాలంటే విజయవాడ నుంచి అవనిగడ్డ మీదుగా నాగాయలంకకు ప్రతి అరగంటకు బస్సు ఉంటుంది. కరకట్ట ఎక్స్‌ప్రెస్ ఎక్కితే విజయవాడ, రామలింగేశ్వరనగర్ నుంచి పులిగడ్డ వరకు దాదాపు 60 కిలోమీటర్ల పొడవున వివిధ పంటలతో లంక భూములు కనువిందు చేస్తాయి. కనుచూపు మేరలో ఎటు చూసినా పచ్చదనంతో భూమికి కప్పు వేశారా అన్నట్లు కరకట్ట పొడవునా ఇరు వైపులా కనిపించే చెట్లు మధురానుభూతులను మిగులుస్తాయి.

**నవలంక..** అందమైన ఇసుక తిన్నెలతోపాటు ప్రకృతి రమణీయతకు అద్దం పట్టే దృశ్యాలతో కృష్ణా నది తీరాన నాగాయలంక వద్ద 2017లో



నాటి తెదేపా ప్రభుత్వం తీర్చిదిద్దిన పర్యాటక ప్రాంతం. పర్యాటకులు బస చేసేందుకు వీలుగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఇక్కడ తాత్కాలిక కాటేజీలు కూడా ఏర్పాటు చేసింది. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అప్పటి ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ మూడేళ్లపాటు ఇదే ప్రదేశంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆదరణ కొరవడి కళావిహీనంగా మారింది. పర్యాటకుల్ని ఆకర్షించే విధంగా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పూర్వవైభవం తీసుకొచ్చి అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

**పూర్తిస్థాయి అందాలు ఆస్వాదించాలంటే..**

కరకట్టపై ప్రయాణంతో అవనిగడ్డ మీదుగా నాగాయలంక చేరుకుంటే బస్సు దిగిన దగ్గర నుంచి అర కిలోమీటరు దూరంలోనే శ్రీరామపాద క్షేత్రం పుష్కరఘాట్ వస్తుంది. అక్కడి నుంచి స్థానిక మత్స్యకారులు తమ పడవల్లో పర్యాటకులను నది మధ్యలో అందంగా కనిపించే నవలంకకు తీసుకెళ్తారు. రూ. 300 నుంచి రూ. 400 వరకు వసూలు చేస్తారు. అయితే నవలంక అందాలు పూర్తిస్థాయిలో ఆస్వాదించాలంటే సాయంత్రం 4 గంటల సమయం దాటితేగానీ కుదరదు.

**దర్శించుకోవాల్సిన ఇతర దేవాలయాలు**

పులిగడ్డ వద్ద కృష్ణా నది రెండుగా చీలి ఒక పాయ హంసలదీవి సమీపంలో సాగరంలో సంగమిస్తే, మరో పాయ వేణీనదిగా మారి నాగాయలంక దిగువన సాగరుడితో సంగమిస్తుంది. ఇక్కడ నది అంచున నిర్మించిన రామలింగేశ్వరస్వామి, కనకదుర్గమ్మ, సత్యనారాయణ స్వామి, రాముల వారి, శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలు పర్యటకులను ఆకట్టుకుంటాయి.

# అడిగినంత ఇవ్వకుంటే.. ఆలస్యమే!!

విశాఖపట్నం : ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం)-2020లో పెండింగు దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్డీఏ)లో ఇది కొందరికి వరంగా మారింది. లైసెన్స్ సర్వేయర్లు, సాంకేతిక సహాయకులు కొర్రీల పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సమర్పించాల్సిన పత్రాలను ఎప్పటికప్పుడు తెలియపరచకుండా కాలయాపన చేసి గడువు సమీపించేసరికి ఒత్తిడి చేస్తున్నారని దరఖాస్తుదారులు వాపోతున్నారు. కొన్నింటికి కొర్రీల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. పరిష్కరించే అవకాశం ఉన్న వాటినీ పట్టించుకోకుండా వదిలేస్తున్నారని, ఈసారైనా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు కలిగేలా చూడాలని కోరుతున్నారు.

**గడువు పెంచుతూ:** వాస్తవానికి 2020 జనవరిలో 'ఎల్ఆర్ఎస్'కు గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. 2019 ఆగస్టు 31కి ముందు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లకు క్రమబద్ధీకరణ వర్తించేలా ఆదేశాలు జారీ చేసింది. 2022 నాటికే గడువు పూర్తవగా... పలు దఫాలుగా గడువు పెంచుకుంటూ వచ్చింది. చివరికి 2023 వరకు చేశారు. ఇంకా దరఖాస్తులు భారీగా ఉండిపోవడంతో కూటమి ప్రభుత్వం చివరి అవకాశం కల్పించింది. వీటిని మార్చి నెలాఖరులోగా పూర్తిచేయాలని ఆదేశించింది. జనవరిలో సగం రోజులు పూర్తయినా చాలామంది దరఖాస్తుదారులకు సమాచారమే అందలేదంటున్నారు. వీఎంఆర్డీఏ అధికారులు



కింద స్థాయి అధికారులు, సర్వేయర్లు మీద ఒత్తిడి తేవాల్సి ఉంది.

**దస్త్రాల సమర్పణ అవసరం**

అనుమతి ఇవ్వాల్సిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వీఎంఆర్డీఏలో రెండు వేలు వరకున్నాయి. అవసరమైన దస్త్రాలు సమర్పించనివి వీటిల్లో ఎక్కువగా ఉండగా నిర్లక్ష్యంగా వదిలేసినవి కొన్ని ఉన్నాయి.


కొన్ని లేఅవుట్లకు రోడ్లు చూపించకపోవడం, నిరభ్యంతర పత్రాలు సమర్పించకపోవడం, భూవినియోగ మార్పిడి చేయకపోవడం వంటివి ఉన్నాయి. లేఅవుట్ ప్లాన్ మార్చి పంపాల్సినవి చాలా ఉన్నాయి.

కొన్ని లేఅవుట్లకు సంబంధిత యజమానులు ప్రభుత్వ భూముల్లో నుంచి దారులు చూపించారు. అటువంటి వాటికి జిల్లా కలెక్టరు అనుమతి అవసరం. పలు రకాల సర్వే సమస్యలతో ఆగిపోయినవి ఎక్కువే.

నిర్లక్ష్యంగా ఆపేసినవి, అడిగినంత డబ్బులు ఇవ్వలేదని ఆపేసిన దరఖాస్తులు కూడా కొన్ని ఉన్నట్లు చర్చ సాగుతోంది. ఒకే లేఅవుట్లో ఒకే సమస్యతో దరఖాస్తు చేసిన వాటిల్లో కొన్నింటికి గతంలో అనుమతిచ్చి, మరికొందరి అనుమతించలేదు. ఇటీవల వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్‌కు వీటి మీద ఫిర్యాదులు అందాయి.

# బౌద్ధ శిల్పకళా సంస్కృతికి ప్రతిబింబం

అనకాపల్లి : జిల్లాలో ప్రసిద్ధి చెందిన బొజ్జన్న కొండపై కనుమనాడు తీర్థాన్ని వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. దీనిని తిలకించడానికి భారీగా జనం తరలివస్తారు. కొండపై ఉన్న బౌద్ధ స్తూపాలు, శిలా విగ్రహాలతో ఈ ప్రాంతం బౌద్ధ క్షేత్రంగా విరాజిల్లుతోంది. ప్రాచీన బౌద్ధ శిల్ప కళా సంస్కృతిలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. పురావస్తు శాఖ అధికారులు బొజ్జన్న కొండ అభివృద్ధికి ప్రాచీన సంపదను పరిరక్షించడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. అనకాపల్లి ఆవిర్భవించక ముందే ఇక్కడ బౌద్ధమతం విలసిల్లింది. శంకరం గ్రామ పంచాయతీ పరిధిలోని బొజ్జన్న కొండపై బౌద్ధ స్తూపాలను తిలకించడానికి బౌద్ధ భిక్షువులు, ఉపాసకులు తరలివస్తారు. 1906-1908లో అలెగ్జాండర్ రిమ్ ఆధ్వర్యంలో ఇక్కడ జరిగిన తవ్వకాల్లో అలనాటి రాజశాసనాలు, నాణేలు, ముద్రలు బయటపడ్డాయి. ఇక్కడ లభ్యమైన బంగారు నాణేలు సముద్రగుప్తుని, శాతవాహన కాలం నాటివని చరిత్రకారులు నిర్ధారించారు. ఇక్కడ లభ్యమైన



బౌద్ధారామ అవశేషాలు గత వైభవానికి సాక్షాలుగా నిలిచాయి. కొండపై ఉన్న గుహలో బుద్ధుని నిలువెత్తు స్తూపం, దీని పైభాగంలో ఉన్న గుహలో ధ్యానంలో ఉన్న బుద్ధుడి విగ్రహం ఉంది. అక్కడి గదుల్లో బౌద్ధులు ధ్యానం చేసే వారని చరిత్ర చెబుతోంది. మరోపక్క ఈ కొండను ఆనుకొని లింగాల కొండ ఉంది. ఇక్కడ వందల సంఖ్యలో లింగాకార స్తూపాలు ఉన్నాయి. ఏటా కనుమ పండగ నాడు బౌద్ధమేళాను విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. కొండ వద్ద పతాకావిష్కరణ, కొండ ప్రవేశ ద్వారం నుంచి కొండపైగల ప్రధాన స్తూపం వరకు శాంతి ర్యాలీ చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హాజరు కానున్నారు. కనుమ పండగనాడు భారీఎత్తున జరిగే తీర్థానికి కొండను ముస్తాబు చేస్తున్నారు. అనకాపల్లి డీఎస్పీ శ్రావణి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

# నరవ కొండపై కన్నేశారు..

అనకాపల్లి : గ్రావెల్ అక్రమ తవ్వకందారులు చెలరేగిపోతున్నారు. ఆదివారం నుంచే అక్రమ తవ్వకాలు ప్రారంభించేశారు. అధికారులు ఉన్నప్పుడే తవ్వేసుకుంటున్నాం... లేనప్పుడు ఇంకా మమ్మల్ని ఎవరు ఆపగలరన్న ధీమాతో యథేచ్ఛగా తవ్వకాలు చేపట్టారు. నరవ కొండపై పగలు, రాత్రి అన్న తేడా లేకుండా తవ్వకాలు జరిపేందుకు క్వారీ ప్రదేశాలకు కొంత దూరంలో జేసీబీలను సిద్ధంగా ఉంచారు. ఒక్కో లారీ గ్రావెల్ రూ.3వేల నుంచి 3500 వరకు అమ్మకాలు జరుపుతున్నారు. ఒక్క రాత్రి అధికారులు కళ్లు మూసుకుంటే ఒక్క లారీతో కనీసం 50లోడుల వరకు అక్రమ గ్రావెల్ బయటకు తరలిపోతుంది. అంటే సుమారు రూ.2లక్షల వరకు అక్రమంగా సంపాదిస్తున్నారు. ఇలాంటి గ్రావెల్ తవ్వకందారులకు కొందరు అధికారులు, రాజకీయ నేతల అభయహస్తం ఉండడం వల్లే వీరు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

# తాగునీటి పథకాలకు మోక్షమెన్నడో?



గుత్తి : జిల్లాలోని పలు ముఖ్యపట్టణాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నా తీర్చాలన్న లక్ష్యంతో ఐదేళ్ల కిందట తెదేపా ప్రభుత్వం భారీ నీటిపథకాలను మంజూరు చేసింది. రూ.కోట్లు వెచ్చించి ప్రజల దాహార్తిని తీర్చాలని పనులు చేపట్టింది. 2020లో నీటిపథకాలను మంజూరు చేసి నిధులు కేటాయించింది. ప్రభుత్వం మారిపోవడంతో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పథకాల పనులను పట్టించుకోలేదు. ఆ పనులన్నీ అసంపూర్తిగా మిగిలిపోయాయి. ఫలితంగా ప్రజలు తాగునీటికోసం అనేక పాట్లు పడుతున్నారు.

**కూటమి ప్రభుత్వం రాకతో చిగురించిన ఆశలు**

ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నీటి పథకాలను పూర్తి చేయాలని సంకల్పించింది. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్షర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు రుణంతో పనులను తిరిగి చేపట్టేందుకు నిర్ణయించారు. నిధుల కోసం బ్యాంకుతో సంప్రదింపులు చేస్తున్నారు. ఆగిపోయిన పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీటిని అందించాలని ఇటీవల నిర్వహించిన కమిషనర్ల సమావేశంలో మంత్రి నారాయణ తీర్మానించారు.

**ఒకే ప్యాకేజీ కింద టెండర్లు**

గత తెదేపా ప్రభుత్వం జిల్లాలోని గుత్తి, పామిడి, కళ్యాణదుర్గంలో తాగునీటి పథకాలను ఏర్పాటు చేసేందుకు పనులు మంజూరు చేసింది. అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లోని పథకాల నిర్మాణాల బాధ్యతలను ఒకే గుత్తేదారు సంస్థకు ఇచ్చారు. ఒకే ప్యాకేజీ కింద టెండర్లు నిర్వహించి పనులు అప్పగించారు. వైకాపా ప్రభుత్వం నీటిపథకాలపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. అప్పటి ఎమ్మెల్యేలు పథకాలను పూర్తి చేసి తాగునీటి సమస్యను తీరుస్తామని ఉత్తిత్తి హామీలు ఇచ్చి ఐదేళ్లు కాలం వెళ్లదీసింది. ఒక్క పథకాన్ని కూడా వైకాపా ప్రభుత్వం పూర్తి చేయించలేకపోయింది.

**పెరుగుతున్న వ్యయం** తాగునీటి పథకాల నిర్మాణ వ్యయం ఏడాదికేడాది పెరుగుతోంది. తొలుత గుత్తికి తాగునీటిని అందించేందుకు రూ. 90 కోట్లతో ప్రతిపా దించారు. తరువాత రూ.120 కోట్లకు అంచనా వ్యయం పెరిగింది. ఆ తరువాత రూ.173 కోట్లకు చేరుకుంది. ఇప్పుడు ఆపథకాన్ని పూర్తి చేయించేందుకు ప్రభుత్వం కొత్త ధరలతో అంచనాలు వేయనుంది. పథకం సకాలంలో పూర్తి కాకపోతుండటంతో నిర్మాణ వ్యయం పెరుగుతోంది. దీనిపై గుత్తి పురపాలిక సంఘం కమిషనర్ జబ్బార్‌మి యా మాట్లాడుతూ నీటిపథకం పనులకు గాను ప్రభుత్వం కొత్త ఎస్ఎస్ఆర్ ధరలతో అంచనాలను రూపొందిస్తోంది. పథకం పూర్తికి పురపాలిక శాఖ నారాయణ కసరత్తు చేస్తున్నారని తెలిపారు..

# 10 రోజులే హెచ్చెల్సీ జలాలు



అనంతపురం : తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువకు (టీబీ హెచ్చెల్సీ) నీటి ప్రవాహం ఇక పది రోజులే కొనసాగనుంది. ఈ కాలువ నిర్దేశిత కేటాయింపుల జలాల వాటా పూర్తి కావస్తోంది. టీబీ మండలి దామాషా (ప్రొరేట్) ప్రకారం హెచ్చెల్సీ, కేసీ కాలువ మళ్లింపు (డైవర్షన్) వాటా కలిపి మొత్తం 31.434 టీఎంసీలు రావాల్సి ఉండగా.. ఇప్పటికే టీబీ డ్యాం వద్దే 29.854 టీఎంసీలు విడుదల చేశారు. ఇక కేవలం 1.580 టీఎంసీలు మాత్రమే హెచ్చెల్సీకి రావాల్సి ఉంది. రోజూ 1,800 క్యూసెక్కుల ప్రకారం వచ్చినా మహా అయితే ఈనెల 22వ తేదీ నాటికి వాటా పూర్తి అయ్యే అవకాశం ఉంది. కానీ.. ఇటీవల టీబీ జలాశయం పరివాహక ప్రాంతాల్లో వానలు కురవడంతో ఇన్‌ఫ్లో పెరిగినట్లు తెలుస్తోంది. తాజా గణంకాల ప్రకారం మరొకసారి ప్రొరేట్ను పరిగణనలోకి తీసుకుని లెక్కించాల్సి ఉంటుంది. ఈ లెక్కన హెచ్చెల్సీ వాటా కింద మరో అర్ధ టీఎంసీ అదనంగా జలాలు రానున్నాయి. ఈ అర టీఎంసీ నీటిని కూడా తీసుకున్నా గరిష్ఠంగా ఈనెలాఖరు దాకా ప్రవాహం కొనసాగే అవకాశం ఉంటుంది.

**సరిహద్దుకు 26.165 టీఎంసీలు**

టీబీ జలాశయానికి నీటి లభ్యతకు అనుగుణంగా కేటాయింపులు జరుగుతాయి. గతేడాది జూన్ 6న తొలి నీటి సమీక్షలో 172 టీఎంసీలు లభ్యమవుతాయని అంచనా వేశారు. ఇందులో హెచ్చెల్సీ వాటాగా 26.368 టీఎంసీలు కేటాయించారు. ఆ తర్వాత వానలు విస్తారంగా కురవడంతో నీటి లభ్యత అంచనాలు పెరిగాయి. ఆ తర్వాత గతేడాది నవంబరు 12న రెండో నీటి సమీక్ష జరిగింది. అప్పటి గణాంకాల ప్రకారం డ్యాంలోకి 192 టీఎంసీలు వస్తాయని అంచనా వేసి.. హెచ్చెల్సీకి 29.434 టీఎంసీలు కేటాయిస్తూ నిర్ణయం జరిగింది. ఈ 29.434 టీఎంసీలకు అదనంగా కేసీ కాలువ మళ్లింపు వాటాలో మరో రెండు టీఎంసీలను కేటాయించారు. మొత్తం 31.434 టీఎంసీలు ఈదఫా రావాలి. ఇప్పటిదాకా డ్యాం వద్దే 29.854 టీఎంసీలు విడుదల కాగా.. జిల్లా సరిహద్దుకు 26.165 టీఎంసీలు చేరాయి.

**ఆ రెండు కాలువలే కీలకం**

హెచ్చెల్సీ ప్రధాన కాలువ, జీబీసీ కింద నీటి ప్రవాహ సమయంలోనే పంటలు సాగు చేసుకుంటారు. ఇప్పటికే ఖరీఫ్ కింద వరి సాగు పూర్తయింది. ఈ రెండు కాలువల కింద దాదాపు పంట కోతలు పూర్తయ్యాయి. హెచ్చెల్సీ జలాలపై ఆధారపడి రెండో పంట వేసుకోవడానికి ప్రధాన కాలువ, జీబీసీ కింద పూర్తిగా అవకాశం లేదు. కాకపోతే.. బోరుబావుల కింద రెండో పంట సాగు చేసుకోడానికి ఇప్పటికే వరి నార్లు పోసుకున్నారు. మరికొందరు ఆరుతడి పంటలు సాగు చేస్తారు. ఏటా మాదిరే ఈదఫా కూడా హెచ్చెల్సీ జలాలతో రెండో పంట సాగు చేసుకోడానికి వీలులేదు. ఈ ఖరీఫ్‌లో హెచ్చెల్సీ ప్రాజెక్టు అన్ని కాలువల కింద దాదాపు లక్ష ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుత వాటా ప్రకారం హెచ్చెల్సీ జలాలు ఈనెల 22వ తేదీ దాకా మాత్రమే వస్తాయని ఎస్ఈ రాజశేఖర్ తెలిపారు. ఈ విషయాన్ని రైతులకు ఇప్పటికే తగిన అవగాహన కల్పించినట్లు వివరించారు.

# మాటిచ్చారు.. నిలబెట్టుకున్నారు..



ధర్మవరం : ముఖ్యమంత్రి చంద్రబాబు 2024 జూన్‌లో ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రాష్ట్ర ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి వచ్చే సంక్రాంతి నాటికి సొంత ఊర్లకు వచ్చే ప్రజల ప్రయాణం సాఫీగా సాగాలని రోడ్లు, భవన నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. గుంతలు పడిన రహదారులకు వెంటనే మరమ్మతులు చేయించాలని అప్పటికప్పుడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సంబంధిత శాఖాధికారులు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందిగా మారిన గుంతల రహదారులను గుర్తించారు. మరమ్మతులకు అవసరమైన నిధులకు ప్రతిపాదించారు. కూటమి ప్రభుత్వం ఆగమేఘాలపై వాటికి నిధులు మంజూరు చేసింది. దీంతో అధికారులు వేగంగా గుంతలను పూడ్చడంతో రహదారులపై ప్రయాణం రయ్ రయ్ మంటూ సాగుతోందని వాహనదారులు, పండగకు గ్రామాలకు వచ్చినవారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**చలనం లేని గత వైకాపా ప్రభుత్వం**

గత ఐదేళ్ల వైకాపా పాలనలో పట్టణ, గ్రామీణ ప్రధాన రహదారులు బాగా దెబ్బతిని గుంతలమయంగా మారాయి. వీటిపై ప్రయాణించాలంటే ప్రజలకు నిత్యం నరకం కనబడేది. పలు ప్రాంతాల్లో గుంతలుపడిన దారులపై వాహనదారులు వేగాన్ని నియంత్రించుకోలేక అందులో పడి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు కోకొల్లలు. గాయాలపాలైనవారి సంఖ్య లెక్కలేదు. అయినా కూడా నాటి ప్రజాప్రతినిధుల్లో చలనం లేకపోయింది. తమ నియోజకవర్గాల్లో గుంతలుపడిన వాటికి నిధులు తెచ్చుకోవడంలో వారు పూర్తిగా విఫలమయ్యారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ఇబ్బందులను తీర్చింది.

**25 లోపు మిగతావి పూర్తి చేస్తాం : సంజీవయ్య, ర.భ.శా. జిల్లా ఈఈ**

గత డిసెంబరులో అక్కడక్కడ వర్షాలు కురవడంతో పనులు కాస్త ఆలస్యమయ్యాయి. లేదంటే వంద శాతం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈనెల 25 లోపు మిగతా పనులు పూర్తి చేసి గుంతలను పూడ్చివేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.


జిల్లావ్యాప్తంగా 436 కి.మీటర్లలో 119 పనులకుగానూ రూ.16.37 కోట్లు మంజూరు చేశారు.. ఈ పనులకు అధికారులు టెండర్లు ఆహ్వానించి సకాలంలో పనులు చేయించడంతో ఇప్పటికే 436 కి.మీటర్లలో 317 కి.మీ. మేరకు పనులు చేసి 79 శాతం పూర్తి చేశారు.

# పట్టణ ప్రణాళిక పైసా వసూల్

విశాఖపట్నం : జీవీఎంసీ పరిధిలో భవన నిర్మాణదారుల నుంచి గతంలో వైకాపా కార్పొరేటర్లు ముక్కుపిండి వసూళ్లు చేశారు. కూటమి ఏర్పాటయ్యాక కొన్ని చోట్ల వైకాపా నాయకులు వెనకడుగు వేయగా, ఆ బాధ్యతలు పట్టణ ప్రణాళిక అధికారులు తీసుకున్నారన్న ఆరోపణలొస్తున్నాయి. వార్డుల్లో ప్లానింగ్ అండ్ రెగ్యులేటరీ కార్యదర్శుల సమాచారంతో కొన్ని కొర్రీలు వేసి...ఏ భవనం వద్ద ఎంత వసూలు చేయాలో లెక్కలు వేసి మరీ జేబులు నింపేసుకుంటున్నారు. యజమానులను కార్యాలయాలకు రప్పిస్తూ: 'పట్టణ ప్రణాళిక' విభాగం గాడి తప్పింది. నగరంలో పలు చోట్ల భవన నిర్మాణదారులను బెదిరిస్తున్నారు. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు సిఫార్సులు చేసినా వసూళ్ల విషయంలో తగ్గడం లేదు. ఎవరైనా బిల్డర్లు, భవన యజమానులు మాట వినకపోతే నిబంధనల ఉల్లంఘనలపై పత్రికల్లో వార్తలొస్తున్నాయంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. పీడీఎఫ్ పేపర్లు చూపించి మీరు వచ్చి సహాయ ప్రణాళికాధికారిని కలవండంటూ వార్డు ప్లానింగ్ కార్యదర్శులు ఫోన్‌లు చేసి మరీ యజమానులను కార్యాలయాలకు రప్పిస్తున్నారు. లేదంటే ప్రణాళికాధికారులే భవన యజమానులకు ఫోన్ చేసి ఫలానా వ్యక్తి కలుస్తారు సెటిల్ చేసుకోండి అంటూ చెబుతున్నట్లు సమాచారం.

**లేదంటే ఫిర్యాదు...**

సామాజిక మాధ్యమాలకే పరిమితమైన పీడీఎఫ్‌లలో వచ్చిన వాటికి కొందరు భవన నిర్మాణదారులు స్పందించడం లేదు. దీంతో అలాంటి నిర్మాణాలపై సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొందరు ఫిర్యాదు చేస్తున్నారు. వాటిపై విచారణ చేయాలని ప్లానింగ్



అధికారులకు చెప్పగానే, నిర్మాణదారులను పిలిపించి మాట్లాడుతున్నారు. దీంతో నిర్మాణదారు దిగొచ్చి ఫిర్యాదిదారుకు కాసులివ్వాల్సి వస్తోందనే ఆరోపణలున్నాయి. ఇటీవల కొన్ని స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు సైతం అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేస్తూ పంచాయితీలు చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

సంక్రాంతి పండుగ పేరుతో కొన్ని జోనల్ కార్యాలయాలకు లక్ష్యం పెట్టినట్లు సమాచారం. ఎవరెవరికి ఇవ్వాలో వివరిస్తూ బిల్డర్ల నుంచి కొందరు ప్రణాళికాధికారులు వసూలు చేసినట్లు ఆరోపణలొస్తున్నాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి ఈ అంశంపై విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయి. ఈ విషయంపై సీసీపీ ప్రభాకర్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

గుర్తింపులేని కొన్ని పీడీఎఫ్ పత్రికల పేరుతో వార్డుల్లో భవన నిర్మాణదారులను బెదిరిస్తున్నారు. వాట్సప్ గ్రూపుల్లో వచ్చే ఆ పీడీఎఫ్‌లు చూపించి జీవీఎంసీ అధికారులు హడావుడి చేస్తున్నారు. కొందరు పట్టణ ప్రణాళిక, జోనల్ కార్యాలయాల్లో అనధికారికంగా గంటల తరబడి కూర్చొని పంచాయితీలు చేస్తున్నారు. ఇలాంటివారిపై చర్యలు తీసుకోవాలి. ఇదీ గతేడాది డిసెంబరులో ప్రాంతీయ స్థాయి రెవెన్యూ సదస్సుకు హాజరైన మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు చేసిన ఫిర్యాదు.

# ఇది కదా... అసలైన పండగ

విశాఖపట్నం: తెలుగు ప్రజల పెద్ద పండగ సంక్రాంతి. మూడు రోజుల పాటు సందడిగా గడిపేందుకు ఇంటిల్లిపాదీ ఏడాదంతా ఎదురుచూస్తారు. తెదేపా, జనసేన, భాజపా కూటమి ప్రభుత్వం కొలువుదీరాక తొలి సంక్రాంతి ఇది. ఈ సమయంలో వివిధ వర్గాల ప్రజలకు మేలు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, గుత్తేదారులకు బకాయిలు చెల్లించేందుకు రూ.6,700 కోట్లు విడుదల చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా ప్రకటించారు. దీంతో జిల్లాలోని వివిధ వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**విద్యార్థులకు ఊరట..**

అయిదేళ్ల వైకాపా పాలనలో విద్యాదీవెన (బోధనా రుసుము), వసతి దీవెన (ఉపకార వేతనాలు) నిధులు సమయానికి విడుదల చేయకుండా విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి జిల్లాలో దాదాపు 70 వేల మంది విద్యార్థులకు మొత్తం రూ.130 కోట్లకు పైగా రావాల్సి ఉంది. విద్యార్థుల ఇబ్బందులు గుర్తించిన మంత్రి నారా లోకేశ్ దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర వ్యాప్తంగా 6.50 లక్షల మందికి మేలు జరిగేలా రూ.788 కోట్ల బకాయిలు చెల్లించేందుకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

అగనంపూడి నుంచి అనకాపల్లి వరకు: వైకాపా హయాంలో జాతీయ రహదారిని నిర్లక్ష్యం చేశారు. దీంతో అనకాపల్లి వైపు నుంచి నగరానికి రావాలంటే వాహనదారులు అవస్థలు పడేవారు. ఇటీవల రహదారుల నిర్మాణం ప్రారంభించారు. అగనంపూడి టోల్‌గేట్ నుంచి అనకాపల్లి వరకు ఒకవైపు నిర్మాణం పూర్తయింది. మరోవైపు పనులు జరుగుతున్నాయి. దీంతో విశాఖ వైపు వచ్చేవారికి ప్రయాణం సాఫీగా సాగుతోంది. కూర్మన్నపాలెం నుంచి షీలానగర్ వరకు రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అది కూడా నిర్మిస్తే నగరంలోకి రాకపోకలు ఇబ్బందుల్లేకుండా జరుగుతాయి.

**చిన్న గుత్తేదారులకు బకాయిలు**

జిల్లాలో గుత్తేదారులకు బకాయిలు పెద్దఎత్తున పేరుకుపోయాయి. దీంతో చిన్న గుత్తేదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కుటుంబ పోషణకూ చేతిలో డబ్బులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి దశల వారీగా బిల్లులు విడుదల చేస్తోంది. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా రూ.10 లక్షల లోపు బకాయిలు విడుదల చేసేందుకు నిర్ణయం తీసుకుంది.

# భాగ్యశ్రీ కాంత - చీరలో చందమామే..

మల్టీలింగ్వల్ సినిమా 'కాంత' నుంచి హీరోయిన్ భాగ్యశ్రీ బోర్స్ ఫస్ట్ లుక్ విడుదలైంది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ వాలెంటైన్స్ డే స్పెషల్‌గా విడుదల చేసి సినిమాపై క్రేజ్ మరింత పెంచేశారు మేకర్స్. దుల్కర్ సల్మాన్ సరసన భాగ్యశ్రీ బోర్స్ కీలక పాత్రలో నటిస్తుండగా, ఈ సినిమాను రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్ స్పిరిట్ మీడియా - వేఫారెర్ బ్యానర్లపై నిర్మిస్తున్నారు. దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ పీరియడ్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఫస్ట్ లుక్‌లో భాగ్యశ్రీ బోర్స్ సంప్రదాయ లుక్‌లో చందమామ లాంటి మెరుపులా మెరిసింది. గులాబీ రంగు చీరలో ఆమె అందం కనువిందు చేస్తోంది. పొడవైన జడ, పసిడి ఆభరణాలు ఆమె అందానికి మరింత కళను తెచ్చాయి. వింటేజ్ లుక్‌లో భాగ్యశ్రీని చూసిన సినీ ప్రియులు సోషల్ మీడియాలో ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. ఆమె రూపం చూస్తే




1950ల కాలం మన కళ్లముందు ప్రత్యక్షమవుతుందనిపిస్తోంది. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా, దుల్కర్ సల్మాన్ వేఫారెర్ ఫిలిమ్స్ తో పాటు సురేశ్ ప్రొడక్షన్స్ కలిసి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ 1950ల మద్రాస్ కాలాన్ని ఆధారంగా చేసుకుని ఈ సినిమాను రెడీ చేస్తున్నారు. ఇందులో సముద్రఖని కూడా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా మానవ సంబంధాలు, సామాజిక మార్పుల నేపథ్యంలో సాగే ఒక ఎమోషనల్ జర్నీగా రూపొందనుంది. 'కాంత' సినిమాలో భాగ్యశ్రీ బోర్స్ పాత్ర చాలా కొత్తగా ఉంటుందట, ఆమెకు దుల్కర్ సల్మాన్‌తో ఉండే కెమిస్ట్రీ సినిమాకి హైలైట్ కానుంది. పీరియడ్ డ్రామా నేపథ్యంలో మానవ సంబంధాలు, ఆ కాలపు సాంస్కృతిక వాతావరణం కళ్ళకు కట్టినట్లు చూపించబోతున్నారు దర్శకుడు. ఇప్పటికే సినిమా షూటింగ్ పూర్తయింది, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. టెక్నికల్ క్రూ విషయానికి వస్తే, సినిమాటోగ్రఫర్ గా దాని శాంచేజ్ లోపెజ్ పనిచేస్తుండగా, ఆర్ట్ డైరెక్టర్ రామలింగం పీరియడ్ సెట్‌లను రియలిస్టిక్‌గా సృష్టిస్తున్నారు. సంగీత దర్శకుడు ఝాను ఎమోషనల్ మ్యూజిక్‌తో సినిమాకు ప్రాణం పోసే ప్రయత్నం చేస్తున్నారు. మొత్తానికి భాగ్యశ్రీ బోర్స్ ఫస్ట్ లుక్ సినిమాపై భారీ అంచనాలను రేపుతోంది. పీరియడ్ డ్రామా, ఎమోషనల్ కథనం, దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్స్ మధ్య కెమిస్ట్రీ ఈ సినిమాకు ప్లస్ పాయింట్స్‌గా మారనున్నాయి.

# ఆ సమయంలో బతకాలనిపించలేదు..!

ప్రధాని నరేంద్ర మోడీ ప్రతి ఏడాది 'పరీక్షా పే చర్చ' కార్యక్రమం నిర్వహిస్తూ ఉంటారు. ఈసారి కార్యక్రమంలో మోడీతో పాటు స్టార్ హీరోయిన్ దీపికా పదుకునే, బాక్సర్ మేరీ కోమ్, సద్గురు, యూట్యూబర్ రాధిక గుప్తా ఇంకా పలు రంగాలకు చెందిన ప్రముఖులు హాజరు అయ్యారు. విద్యార్థులు పరీక్షల సమయంలో ఆందోళన చెందనక్కర్లేదని, ఏ విషయాన్ని అయినా మానసిక ఒత్తిడికి గురి అయ్యేంత సీరియస్‌గా తీసుకోవద్దు అంటూ కార్యక్రమంలో హాజరు అయిన వారు సూచించారు. తాజాగా పరీక్షా పే చర్చ కార్యక్రమంకు సంబంధించిన పూర్తి ఎపిసోడ్‌ను ప్రధాని నరేంద్ర మోడీ యూట్యూబ్ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చారు. మోడీ 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో పాల్గొన్న హీరోయిన్ దీపికా పదుకునే తన జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లు గురించి చెప్పుకొచ్చింది. ఒకానొక సమయంలో తాను తీవ్రమైన మానసిక ఆందోళనకు గురి అయినట్లుగా చెప్పింది. తాను ఆ సమయంలో చనిపోవాలని అనుకున్నాను. చనిపోయేందుకు ఎన్నో రకాలుగా ఆలోచనలు వచ్చేవి. కానీ తను తాను



మోటివేట్ చేసుకుంటూ ముందుకు సాగుతూ వచ్చాను. స్కూల్ డేస్‌లో చదువు కంటే క్రీడల పట్ల ఆసక్తి, ఆ తర్వాత కొన్నాళ్లకు మోడలింగ్‌పై ఆసక్తి పెరిగింది. మోడలింగ్ నుంచి యాక్టింగ్‌కి షిఫ్ట్ అవుతూ వచ్చాను. ఆసక్తి ఉన్న వైపు అడుగులు వేయాలని తాను భావిస్తాను అంది. 2014 నుంచి తాను మానసికంగా కుంగుబాటుకు గురి అయ్యాను. నాలో నేను బాధ పడుతూ ఉండేదాన్ని. నా సమస్య ఏ ఒక్కరి కళ్లకు కనిపించేది కాదు. కానీ ప్రతి క్షణం మనల్ని ఆ సమస్య వేదిస్తూ ఉంటుంది. మనమే కాకుండా మన పక్కన ఉన్న వారు, చుట్టూ ఉన్న వారు ఆ సమస్యతో బాధపడుతూ ఉంటారు. కానీ మనకు ఆ విషయం అర్థం కాదు. ముంబయిలో ఒంటరిగా ఉన్న సమయంలో ఆ సమస్య మరింత ఎక్కువ అయ్యింది. ఒకసారి అమ్మ ముంబయి వచ్చిన సమయంలో చెప్పాను. ఆమె నా సమస్యను అర్థం చేసుకుని ఒక సారి సైకాలజిస్ట్ వద్దకు వెళ్లమని సూచించారు. ఆమె ప్రోత్సాహంతో తాను సైకాలజిస్ట్ వద్దకు వెళ్లాను. ప్రతి మనిషి జీవితంలోనూ ఆందోళన, కుంగుబాటు, ఒత్తిడి అనేది ఉంటుంది. వాటికి భయపడి తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దు. ఇతరులతో పంచుకుంటే భారం తగ్గుతుందని భావిస్తే సన్నిహితులతో ఆ విషయాలను పంచుకోవడం ఉత్తమం. సమస్యను గురించి మనలో మనం ఫీల్ అవుతూ, బాధ పడుతూ ఉంటే తప్పుడు నిర్ణయాలకు ప్రేరేపితం కావచ్చు. అందుకే నలుగురితో మీ సమస్యను పంచుకోవడం ద్వారా కచ్చితంగా మంచి పరిష్కారం దక్కవచ్చు. అందుకే ఒత్తిడి, కుంగుబాటు సమస్యలను పెద్దవిగా చూడకుండా ఇతరులతో షేర్ చేసుకోవడం ద్వారా అంతా మంచి జరుగుతుందని దీపికా పదుకునే అభిప్రాయం వ్యక్తం చేశారు. తీవ్రమైన మానసిక ఒత్తిడిని జయించి, బతకాలి అనే ఆలోచన పూర్తిగా పోయిన దీపికా పదుకునే తిరిగి పుంజుకుని ఇప్పుడు బాలీవుడ్‌లో నెం.1 హీరోయిన్‌గా నిలిచింది. అందుకే ప్రతి ఒక్కరు ఆ వీక్ మూమెంట్‌లో తప్పుడు నిర్ణయాలు తీసుకోకుండా జీవితాన్ని సాగించాలి.





# విభిన్నంగా 'రాబిన్‌హుడ్' సెకండ్ సింగిల్




నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో గతంలో వచ్చిన 'భీష్మ' సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. దాంతో వీరిద్దరి కాంబోలో ప్రస్తుతం రూపొందుతున్న 'రాబిన్‌హుడ్' సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమాలో నితిన్‌కు జోడీగా మొదట రష్మిక మందన్న హీరోయిన్‌గా ఎంపిక అయింది. కానీ పుష్ప 2 సినిమా కోసం ఆమె ఎక్కువ డేట్లు కేటాయించాల్సి రావడంతో తప్పనిసరి పరిస్థితుల్లో రాబిన్‌హుడ్ సినిమాలో నితిన్‌కు జోడీగా రష్మిక స్థానంలో శ్రీలీలను నటింపజేశారు. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ వారు భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఈ సినిమా మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. సినిమా విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో అంచనాలు పెంచే విధంగా పాటలను విడుదల చేస్తూ వస్తున్నారు. ఇప్పటికే ఒక పాటను విడుదల చేసిన రాబిన్ హుడ్ టీం తాజాగా సెకండ్ సింగిల్‌ను విడుదల చేశారు. మొదటి పాట మాస్ ఆడియన్స్‌ను ఆకట్టుకునే విధంగా సాగింది. రెండో పాటను ప్రయోగాత్మకంగా ప్లాన్ చేశారు. పాపులర్ బ్రాండ్స్‌ను ఉపయోగించి పాటను ట్యూన్ చేశారు. లిరిక్స్‌లోనూ బ్రాండ్స్‌ను చెప్పడం ద్వారా వినూత్నంగా సెకండ్ పాటను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చారు. ఈ పాటతో సినిమా స్థాయి మరింతగా పెరుతుంది అనే విశ్వాసంను చిత్ర యూనిట్ సభ్యులు వ్యక్తం చేస్తున్నారు. సూపర్ స్టార్ మహేష్ బాబు ఈ పాటను విడుదల చేశారు. గత ఏడాది గుంటూరు కారం సినిమాలో మహేష్ బాబుకు జోడీగా శ్రీలీల నటించింది. ఆ సన్నిహిత్యంతోనే శ్రీలీల కోసం రాబిన్ హుడ్ సినిమాలోని ఈ రెండో పాటను మహేష్ బాబు విడుదల చేసి ఉంటారు అని తెలుస్తోంది. మొత్తానికి సూపర్ స్టార్ చేతుల మీదుగా పాట రిలీజ్ కావడంతో ఒక్కసారిగా అందరి దృష్టిని ఆకర్షించింది. మహేష్ బాబు సాంగ్ అద్భుతంగా ఉందని, తప్పకుండా ఈ సినిమా అందరికి నచ్చే విధంగా ఉంటుంది అంటూ యూనిట్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పాటను ఆన్ లైన్ ద్వారా విడుదల చేశారు. మహేష్ బాబు ట్వీట్ చేయడంతో చాలా తక్కువ సమయంలోనే అత్యధిక వ్యూస్‌ను ఈ పాట రాబట్టింది. ఈ సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందిస్తున్నారు. రెండో పాట విడుదలకు ముందు వెంకీ కుడుముల, జీవీ ప్రకాష్ కుమార్ చేసిన ఒక ఫన్నీ స్కిట్ అందరి దృష్టిని ఆకర్షించింది. దాంతో సినిమాలోని ఈ పాట చాలా స్పెషల్‌గా ఉంటుందని ముందుగానే అనిపించింది.

అనిపించినట్లుగానే విభిన్నంగా ఈ పాట సాగింది. ఆకట్టుకునే సంగీతంతో పాటు మంచి సాహిత్యం ఉండటం వల్ల పాటకు విడుదలకు ముందే మంచి స్పందన దక్కే అవకాశం ఉంది. ఈ పాటతో సినిమా జనాల్లోకి ఎక్కువగా వెళ్లే అవకాశాలు ఉన్నాయి. మార్చి చివర్లో రాబోతున్న ఈ సినిమా కోసం నితిన్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ మధ్య కాలంలో నితిన్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచాయి. కానీ రాబిన్‌హుడ్ పై మాత్రం పాజిటివ్ బజ్ క్రియేట్ చేయడంలో మేకర్స్ సక్సెస్ అయ్యారు.

# ఇది ఎప్పటికీ అంతం కాని యుద్ధం: నిహారిక




ఫిట్‌నెస్ అనేది అందాన్ని కాపాడే మంత్రం మాత్రమే కాదు. బలం, పట్టుదలను నిరూపించుకునే సాధనం. జిమ్‌లో కసరత్తులు చేయడం అంత సులువైన పనేమీ కాదు. చాలా పట్టుదల ఉంటేనే సమయపాలనతో జిమ్ కి నిరంతరం హాజరు కాగలరు. అయితే నిహారిక కొణిదెల శ్రమ, కమిట్‌మెంట్ చూస్తున్నవారికి తన సమయపాలన అవగతమవుతుంది. నిహారిక జిమ్ లో కఠినంగా శ్రమించడానికి కారణం.. నటనా రంగంలోకి కంబ్యాక్ అవ్వడమే. తాను అనుకున్న శిఖరానికి చేరడమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. నిహారిక తన తదుపరి చిత్రం %-%వాట్ ది ఫిష్%-% కోసం సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో అస్తా లక్ష్మి అనే పాత్రను పోషిస్తోంది. నిహారిక పాత్ర ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుందని సమాచాం. నిహారిక ఇంతకుముందే "నేను, నా ఫిట్‌నెస్... ఎప్పటికీ అంతం కాని యుద్ధం! ఎల్లప్పుడూ నన్ను ముందుకు నడిపిస్తున్నందుకు ధన్యవాదాలు" అని క్యాప్షన్ ఇచ్చింది నిహారిక. ఇదే పోస్ట్ లో ఆంటోనీ అనే పేరును ప్రస్తావించింది. ఈ వీడియో వేగంగా అభిమానుల దృష్టిని ఆకర్షించింది. వారు ఫిట్‌గా ఉండటానికి స్ఫూర్తి పొందుతున్నారు. జిమ్ లో నిహారిక నీలిరంగు బ్రాలెట్, షార్ట్ ధరించి, భారీ టీ-షర్ట్‌తో కనిపించింది. సూపర్ ఫిట్ అని నిరూపించుకోవడం ద్వారా కెరీర్ ని సరిదిద్దుకోవాలని తపించడం సరైనదే. అన్ని సవాళ్లను నెగ్గాలని మెగా ప్రిన్సెస్ అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# హిట్టొచ్చినా ఛాన్సుల్లేవ్.. హీరోయిన్‌ని టార్గెట్ చేసారా?

పరిశ్రమలో మేల్ డామినేషన్ ని ప్రశ్నించే నటీమణులకు అవకాశాలు దాదాపు లేనట్టే. ఎదురు దాడికి దిగడం, నిలదీయడం వంటివి సమస్యలను సృష్టిస్తాయి. సృజనాత్మక పరిశ్రమలో చాలా లౌక్యం అవసరం. అలాంటి వారికి మాత్రమే మనుగడ ఉంటుంది. కానీ అందుకు భిన్నంగా రచ్చ చేసే నటీమణులను ఇండస్ట్రీ టార్గెట్ చేస్తుంది. అలాంటి ఒక సమస్యను మలయాళ పరిశ్రమలో పార్వతి తిరువోతు ఎదుర్కొన్నారా? అంటే.. అవుననే తన నుంచి సమాధానం. పార్వతి తిరువోతు వరుసగా హిట్ సినిమాల్లో నటిస్తోంది. అయినా అవకాశాలు రావడం లేదు. దీనికి కారణమేమిటి? అని ప్రశ్నిస్తే... ఎంపికల విషయంలో సెలక్టివ్ గా ఉండటం ఒక కారణమైతే, కొందరు హీరోలతో తాను నటించనని చెప్పడం మరో కారణమని కూడా పార్వతి స్వయంగా తెలిపారు. అలాగే మలయాళ చిత్ర పరిశ్రమలో తాను ఎదుర్కొన్న ఇతర సవాళ్ల గురించి బహిరంగంగా చర్చించారు. విజయాలు అందుకున్నా.. పరిమితంగానే అవకాశాలొస్తున్నాయి. కొందరు నటులతో నేను నటించలేదు. దానివల్ల వాళ్లు అవకాశాలివ్వరు.. అని పార్వతి అన్నారు. తాను కూడా వారితో పనిచేయడానికి ఆసక్తి చూపడం లేదు. తన కంటూ కొన్ని నిబంధనలు ఉన్నాయని అంగీకరించింది. కొందరిని కాదనుకునే కొనసాగాలనే తన నిర్ణయంలో స్థిరంగా ఉన్నానని తెలిపారు. కొన్ని ఎదురు దెబ్బలు, అవకాశాల్లేక



పోవడం కూడా స్వావలంబన వైపు ఆలోచించేలా చేసాయని పార్వతి అన్నారు. అవకాశాలు కోల్పోవడం గురించి తాను ఇంతకుముందు కూడా మాట్లాడానని చెప్పిన పార్వతి.. అది ఇప్పటికీ ఒక కీలకమైన సమస్యగానే ఉందని అన్నారు. పరిశ్రమలో ఒకరిని సైలెంట్ చేయడానికి అత్యంత ప్రభావవంతమైన మార్గాలలో ఒకటి -వారికి పని లేకుండా చేయడం - అని తాను నమ్ముతోంది. అవకాశాలు లేకుండా ఎవరైనా నటీనటులు స్కిల్‌ని పెంచుకోలేరని పార్వతి అన్నారు. తమిళం, తెలుగు, హిందీ చిత్రాలలో నటించినా.. మలయాళంలో తనకు లభించిన అవకాశాలు తాను ఊహించిన దానికంటే చాలా తక్కువగా ఉన్నాయని పార్వతి వివరించింది. నేను కొందరితో నటించలేదు. వారు సహజంగానే అవకాశాలివ్వరు. కేవలం హీరోలే కాదు సాంకేతిక నిపుణులు కూడా అవకాశాలు రాకుండా చేస్తారని పార్వతి అన్నారు. నటీనటుల ఎంపిక సృజనాత్మక ఎంపిక అయినా కానీ, సరిపోయే పాత్రలకు నటులను తీసుకోవాలని అన్నారు. గత ఇంటర్వ్యూలో ఓసారి పార్వతి తాను పరిశ్రమ నుండి దూరంగా ఉన్నానని ప్రస్తావించింది. అయితే తాను పరిశ్రమను వదిలి వెళ్లిపోలేదని స్పష్టం చేసింది. ఒక జిల్లా నుండి మరొక జిల్లాకు వెళ్లడం అంత సులభం కాదని - మార్కెట్ డైనమిక్స్ మారుతాయని, నటులు తదనుగుణంగా మారాలని ఆమె వివరించింది. ఇతర పరిశ్రమలలో మంచి అవకాశాలు వస్తే నటించడానికి తాను సిద్ధంగా ఉన్నానని పార్వతి అన్నారు. సిటీ ఆఫ్ గాడ్స్, బెంగళూరు డేస్ చిత్రాల మధ్య నాలుగు సంవత్సరాల గ్యాప్ ఉంది. ఆ సమయంలో రీఎంట్రీ ఇచ్చిందని కూడా అన్నారు. కానీ నేను అలా భావించలేదు! అని పార్వతి తిరువోతు తెలిపారు. టేక్ ఆఫ్, ఎన్ను నింటే మొయిదీన్, ఉయారే, చార్లీ వంటి చిత్రాలు వాణిజ్యపరంగా విజయం సాధించినా కానీ, ఆ తర్వాత కొన్ని మలయాళ చిత్రాలలో మాత్రమే నటించగలిగింది. ఆఫర్లు లేకపోవడం వల్ల నటించలేదు.

# జాన్వీ కపూర్ గత ఏడాదిలా మమా అనిపిస్తే సరిపోదు!

జాన్వీ కపూర్ కెరీర్ లో సరైన సక్సెస్ పడి చాలా కాలమవుతుంది. ఇంకా చెప్పాలంటే డెబ్యూ ధడక్ తర్వాత చేసిన సినిమాలేవి ఆశించిన ఫలితాలు అందించలేదు. టాలీవుడ్ లో లాంచ్ అవ్వనంత కాలం అమ్మడి ఎంట్రీపై విపరీ తమైన బజ్ క్రియేట్ అయింది. కానీ దేవర తో లాంచ్ అయిన తర్వాత అందులో అమ్మడి పాత్రకు ప్రశంసలకు బధులు విమర్శలు ఎదుర్కొంది. దేవర కు డివైడ్ టాక్ రాగా, అందులో జాన్వీ పాత్ర విమర్శలకు గురైంది. జాన్వీ ఆరేళ్ల కెరీర్ లో ఏడెనిమిది సినిమాలే చేసింది. వాటిలో చెప్పుకోదగ్గవి ధడక్ .. ఆ తర్వాత దేవర మాత్రమే. దేవరతోపాటు గత ఏడాది మిస్టర్ అండ్ మిస్టర్స్ మహి, ఉలజ్ చిత్రాలతో ప్రేక్షకుల



ముందుకొచ్చింది. ఈ రెండు కూడా ఆశించిన ఫలితాలివ్వలేదు. అంతకు ముందు ఏడాది...ఇంకా ముందుకెళ్లినా? జాన్వీ ఖాతాలో విజయాలు ఎక్కడా కనిపించలేదు. దీంతో జాన్వీ కపూర్ కి బాలీవుడ్ లో ఇప్పటికిప్పుడో సక్సెస్ అనివార్యమైంది. గతం తరహాలో ఇప్పుడు థియేటర్లోకి వచ్చి మమా అనిపిస్తే సరిపోదు. బ్లాక్ బస్టర్ పడాల్సిందే. ప్రస్తుతం జాన్వీ కపూర్ నటిస్తోన్న హిందీలో రెండు చిత్రాలు రిలీజ్ కి రెడీ అవుతున్నాయి. సన్నీ సంస్కారీకి తులసీ కుమారీ పరమ్ సుందరి చిత్రాల్లో నటిస్తోంది. అలాగే తెలుగులో ఆర్సీ 16లోనూ నటిస్తోంది. ఈ మూడు ఇదే ఏడాది ప్రేక్షకుల ముందు కొస్తున్నాయి. వాటిపై అంచనాల సంగతి పక్కన బెడితే జాన్వీ మాత్రం హిట్ కొట్టాల్సిందేనని టాక్ బలంగా మొదలైంది. ఈ సినిమాలు కూడా అటు ఇటూ అయితే? జాన్వీ సక్సెస్ రేస్ నుంచి పూర్తిగా తప్పుకోవాల్సిందేనని మాట అంతే బలంగా వినిపిస్తుంది. పటౌడీ వారసురాలిగా ఎంట్రీ ఇచ్చిన సారా అలీఖాన్ ఇప్పటికే అదే ఫేజ్లో కొనసాగుతుంది. ఆరంభంలో దక్కిన గౌరవం..గుర్తింపు ఇప్పుడు దక్కడం లేదు. కారణం వరుస వైఫల్యాలు ఎదురవ్వడం అన్నది వర్ధమాన భామలంతా గుర్తించాలి. మరి ఈ విషయాల్ని జాన్వీ ఎంత వరకూ పరిగణలోకి తీసుకుంటుందో చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536